
శ్రీనాథ
కవిసార్వభౌము



శ్రీనాథ కవి సార్వభౌమ

(విజయాంబిక)

పోలాప్రగడ సత్యనారాయణమూర్తి ఎం. ఏ.

సర్వస్వామ్య సంకలితము

ప్రకాశకులు
పోలాప్రగడ సత్యనారాయణమూర్తి
106, శ్రీనివాస అపార్ట్‌మెంట్స్
హుమయూన్ నగర్,
హైదరాబాద్ - 28.

Hyd-36

ప్రథమ ముద్రణ - 1957
ద్వితీయ ముద్రణ - 1972
తృతీయ ముద్రణ - 1976
చతుర్థ ముద్రణ - 1993

Prescribed as Telugu Non - Detailed Text for 1st year P. U. C. in the entire karnataka State from 1973 to 1979.

* *

Prescribed as Telugu Non - Detailed Text for B. A. & B. Com. Entrance Examination of Andhra University from 1981 May.

వెల: రూ. 10-00

ప్రతులకు :
పోల్ డిస్ట్రిబ్యూటర్స్
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, విజ్ఞానభవన్ బ్యాంకుస్ట్రీట్
హైదరాబాదు - 500 001
విశాలాంధ్ర బుక్‌హౌస్
విజయవాడ, హైదరాబాదు, గుంటూరు,
విశాఖపట్నం, అనంతపురం, తిరుపతి,
హన్మకొండ, కాకినాడ,

ఋతువు మారి శరత్తు ప్రవేశించినది. ప్రొద్దునిలువదు. అందు వలన చీకటిపడకుండగనే ఇల్లు చేరుకొనవలెనను తలంపుతో ...చయ్య గుఱ్ఱము నదలించెను. వెంటనే యది చెవివరకులాగి వదలిన బాణము వలె రివ్వున ముందరికి దూసికొని పోసాగెను. దాని గిట్టల వలన లేచిన ధూళి, అస్తంగత సూర్యుని అరుణ కాంతిలో పుప్పొడివలెను, కులాయములకు పోవుచున్న పక్షులు హారమునకు తుమ్మెదల వలెను తోచి ఆప్రదేశము నంతటికి ఉద్యాన రమణీయతను సంతరించు చుండెను.

ఆ యందమును చూచి యానందించెడి స్థితిలో లేడు ...చయ్య. అతని ఆలోచనలన్నియు నెదురుగా సుదూరమున గోదావరి కవ్వల కన్పించుచున్న రాజమహేంద్రవరము ...రించివే !

కాటయ వేమ ప్రభుని దేహస్థితి ఎట్లుండెనో !

రాజమహేంద్రవర రెడ్డిరాజ్యము యొక్క భవిష్యత్తేమగునో !

నిన్న ఉదయము తన తండ్రియైన గంగారెడ్డి ఆదేశాను ...రము రాజమహేంద్రవరమునుండి కాజ్జరపర్తి బయలుదేరిన ...ను, బాల్యసఖుడు, అమాత్యవరుడునైన బెండపూడి అన్న మామాత్యుల ఆదేశానుసారము వెనుకటి సాయంత్రమున కే

తిరిగి రాజమహేంద్రవరము చేరుకొన వలసి యున్నది. కాని కొండ్కూరవర్తిలో నాయనగారి మిత్రుడైన బేతిరెడ్డిగారి బలవంతముపై ఆరోజచట నాగి పోవలసి వచ్చినది.

బాచయ్య యిట్లాలోచనల నుండి తేరుకొను సంతటిలో గోదావరిని సమీపించెను. పావనగౌతమిని గాంచినదే తడవుగ ఛెంగున గుఱ్ఱమునుండి క్రిందికి లంఘించి సభక్తికముగ చేతులు జోడించి నదికి నమస్కరించెను.

ఇటునటుగట్లపై నున్న రెల్లుదుబ్బులు వృద్ధగౌతమీనది తెల్లని నెరిజుట్టువలెను, మధ్యముగ ప్రవహించుచున్న ఆ తిన్నని నీటిజాలు ఆమె తీసికొనిన పాపటవలెను, ఆనీటిపై ఎఱ్ఱగా మెరయు సంధ్యాసూర్యుని అరుణకాంతి ఆ పుణ్యవతి పాపటలో రాచిన సిందూరరేఖ వలెను బాచయ్యకు తోచినది. ఆపవిత్ర సౌందర్య శోభకు ముగ్ధుడై సంతోషపులకిత స్వాంతుడైనాడు బాచయ్య.

ఇంతలో నతనికి నెదురుగ పదిబాహువుల దూరమున గోదావరిని దాటుటకు ప్రయత్నించుచున్న నొకానొక వ్యక్తి గోచరించెను. వెంటనే సమీపించి హెచ్చరించి, అప్రయత్నము విరమింపజేసి, "ఇచట గోదావరి అందదు. నాలుగు సిబ్బువుల లోతు. అటువైపు ఏనుగులును కడుగుదురు. తెలియదా? విదేశీయుడవా? నేను హెచ్చరించి వారింపకున్నచో ఈపాటికి నీవును నీ గుఱ్ఱమును నిష్కారణముగ మరణించియుందురు" అనినాడు బాచయ్య.

ఆ మాటలు విని ఆ యువకుడు భయవిహ్వలుడై ఒక మారు నీటివంక చూచి, వెంటనే కృతజ్ఞతతో బాచయ్యను చూచెను. అతని చూపులు బాచయ్య నాకర్షించినవి. వెంటనే బాచయ్య ఆయువకుని ఆపాదమస్తకము పరిశీలించెను.

ఆకర్షణీయమైన సుందర రూపము! నూగుమీసమైనను రాని మృదువైన లేతమోము ప్రయాణపుబడలిక వలననొక్కింత శుష్కించినను వన్నె తఱుగలేదు. తలపాగ, అంగరఖా, ధోవతి వలన శరీరమంతయు నాచ్ఛాదితమై ముఖము, చేతివ్రేళ్ళు మాత్రమే కన్పించుచుండెను. సన్ననిపొడవైన వ్రేళ్ళు ఆయువకుని సౌకుమార్యమును చెప్పకయే చెప్పుచుండెను. అతని బెదరు చూపులు, ఒయ్యారముగ నిలుచున్న ఆతీరు బాచయ్య కెంతయు నాకర్షించినవి. 'యువకుని వేషములోనున్న యువతివలె నీత డెంత దర్శనీయముగ నున్నాడు!' అనుకొనెను బాచయ్య.

"నీవును నీగుఱ్ఱమును డస్సినట్లున్నారు. దూర ప్రయాణముచేసితివా? రాజమహేంద్రవరము పోవలయునా? నేనుకూడ నచటికే. నాతోరమ్ము. అదిగో! అచట గోదావరివంపుతిరిగిన దే, అచట నున్నది పాటిరేవు" అనుచు నతనితో కలసి పాటిరేవువైపు నడచుచు నొకచోనాగి 'నీపేరేమి?' అని బాచయ్య యడిగెను.

అంధుల కాయువకుడు "వి...వి...విజ...యుడు" అని తత్తరపడుచు సమాధానమిచ్చెను. వీణ మీటినట్లు శ్రావ్యముగ వినిపించిన ఆకంఠస్వరమున కాశ్చర్యపడినాడు బాచయ్య.

గుఱ్ఱముల కళ్ళెముల నొకచేతను, పిక్కల వరకును ఎత్తిన ధోవతిని మరియొక చేతను పట్టుకొని యువకుని పాటి రేవు దాటుచుండగా గౌతమి కావల ఎదురుగ కన్పించుచున్న రాజమహేంద్రవరమును బాచయ్య ఆయువకునికి తర్జనితో చూపించెను.

దుర్గములు, ప్రాసాదశిఖరములు, మార్కండేయస్వామి ఆలయగోపురము, ఎతనెత హరికేళాది వృక్షాగ్రములతో స్పష్టాస్పష్టముగ దూరమున కన్పించుచున్న రాజమహేంద్రవరవైభవమును, మల్లికామాలికలవలె తెల్లని కొంగలబారు, కౌస్తుభమువలె శరన్మేఘశకలము భాసింప, విశాలమైన వినీలాకాశము శ్రీమహావిష్ణువు వక్షస్థలమువలె నయనపర్వముగ శోభింప ఉదాత్తరామణీయకత నందించుచున్న సమీపప్రకృతిసౌభాగ్య సౌందర్యము నొడలంతయు కనులు చేసికొని జూచుచు, ఆ అందము నంతటిని మనసార గ్రోలుచు నాయువకుడు తన్మయ స్థితిలో నుండెను.

అతని స్థితిజూచి బాచయ్య యించుక నవ్వి, "ఆశ్చర్యముగ చూచుచుంటివేల? రాజమహేంద్రవరమును చూచుట యిదియే ప్రథమమా? మీది యేయూరు? ఎచటనుండి వచ్చుచున్నావ"ని ప్రశ్నించెను. అన్యమనస్కుడైన ఆ యువకుడు మొదట నా ప్రశ్న వినిపించుకొనక, పిదప తొట్రుపడుచు "కొండ..." అని రెండక్షరములుపలికి, తోడనే బాచయ్య ముఖకవళికలు గమనించి భయముతో నర్థోక్తితోనాగిపోయెను.

అప్పటికే బాచయ్య ముఖము జేవురించినది. కండుదలు ఎరుపెక్కినవి. క్రిందిపెదవి వణకసాగినది. కుడిచేయి అప్రయత్నముగ మొలనున్న బాకు పైకి వెళ్ళినది. భయవిహ్వలుడై గజగజలాడుచున్న విజయుని నిశితముగ జూచి "కొండవీటివాడవా? నేడు రాజమహేంద్రవరమునకును కొండవీటికి నెట్టి సంబంధములున్నవో తెలియును గదా!" అనుచు తీక్ష్ణముగ బ్రశ్నించెను బాచయ్య.

ఆ ప్రశ్న వెనుక నెంతయో చరిత్ర!

కొండవీటిని కుమారగిరి పాలించినంతవరకు, కొండవీటి రెడ్డిరాజులకును రాజమహేంద్రవర రెడ్డిరాజులకు నెంతయో సౌమనస్య మున్నది. రాజమహేంద్రవర ప్రభువైన కాటయ వేముడు దొడ్డాంబికవలన తనకు అనితల్లి హరిహరాంబల తరువాత జనించిన కుమారునకు కుమారగిరి అని నామకరణ మొనర్చి కొండవీటిరాజునందు గల గాఢానురక్తిని వెల్లడించుకొనెను. కొండవీటిలో కుమారగిరిని త్రోసిరాజని పెదకోమటి వేమ రాజ్యమును తన హస్తగత మొనర్చుకొనుటతో కొండవీటి రాజమహేంద్రవర సంబంధములు చెడినవి. కుమారగిరి పక్షపాతియైన కాటయవేముడు, పెదకోమటివేముని యాధిపత్యమును గుర్తింపక, కొండవీటితో తెగతెంపులు చేసికొని స్వాతంత్ర్యమును బ్రకటించినాడు.

అందుల కలిగి కాటయవేమునిపై కక్షగట్టి, ఒకవైపుగజపతులను, మరియొకవైపు విజయనగరరాజైన రెండవ దేవ

రాయలను, ఇంకొకవైపు బహమనీసుల్తాను నఫిరోజిషాను రాజ
మహేంద్రవరముపై పురికొల్పుచు నదను వచ్చినపుడు తాను
కూడ కయ్యమునకు కాలుదువ్వుచు రాజమహేంద్రవర
సామ్రాజ్యమునకు స్థిమితము లేకుండ పెదకోమటివేమారెడ్డి
తన శక్తికొలది చీకాకు కల్గించుచుండెను. ఫలితముగ రెండు
రాజ్యములకు మధ్య పచ్చగడ్డి వేసిన భగ్గుమనుచుండెను.

ఇంతటి గాథ యున్నది కనుకనే కోపోద్విగ్నుడై
బాచయ్య ఆ రీతిని తీక్ష్ణముగ ప్రశ్నించెను. ఆ ప్రశ్న వెనుక
నెట్టి అపోహాగలదో విజయుడిట్టే గ్రహించినాడు. అపోహాలు,
అనుమానములు నెట్టి విషమపరిణామములకు దారితీయునో
అతనికి ననుభవమువలన తెలిసిన విషయమే ! అట్టి అపోహా
కారణముననే కదా పెదకోమటివేమారెడ్డి [illegible] కుటుంబ
మును గృహనిర్బంధములో నుంచినది !

అపోహ కాక మరేమి !

రాజమహేంద్రవర ప్రణిధినాయకుడును తన పెదతల్లి
భర్తయు నైన నూరవరెడ్డిగారు మారువేషమున కొండవీడు
వచ్చి వెళ్ళుటేమి, ఆవార్త తెలిసి అందు తమ ప్రమేయముండు
నని అపోహపడి విచారణ యైనను జరుపకుండ నాయనగారిని
రాయసముపదవినుండితీసివేసి, వారితో కలిపి అమ్మను తనను
పెదకోమటిప్రభువు గృహనిర్బంధమున నుంచుటేమి? ఇటులనే
అనుమానముపై నెందరినో కొండవీటిలో పదవీభ్రష్టులను
జేయుట జరిగినది. ఎంతయో చాకచక్యముపయోగించి,

కావలివారి కనుగప్పి, అతికష్టముపై తానుమాత్రము నిర్బంధమునుండి తప్పించుకొని రాగలిగెను. ఇపుడిక తనకు రాజమహేంద్రివరమున పెదతండ్రిగారైన సూరపరెడ్డిగారే దిక్కు. వారితో సంప్రదించి తన తల్లిదండ్రులను బంధవిముక్తుల నొనరించు నుపాయ మన్వేషింపవలెను.

తల్లిదండ్రుల యవస్థ గుర్తుకురాగా విజయుని ముఖము విషాద పూరితమైనది. అది చూచి జాలిపడి మాటలో కాఠిన్యమును తగ్గించి "ఇంతకును నీవు పూర్తిగ చెప్పలేదు. కొండ... అని ఆగితివి. కొండవీటి వాడవేనా?" అని తిరుగ బాచయ్య ప్రశ్నించెను.

పరిస్థితిని గ్రహించిన విజయుడు వెంటనే కాదని తల అడ్డముగ నూపెను.

"మరి?...కాజ్కూరపర్తికి పది గవ్యూతుల దూరమున నున్న కొండగుదురా?"

విజయు డౌనని తల యాడించెను.

కాని బాచయ్య అతనిని వెంటనే విశ్వసింపలేదు. "నీవు రాజమహేంద్రివర మేల వచ్చుచున్నావు? అచట బంధువులున్నారా? ఎవరు? వారు నీకేమగుదురు?" అని వరుసగ ప్రశ్న వెంట ప్రశ్నవైచెను.

"రాజమహేంద్రవరమున ప్రణిధినాయకుడైన సూరపరెడ్డిగారు మాపెదతండ్రిగారు. ప్రస్తుతము 'నా' అన్నవారెవరును లేరు. నాకు వారేదిక్కు" అని అనుచుండగా విజయుని కనుల బాష్పములు నిండి కంఠము రుద్ధమైనది.

బాచయ్య ఉలికిపడెను. "ఏమి? ఇతడు సూరపరెడ్డిగారి బంధువా? వారు తప్ప ఇతనికి యెవరును లేరట! ఎన్ని ఆశల తోడనో యితడు రాజమహేంద్రవరము వచ్చుచున్నట్లున్నది. పాపము! సూరపరెడ్డిగారును వారి సతీమణియు [illegible] గృహదహనమున సజీవమరణము చెందినారనిన సంగతి యితనికి తెలియదు కాబోలు! తెలిసినచో నితడు నిరాశోపహతుడగును. అయినను తెలుపుట యెందులకు?" ఇట్లనుకొని బాచయ్య మౌనము వహించెను.

బాచయ్యతో కలిసి పాటిరేవు దాటుచున్న విజయుడును మాటాడుట లేదు. సాయంసూర్యుని కాంతిలో మందారమకరందా కినివలె భాసించుచున్న ఎఱ్ఱని గోదావరీసలిలములను, అందుండి యెగురుచున్న తెల్లని వెండిచేపల [illegible]ను వింతగ జూచుచుండెను.

సంభాషించుట లేదు కాని, బాచయ్య [illegible] ఆలోచనలు. ప్రణిధినాయకుడైన సూరపరెడ్డి [illegible]స్మరణముతో రాజమహేంద్రవర [illegible] వెన్నెముక విరిగినది. దానితోడు [illegible] క్షేమప్రభు వస్వస్థులై మంచాన బడిరి. ఇదియే యదనని ఉత్తరమున సామంతప్రభువులైన [illegible]రాజు, బుంగరాజు, వీరార్జునులు కప్పములు కట్టుటమాని [illegible]త్ర్యమును ప్రకటించిరి. పడమర అంపదొర, నాగార్జు[illegible] సమయము కొఱకు వేచియుండిరి. ఇక తూర్పున అన్న దేవచోడ సకేసరి, దక్షారామమును వశమును చల్ల చల్లగ నాక్రమించెను.

ఇదికాక అటు గజపతి, ఇటు విజయనగరరాయలు గన్నవరము రేవును కాజేయవలెనని కాచుకొనియుండిరి. కొంత పీటి పెదకోమటివేమప్రభువుసంగతి చెప్పనవసరమేలేదు. అవకాశము లభించినచో రాజమహేంద్రవర సామ్రాజ్యము సామ్రాజ్యమునే కబళించివేయవలెనని పొంచి కూర్చుండెను.

అన్నివైపుల కారుమేఘము లిట్లు క్రమ్ముకొని వచ్చుచున్నను, రాజమహేంద్రవరమున కొక ఆశాకిరణ మున్నది.

మహామంత్రి అల్లాడయే ఆ యాశాకిరణము.

దువ్వూరి వంశజుడైన అల్లాడప్రభువుండినంత వరకు రాజమహేంద్రవర సామ్రాజ్యమునకు భయములేదు. తన అశేష శేముషీ ధురంధరత్వముతో నతడు సామ్రాజ్యమును రక్షింపగలడు. ఆ నమ్మకము ప్రజలకే కాదు ప్రభువైన కాటయవేమునికినిగలదు. మీదుమిక్కిలి కాటయవేమప్రభువు, అల్లాడయు వియ్యంకులు. కాటయవేముని పెద్దకుమారెయైన అనితల్లిని, అల్లాడ రెండవ కుమారుడైన వీరభద్రారెడ్డికిచ్చి వివాహ మొనర్చిరి. ఈసంబంధముతో రాజకుటుంబమును మహామంత్రి కుటుంబమును మరింత సన్నిహితమైనవి.

కాటయవేముని నాయకత్వము, అల్లాడ మంత్రాంగము, సేనానాయకుడైన నరహరి అవక్రపరాక్రమము,సూరపరెడ్డి ప్రణిధియైన పుణ్యము అను నీనాలుగు స్తంభములపై రాజమహేంద్రవర రెడ్డిరాజ్య మింతవరకును సుస్థిరముగ నుండుటయేగాదు, ఉత్తరమున చిలుకసముద్రమువరకును తన యాధిపత్యమును నెఱపి, దక్షిణాపథమున సాటి ఆంధ్రరాజ్యములైన విజయనగర కొండవీటులతో సమస్కంధిగ నిలువబడినది.

ఇంతలో సూరపరెడ్డిగారి అకాలమరణము.

కాటయవేమప్రభువు అస్వస్థత.

ఇకపై రాజమహేంద్రవర భవితవ్య మెట్లుండునో! ఇట్లు దీర్ఘాలోచనాతత్పరుడై మాటాడక మౌనముగ నీటిలో నడుగులు వేయుచున్న బాచయ్యను విజయుడు పరిశీలించెను. అతని నడకలో కన్పించుచున్న రాజసమును ముఖములో కన్పించుచున్నగాంభీర్యమును చూచి చకితుడై మరింత నిశిత ముగ విజయుడు పరిశీలించెను.

విశాల ఫాలము, నిశితబుద్ధికి నిదర్శనముగ కొస దేలిన నాసిక, నిశ్చలమైన దీర్ఘవీక్షణములు, బిగువు పెదవులు, నల్లని కోరమీసములు, సమున్నత దృఢశరీరము.

రెప్ప వాల్చక బాచయ్యను చూచుచు విజయు డట్లే యుండిపోయెను అది గమనించి వెంటనే తన ఆలోచనల నుండి నేయూని చిరునవ్వు నవ్వుచు "స్వామీ [illegible] ర్యముగ జూచుచున్నారు! యువకుడవు కనుక సరిపోయినది. కాక, యువతివే యైనచో..." అని యింకను బాచయ్య వాక్యము పూర్తి చేయునంతలో విజయుడు సిగ్గుపడి తటాలున శిరము వంచెను.

అది గమనించి బాచయ్య మాట మార్చుచు "అయినచో నీవు సూరప్పరెడ్డిగారి యింటికి వెడలుచున్నమాట!" అనెను.

"మీరు వారి నెరుగుదురా ?"

"నేనేలఅనిన మాటేమి? రాజమహేంద్రవర మహా సామ్రాజ్యములో వారి నెరుగనివారు లేరు. కాని తెలియనిది వారిఅసలురూపమే! ఆయనను మారురూపమున చూచినవారే కాని, అసలు రూపమున చూచినవారు చాల తక్కువ. వారు ప్రణిధులు కదా! నీవు వారియింటికి బోవుటకు ముందు నాతో మాయింటికి రమ్ము. అచ్చటనుండి నిన్ను వారింటికి జేర్చు నుపాయ మాలోచింతు" ననెను. ఇట్లనినాడే కాని, "సూరప్ప రెడ్డిగారి మరణవార్తను కొండంత యాశతో వచ్చుచున్న ఈ యువకునకు చెప్పుట ఎట్లనునాలోచనమే బాచయ్యకు.

ఇత డెంతయో సుకుమారుడు. ముచ్చటగ నున్నాడు. సోదరీ సోదరు లెవ్వరుచు లేని తనకిట్టి సోదరు డొకడున్నచో!

ఇంతలో పాటిరేవు దాటి ఒడ్డు చేరితిమన్న సంతోష ముతో కాబోలు వారి యశ్వములు రెండును సకిలించినవి. బాచయ్య తనగుఱ్ఱముయొక్క వీపుతట్టి విజయునితో "ఇక రాజమహేంద్రవరమునకు వచ్చితిమి. గట్టు ఎక్కినచో నగ రమే" అనెను.

వారట్లు గట్టు నెక్కుచుండగ నాతిదూరమునగల రాజ ప్రాసాదమునుండి కల్లోలపూరిత రోదనధ్వనులు వినిపించినవి. అవి విని హృదయచలన మాగినట్లు బాచయ్య నిస్తేజుడై నిలువబడిపోయెను.

అప్పటివరకును రాజమహేంద్రవర రాజ్యలక్ష్మి నుదుటి సిందూరతిలకమువలె ప్రకాశించుచున్న వృద్ధసూర్యు డస్తం గతు డయ్యెను. చుట్టును చీకట్లు వ్యాపించెను.



విజయునికి నా యనువా రెవరును లే రనియు, సూరపరెడ్డి గారి యింట తల దాచుకొనవలె నని కొండంత యాశతో వచ్చెననియు, సూరపరెడ్డిగారి యకాలమరణవార్త యతనిని క్రుంగదీయుననియు, మీదుమిక్కిలి నిలువనీడ లేని దయనీయ స్థితి యతనికి కలుగుననియు, అందువలన సూరపరెడ్డిగారు సతీ సమేతముగ వారణాసి వెళ్ళినారని చెప్పి కొంతకాలము వరకును విజయుని తమ యింటనే యుంచుట లెస్సయనియు బాచయ్య చెప్పుటతో నార్ద్రహృదయుడైన గంగారెడ్డి విజయుని స్థితికి వగచి యట్లే యని అంగీకరించెను.

తండ్రీ, కుమారుడు [illegible] చతుశ్శాలలో ముచ్చటించుచు కూర్చుండ, విజయుడు [illegible] నుండి చతుశ్శాల లోనికి ప్రవేశించుచున్నాడు. [illegible] గాని తలపాగ, అంగరఖా, ధోవతిధరించివచ్చిన విజయునిజూచి గంగారెడ్డినవ్వుచు "అబ్బాయి పూర్తిగ తెలవారకుండగనే స్నాన మొనర్చితివా? బాగున్నది. ఇంత పొద్దున్నే తలపాగా యెందుకల" కనెను.

విజయుడు ప్రత్యుత్తర మీయ లేదు. ద్వారబంధముపైన చెక్కిన లతలను చిలుకలను, వెలిసిపోయి వెలవెలబోవుచున్న [illegible]ను, ఎన్నడో కట్టిన మామిడాకు లెండి సూత్రము మాత్రము మిగిలిన తోరణమును యథాలాపముగ జూచుచు నూరకుండెను. విజయు డేకాగ్రతతో జూచుచున్న యా యువ

క్లేశములను తానుగూడ జూచి గంగారెడ్డి నిట్టూర్చెను. ఆ నిట్టూర్పులో గంగారెడ్డి భార్య గతించుట, బాచయ్యయింకను వివాహము చేసికొనకుండ జాగుచేయుట, ఆడదిక్కు లేని యిల్లు కళారహితముగ మారుట మొదలైన బాధామయమైన స్మృతులు ధ్వనించెను.

ఆవిధముగ నిట్టూర్చిన గంగారెడ్డి నల్లని విషాదరూపమును జూచి విజయుడించుక చలించెను. తెల్లని గుబురుమీసములు, దైన్యమును దెల్పు నల్లని పెద్దపెద్ద కన్నులు, ముడతలు పడిన నుదురు పాలిపోయి వాలిపోయిన దౌడలలోను, శుష్కించి ముడతలుపడిన శరీరములోను వయస్సంబంధమైన నీడలుస్పష్టముగ గాన్పించుచున్నను, భుజములయొద్దను, పిక్కలయొద్దను దార్ఢ్యచిహ్నములు అస్పష్టముగ గోచరించి ఒకనా డితడు మహాబలాఢ్యుడను స్ఫూర్తిని కల్గించుచుండెను.

గంగారెడ్డి నిట్లొక్కక్షణము రెప్పవాల్చకుండ చూచి వెంటనే బాచయ్య దిక్కు తిరిగి "నన్ను మా పెదతండ్రిగారి యింటియొద్ద దిగవిడిచెదరా?" అని విజయు డడిగెను. అంతకు పూర్వము తా మాలోచించుకొనినప్రకారము సూరపరెడ్డి గురించి చెప్పి, వారు వారణాసినుండి తిరిగివచ్చువరకు తమ యింట నుండుమని బాచయ్యయు గంగారెడ్డియు తెల్పిరి. మొదట సూరపరెడ్డిగా రూరలేరను వార్త వినివిచలితుడై, పిదప నేమిచేయుటకును దోచక విజయు డాలోచనా మగ్నుడయ్యెను.

దీర్ఘకాలము వారింట నుండుట కిష్టములేదు. అట్లని రాజమహేంద్రవరము వదలి వెనుదిరిగి పోవుటకా ధైర్యము

లేదు. ఏమి చేయుటకును తోచుటలేదు. విజయుని సందిగ్ధా
వస్థను గమనించి, "సచివసమితి సభ్యులైన బెండపూడి అన్న
యామాత్యులును నేనును సహాధ్యాయులము. వారితో సంప్ర
దించి నీ కేదైన రాజోద్యోగ మిప్పింతును, అంతదనుక మా
యింట నుండుమ"నెను బాచయ్య.

"నూతనుని విశ్వసించి వా రుద్యోగము నిత్తురా?"

"ఆ శంక నీ కెందులకు? నే నిప్పింతును. సరియా? కాటయవేమప్రభునియల్లుడైన వీరభద్రారెడ్డియు నాకు సహా ధ్యాయుడే. ఆయనతో జెప్పియైనను నీ కుద్యోగమిప్పింతు" నని బాచయ్య మదువుటలో విజయు [illegible]రుమా టాడలేదు. పాదరక్షలం ధరించి గడపదాటి [illegible] గడ బోవుచు బాచయ్య "చిన్నసామంత్రము [illegible] మరణించినాడు కదా! నే [illegible] [illegible]మాత్యుల యింటి కేగి యచటనుండి [illegible] వీరభద్రారెడ్డిని పరామర్శించు టకై [illegible] వెడలుదుము. వరదారెడ్డి వచ్చినచో [illegible] కలియుమని చెప్పు" డని తండ్రికి తెల్పెను.

[illegible] "[illegible]! కాజ్కరపర్తి సంగతి యేమైనది? [illegible]మునుండి చూచుచున్నాను. నీయంత నీవే [illegible]" యనుచు గంగారెడ్డి తీక్ష్ణముగ బల్కెను.

"నేను మొదటనే తెల్పితినిగదా వివాహము జేసికొననని! [illegible] కాదు కూడ దనుటవలన మీమాటనుబట్టి కాజ్కరపర్తి [illegible]. [illegible]యే! అచట మీస్నేహితులైన బేతిరెడ్డిగారితో

కూడనా విషయమే చెప్పితిని. మీకొమారైకు వేఱొక సంబంధము చూచికొనుడని వారితో జెప్పియే వచ్చితిని” అనెను బాచయ్య.

విని కోపముతో “ఆం!” అని గంగారెడ్డి అరచెను.

“అందువలన వారికి మీరింకేమియు కబురు చేయకుడు” అనుచు బాచయ్య మొగసాల దాటి మగఱాలకంబమును గడచి వీధిలోనికి వెడలిపోయెను. గంగారెడ్డి దిగ్గున ఆసనము నుండి లేచెను. కోపముతో నాతని ముఖము జేవురించెను. కనులు ఖణఖణ లాడుచుండెను. బ్రద్దలు కానున్న యగ్నిపర్వతముమాడ్కి, భగభగ మండుచున్న మధ్యాహ్నమార్తాండుని వలె నతడు భయంకరముగ విజయునకగ్పించెను. బాచయ్య పోయిన దిక్కుగ కొంతతడ వట్లు చూచి యతడావల నుస్సు రనుచు నాసనమున కూలబడెను.

తత్తరపాటుతో తనకు శీతలోపచారములు చేయుచున్న విజయు నుద్దేశించి “చూచితివా? ఇట్లున్నది వాని పద్ధతి. పాతికేండ్లు వచ్చినవి. ఇంకను వివాహాము చేసికొనడు. రేపు నేను హరీ యన్నచో, ఎండలోనున్న తనను నీడకు రమ్మను వా రుండరు తల్లి లేదు. అక్కసెల్లెండ్రమాట సరేసరి. తుదకు నీవంటి సోదరుడైనను లేడు. వీనికి వేడియు వెచ్చయు నెవరు చూచెదరు?” అని గంగారెడ్డి నిట్టూర్చెను.

కుమారుని సౌఖ్యమున కాందోళన జెందుచున్న యా వృద్ధమూర్తి వెతనుజూచి విజయుడు జాలిపడెను.

కొంతతడ వాగి గంగారెడ్డి మరల నిట్లు వాపోయెను. “రాజమహేంద్రవరమందలి యువకుల కీనడుమ నిదియేదియో

పెళ్ళియావేశము బయలుదేరినది. ప్రతియువకుడును వివాహమును చేసికొన ననుట, నుదుట నింత విభూతియు, మెడలో నిన్ని రుద్రాక్షలును ధరించి వేదాంతవాక్యముల నేకరువు పెట్టుట. వైరాగ్యదృష్టి యుండుట మంచిదే; కాదనను కాని అకాల వార్ధక్యము వచ్చినట్లు పెళ్ళిళ్ళు మాని సన్యాసులవలె నీతిరుగు టేమి! మా బాచయ్య వంటివాడే మహామంత్రి అల్లాడ పెద్ద కుమారుడు, వేమారెడ్డి. అతడు నిల్లే వివాహము వలదనిభీష్మించుకొని కూర్చుండెను. అతనితో విసిగి వేసారి తుద కతనినట్లే బ్రహ్మచారిగ వదలి, రెండవకుమారుడైన వీరభద్రారెడ్డికి వివాహ మొనర్చినాడు అల్లాడ. ఏమి? ఇవుడు వీరభద్రారెడ్డి చేదు మేసినాడా! కాటయవేముని పెద్దకుమారై యైనఅనితల్లి ని వివాహమాడి, అటు మహారాజు జామాతగను, ఇటు మహామంత్రికుమారుడుగను మన్ననల నందుట లేదా? వాస్తవముగ ఈ గౌరవమంతయు వేమారెడ్డికి దక్కవలసినది. రాజమహేంద్రవర రెడ్డిరాజ్య మంత్రియా అల్లాడ పేరు జెప్పిన గడగడ [illegible] [illegible] [illegible] పైతము నీరు త్రాగవు. అట్టి దీక్షవాడు [illegible] ధిక్కరించి బ్రహ్మచారిగ నుండిపోయెను. పెద్దలు [illegible] [illegible] [illegible] యనెడు రోజులు గతించినవి. కాలము [illegible]. అంతయు వైపరీత్యమే!"

"కాలవైపరీత్య మనుచున్నారు. ఏమి జరిగినది?" [illegible], పాతిక సంవత్సరముల యువకు డొకడు. మగతాల [illegible] దాటి మొగసాలను గడచి చతుశ్శాలలోనికి ప్రవే

శించెను. అతని రాకతో నా ప్రదేశమంతయు నత్తరు వాసనలతో నిండిపోయెను.

"ఎవరు ? నీవా వరదారెడ్డీ ! రా... రా... ఏమియీ మధ్య పూర్తిగ నల్లపూస వైనా" వని యా యువకుని సంబోధించుచు తనప్రక్క యాసనమును గంగారెడ్డి చూపించెను.

నూతనుడైన వరదారెడ్డినిజూచి విజయుడించుక తొలగి ద్వారబంధముప్రక్క నిలువబడెను. విజయుని చూపులు త్రుటిలో వరదారెడ్డి రూపమును సమీక్షించినవి.

ఇతడు వయస్సున బాచయ్యకు సముడే. కాని రూపమున బాచయ్యకు వరదారెడ్డికిని పోలికలు లేవు.

బాచయ్య దృఢసమున్నత దేహుడు. వరదారెడ్డిసన్నని పొడగరి. అతనివి వంగినవిల్లువలె నందమైన కనుబొమలు. ఇతనివి నొసటియొద్ద వంకరగ కలిసికొనిన దట్టమైన కనుబొమలు. నిశ్చల దీర్ఘవీక్షణములు బాచయ్యవి. తీక్ష్ణమైన లోతైనచిన్న కళ్ళు వరదారెడ్డివి. కొసదేలిన నాసిక, పలుచని పెదవులు వానివి. తద్భిన్నములు వీనివి. బాచయ్యది ప్రశాంతగంభీరమైన యాహార్యము. వరదారెడ్డిది దర్పముతోగూడి వివిధవర్ణసంశోభితమైనది. హంసవలె స్వచ్ఛమైనరూపము బాచయ్యది. రంగుల పింఛముల నెమలివలె నాకర్షణీయమైన స్వరూపము వరదారెడ్డిది. ఇట్లు బాచయ్యకును వరదారెడ్డికిని గల భేద సామ్యముల నూహించుకొనుచు, మనస్సున చిత్రవిచిత్రరూపముల నల్లుకొనుచు ద్వారమువెనుక నిలువబడిన విజయునకు వారి సంభాషణము వినిపించినది.

"సల్లఘూసయైనాఁసనియూ ? నిజమే ! ఇకనుండి అట్టి యవకాశముకూడ లభింపదు. మావంటి ప్రణిధులకు తీరిక యెక్కడ? దానికితోడు నిన్న కాటయవేమప్రభువు కాలధర్మము చెందిరికదా! నేటినుండి పదిదినములవరకు రాజ్యమున నత్యవసర పరిస్థితి యేర్పడినట్లు అల్లాడ ప్రకటించినారు. ఇక మాకు కావలసినంతపని !"

వరదారెడ్డి పలుకులు వినుటతో, విజయునకు గత సాయంత్రము వాటిరేవు దాటుచుండ సంతానపురమునుండి విన వచ్చిన రోదనధ్వనులు జ్ఞప్తికి వచ్చినవి. అవి కాటయవేమ ప్రభువు మరణించుట వలని యార్తనాదము లన్నమాట. కాని ఏమిది ? రాజ్యాధిపతి చనిపోయినను, రాజధానిలో సలజడి యేమియులేక జను లందరు విషాదగాంభీర్యముతో నిశ్చల ముగ నున్నారు ! అల్లాడ యాజ్ఞ [illegible]

విజయు డిట్లు తలపోయుచుండ, గంగారెడ్డి వరదారెడ్డితో "కాటయవేమప్రభున్ని యనారోగ్య[illegible] ప్రజ లెవ్వరికిని తెలియుదు సుమా !" [illegible].

వరదారెడ్డి ఏదియో చెప్పబోయి నూతనుడైన విజయుని సమీపమున జూచి సంకోచించి యూరకపోయెను.

అది గమనించి "సంకోచింపకుము. ఇతడు మనవాడే ! నాకు హితుని కుమారుడు. విజయు" డని గంగారెడ్డి యనెను. కాని సౌగరకప్రవర్తన నెఱిగిన విజయుడు, తన యునికి వారికి నచుస్య యైనదని గ్రహించి స్వేచ్ఛందముగ నభ్యంతరమందిరములోనికి వెడలిపోయెను.

అనంతరము వరదారెడ్డి యిట్లు చెప్పెను: "కాటయ వేముని యనారోగ్యవిషయము కావలెనని యల్లాడ గోప్య ముగ నుంచినారు. వైద్యము చేయుచున్న పరహితాచార్యు లకు, రాజపత్నియైన దొడ్డాంబికకు, సచివసమితిలోని ముఖ్య సభ్యులైన నరహరి, అరియోటి లింగన, బెండపూడి అన్నయా మాత్యులకు మాత్రమే తెలియునని కొందరనుచున్నారు. కాదు, రాజకుమార్తెయైన అనితల్లికి, హరిహరాంబకు, రాజు గారి అల్లుడైన వీరభద్రారెడ్డికి, సచివసమితిలోని తక్కిన సభ్యు లకును తెలియునని కొందరనుచున్నారు"

"ఎందుల కింత గోప్యము! ఈ సంరంభ మంతయు నపాయమును శంకించియేనా?" అని గంగారెడ్డి ప్రశ్నించెను.

"ఇది యంతయు శత్రువులను వనమున నికకొని చేసిన మంత్రాంగము."

"ఏమి మంత్రాంగములో! రాజకీయములందు శౌర్య ధైర్యములకును, బుజువర్తనమునకును ప్రాముఖ్యము పోయి మంత్రాంగములకే ప్రాధాన్యము పెరుగుచున్నది. తుదకు రణ రంగములందును, కవచ ఖడ్గములను ధరించి శత్రువుల నూచ కోతగ నరకుటకంటె నీ యంత్రాంగ మంత్రాంగములకే ప్రాధాన్యము నిచ్చుచున్నారు. పాతతరమునకు చెందిన మా వంటివారి కిది యింతగ నుండి రుచింపదు."

"నిజమే! కాని, కాలానుగుణమైన మార్పు లవసరము కదా! కాలముతో మార్పు చెందక ప్రాచీనపద్ధతులనే పట్టుకొని ప్రాకులాడినచో నేమైనట్లు? బహుమనీసుల్తానులను జూచుడు.

దుర్గరక్షణయందు భయంకరమైన దారుకాయంత్రములనుశిలా యంత్రములను ఉపయోగింతురు. శత్రువులు దండెత్తి వచ్చేదు మార్గమందు చెఱువులను బావులను విషమయ మొనర్చి వారిని మట్టుపెట్టుదురు. రాయబారమంపి ముందుగ సంధిప్రయత్నము లొనరింపక యే, ఉన్నట్లుండి యేయర్ధరాత్రి సమయముననో వచ్చి దుర్గమును ముట్టడింతురు. ప్రణిధులకుశిణక్షనిచ్చి గూఢ చారి చర్యలకై శత్రురాజ్యములలోనికి బంపింతురు. నేడుజయా పజయము లిట్టి మంత్రాంగములమీద నేయాధారపడియున్నవి."

"మహామంత్రి అల్లాడ, మన సైన్యమునుకూడ సైన్యా ధ్యక్షులైన నరహరిచేత నీ పద్ధతులపై సమాయత్త మొనర్చు చుండిరా !"

"మనవరకు నెందుకు.? వానరాజు, బుంగరాజు వంటి సామాన్యసామంతప్రభువులే యీ నూతనవిధానము[illegible] నవలం బించుచుండిరి."

రణరంగములందు వీరవిహార[illegible] యందు [illegible] పొంది, శత్రుసైనికుల మన్ననలనుకూడ [illegible] వీరవరు [illegible], గంగారెడ్డి యీవిధానమును [illegible] శౌర్యముతో యుద్ధమొనర్చిన [illegible] క్షత్రి[illegible] తెచ్చుకొనుచు, తనకు లభింపని చమూపతి [illegible] బాచయ్యకైనను లభింపవలెనని కొం [illegible] వడ యెదురుచూచుచుండెను. అందులకే యతని కీ [illegible] విధానములు రుచింపలేదు.

మరికొంత తడవు గంగారెడ్డితో ముచ్చటించి, అన్నయామాత్యులతో కలిసి వీరభద్రారెడ్డిని పరామర్శచేయ బాచయ్య వెడలినాడని తెలిసికొని, తానును వారిని కలిసికొందునని వరదారెడ్డి లేచెను. అతడు గడపదాటుచు యథాలాపముగ వెనుదిరిగి చూచెను.

అభ్యంతరద్వారము వెనుక విజయుని తలపాగ కుచ్చు కన్పించెను.

వెంటనే వరదారెడ్డి తల పంకించి, విజయుని శంకించి "మా మాటలను పొంచి వినినట్లున్నాడు. సరియే! ఇతనిపై నొక కన్నువేసి యుంచవలసినదే!" యని ప్రణిధికి సహజమైన యనుమానముతో నడుగు కదిపెను.

3

ముప్పదియేండ్లు దాటని వయస్సు. ఆజానుబాహువైన విగ్రహము. అతిలోకమైన సుందరరూపము. పచ్చని ముఖమున వెలుగుచున్న విజ్ఞానరోచిస్సు. నుదుట ధరించిన విభూతిరేఖల ధావళ్య మాధ్యాత్మికసంపదను, తెల్లని పాముకుబుసము వంటి యుత్తరీయమునుండి వెలువడు నత్తరువాసనలు ప్రాపంచిక భోగభాగ్యమును దెలుప, దంతపుపావలు ధరించి పాదచారియై పోవుచు శృంగారవైరాగ్యముల సమ్యక్స్వరూపమా యనినట్లు కన్పించుచున్న యా విమలసౌందర్యమూర్తియే కొండవీడు అన్నయామాత్యులు.

అంతటి యమాత్యశేఖరులు వాహనమున గాక కేవ
లము పాదచారులై రాజవీథిని వచ్చుట వింత. అందులకే
యాశ్చర్యముతో జనులు ప్రక్కకొదిగి నిలుచుండిరి. కొందరు
ప్రాంజలి ఘటించిరి. అరబ్బీవర్తకులు శకటములు దిగి సలా
ములు చేయుచుండిరి. సింధురౌతులు గౌరవపురస్సరముగ నశ్వ
ములనుండి దిగుచుండిరి. వారి నందరను వారివారి భాషలలో నే
కుశలప్రశ్నలు వేయుచు, మధ్య మధ్య తనప్రక్కన మౌన
ముగ నడచుచున్న బాచయ్యతో ముచ్చటలాడుచు, అన్న
యామాత్యులు ముందరకు సాగిపోవుచుండెను.

అన్నయ బాచయ లట్లు సుగంధ విక్రయశాలలు గడ
చిరి. దుకూల వ్యాపారప్రదేశముల నతిక్రమించిరి. వివిధరత్న
క్రయ విక్రయ స్థలములను దాటిరి. భూసురరథ్యను, వేశ్యవాటి
కను గడచి మార్కండేయదేవాలయమును సమీపించునంతలో
వరదారెడ్డివచ్చి వారితో గలిసెను. వారు ముగ్గురును మనో
హర భర్మవర్ణశోభితమైన రాజప్రాసాదమును చేరిరి.

సచివసమితి సభ్యులైన అన్నయామాత్యులను, వీర
భద్రారెడ్డిమిత్రులైన బాచయ్యను, వరదారెడ్డిని జూచి ద్వార
పాలకులు శిరములు వాల్చిరి. పదిబాహువుల ఎత్తుగల సింహ
ద్వారమును దాటి, మామిడి పొగడ పున్నాగ వనములను
గడచి దాసదాసీజనుల నివాసగృహముల నతిక్రమించి వీరభద్రా
రెడ్డి ఏకాంతమందిరమును వారుముగ్గురును సమీపించిరి.

అచటి వాతావరణమున విషాదచ్ఛాయలు నిండినవి.
కాటయ వేమప్రభుని మరణమువలన నచట శోకనిశ్శబ్దగాంభీర్య

ములు చోటు జేసికొనినవి. మొదట నొక పరిచారికచే వారు ముగ్గురును లోనికి కబురుజేసి, పిమ్మట బయలుదేరిరి. వితర్దికలను, మొగసాలలను, చతుశ్శాలలను, అగారములను గడచి క్రీడారామమందలి యొక పాలరాతిమండపమున నాలోచనామగ్నుడై కూర్చుండిన వీరభద్రారెడ్డిని వారు సమీపించిరి. అతడు సామాన్యమైన జరీయంచుధోవతి, ముత్యాలకుచ్చులు గల తెల్లని పట్టుఅంగరఖా, కంఠమున ముత్యాలహారమును ధరించి దీర్ఘాలోచనాపరుడై విషణ్ణవదనముతో గూర్చుండెను. గతించిన కాటయవేముని గుణగణములు పేర్కొని ఆయన రాజనీతిజ్ఞతను, సామర్థ్యమును, సౌజన్యమును, ప్రస్తుతించి వారు ముగ్గురును సమయోచితముగ వీరభద్రారెడ్డినిపరామర్శించిరి.

అనంతరము 'దేశమందలి రాజకీయపరిస్థితులు ప్రస్తావనకు వచ్చెను. కర్ణాకర్ణిగ కాటయవేముని యస్వస్థతను విని నంతనే కప్పములు కట్టుటమాని, స్వతంత్రులుగ మెలగుచున్న అన్నదేవచోడ, వానరాజు, బుంగరాజాది సామంతులు, ప్రభువు మరణవార్తను పదియేండ్ల పసిబాలుడగు కుమారగిరి రాజగుటను వినినచో నిక యెట్లు ప్రవర్తింతురో. ఈబెడదకు తోడు విజయనగరాధీశుల యౌద్ధత్యము, గజపతులవైరము, కొండవీటిప్రభువుల మాత్సర్యము లుండనే ఉన్నవి.

ఈ రాజకీయపరిస్థితులను చక్కదిద్దుట యొక యెత్తు, కాటయవేముని కడపటికోర్కెలను దీర్చుట ఒక యెత్తు.

అవసానసమయమున కాటయవేమప్రభువు, తనవిశ్వాస్యా కుడును, మహామంత్రియునైన అల్లాడ చేతులలో బాలుడైన కుమారగిరిని రూపయౌవనసంపన్నురాలైన హరిహరాంబను ఉంచి కుమారగిరిని భావి రాజమహేంద్రవర రాజ్యాధినేతగ తీర్చిదిద్దుమనియు, హరిహరాంబ కమ్మకూతురైన వరునికూర్చు మనియు కోరిరి. ఈకోర్కెతో బాటు, కొండవీటియాస్థానమున నున్న శ్రీనాథమహాకవిని రాజమహేంద్రవరము రప్పించి, యాస్థానకవిని జేసి గౌరవిం[illegible] రెడ్డిరాజ్య మును, ప్రజాజీవితము[illegible]యునకూడ అల్లాడనుకోరిరి. ప్రభు[illegible] హరహర అరిమేటిలింగనలు [illegible]లోను, వీరభద్రారెడ్డి కుమార[illegible]మా త్యులు శ్రీనాథుని [illegible], అల్లాడను ప్రత్యేక[illegible] నికి కృపాణములన[illegible]

అందువలన [illegible]మారగిరికి అంగరక్షక దళము నేర్పాటుచేయు[illegible] వీరభద్రారెడ్డిపైనను, శ్రీనా థుని రాజమహేంద్రవరము రప్పించుబాధ్యత అన్నయామా త్యుని పైనను బడెను.

వారిరువురును తమతమ బాధ్యతల నెట్లు నిర్వర్తింతు మటయా యని చర్చించిరి. అనంతరము వీరభద్రారెడ్డి "కుమార గరక్షకదళము నేర్పాటుజేయవలెనుగదా. అందులకు ర్హులైన వ్యక్తులెవరైన నున్నచో సూచింపు"డని వారి నెను.

"మరల నిపుడు క్రొత్తగ నేర్పాటు జేయుటయేల? కాటమ వేమప్రభుని యంగరక్షకు లున్నారు కదా?" అనెను వరదారెడ్డి.

"కాని వారు వయస్సుమళ్ళినవారు. బాలుడైన కుమారగిరికి ఉత్సాహము నుత్తేజము నీయగల నవయువకులుండిన మంచిది" యని యన్నయామాత్యు లనెను.

"అయినను మామగారి యంగరక్షకులనుండి ముప్వురను గ్రహించుటకు నిశ్చయించితిని. ఇంకను ఇరువురు కావలయును. అన్నివిధముల ననుకూలమైన వ్యక్తులు వెంటనే దొరకుట కష్టముగదా! ఋజువర్తన, సామర్థ్యము, సౌశీల్యము గల యుత్సాహవంతులైన విశ్వాసపాత్రులు చట్టున నెచట లభింతురు?"

వీరభద్రారెడ్డి యనినమాటలు తక్కినవారి నాలోచనా మగ్నులుగ జేసినవి. అన్నయామాత్యు లొకింతతడవాలోచించి "ఈలక్షణము లన్నియు నున్నవాడు, రాయనిమంత్రి భాస్కరుని తమ్ముడొకడున్నా" డనెను.

"ఇకనేమి? వారిది రాజభక్తికి పేరుగన్న కుటుంబము. సరియే బాగున్నది. మరి యింకొకరు కావలయు" ననెను వీరభద్రారెడ్డి.

"బాచయ్యను జేర్చుకొను"డని వరదారెడ్డియెగతాళిగ ననెను. బాచయ్యను కనుబొదల జూచి నవ్వెను. వీరభద్రారెడ్డియు అన్నయామాత్యులుకూడ నవ్విరి. వారట్లు నవ్వుటకు కారణము లేకపోలేదు.

బాచయ్య కిట్టి యుద్యోగములం దాసక్తి లేదు. ఎల్ల వేళల నతనిదృష్టి యుద్ధరంగముపై ననేయుండును. ధైర్యశాలి యైనయోధుడతడు. ఆహవరంగమును వలచినవ్యక్తి యంతః పురమును గొలచుట కెట్లంగీకరించును? మీాదుమిక్కిలి తన శక్తిని శంకించినట్లును భావించును. అది అతనికి కోపకారణ మగును. కోపమువచ్చినచో బాచయ్య ముఖ మందముగ నుండును. అది చూడవలెనని వారి ముచ్చట. వారిముచ్చట దీరినది. బాచయ్య ముఖ మరుణవర్ణమైనది. పెదవులు వణకు చుండ నతడు వరదారెడ్డివైపు తీక్ష్ణముగ జూచెను.

వెంటనే అన్నయామాత్యులు "పోనిమ్ము. నీవుకానిచో నీకునమ్మకముగల సమర్థుడైన వ్యక్తిని సూచింపు" మనెను.

వీరభద్రారెడ్డి "అవును బాచయ్యా! అట్లు చేయు" మనెను. బాచయ్య కొంత తడవు దీర్ఘముగ నాలోచించెను. పిదప "అయినచో విజయు డని యొకడున్నాడు. అత డన్నివిధ ముల యోగ్యుడు. రాజోద్యోగము కావలె ననుచున్నా"డని తెలిపెను.

"ఎవరు? మీాయిచటనున్న యా నూతనుడా?" యని యభ్యంతరము దెలుపబోయెను వరదారెడ్డి.

"అతడు నూతనుడుకాదు. అతని పెదతండ్రి ఎవరో తెలియునా..."యని బాచయ్య చెప్పబోవునంతలో వీరభద్రా రెడ్డి కల్పించుకొని "అది యంతయు నెందులకు బాచయ్యా? నీకు వచ్చినచో జాలు. మాకును నచ్చినట్లే! రేపేవచ్చియంతః పురాధికారికి నామాటగ జెప్పి, ఈ ముద్రిక నానవాలుగ

జూపించి యుద్యోగమున బ్రవేశింపుమని చెప్పెను. ఇక నా సమస్య తీరినది" అనెను.

"ఇక నా బాధ్యతయే మిగిలినది. శ్రీనాథ కవీంద్రులను రాజమహేంద్రవరమునకు రప్పించుట దుర్ఘటము. వారికి పెదకోమటివేమునిపై నాదరముమెండు. పెదకోమటివేమునకును వారిపై గౌరవ మధికమని తెలిసినది. శ్రీనాథులవారి పల్లకి రాజమార్గమున నెదురైనచో పెదకోమటివేమారెడ్డి 'ఆహవకోలాహల' మని పేరు గాంచిన తన భద్రగజమును దిగి, పాదరక్షలు వీడి, ప్రాంజలి ఘటించి, వారిపల్లకి కనుచూపుమేర దాటిపోయినగాని తిరిగి గజము నధిరోహింప డట. అంతియే కాదు. శ్రీవారిపల్లకి రాజమార్గమున వచ్చినచో నెచ్చటివాహనము లచ్చటనాగిపోవలయునని కొండవీటిలో రాజశాసనమట! అంతటిగౌరవమున్నా దలను వదలి రాజమహేంద్రవరమునకు వారెట్లు వచ్చెద"రని అన్నయామాత్యులు తనలో తా ననుకొనినట్లు మృదువుగా ననెను.

"అందును కవీశ్వరులకు కృతజ్ఞతాభావము లధికము గదా!" యని వీరభద్రారెడ్డి పలికెను.

"మీదుమిక్కిలి కొండవీటికిని రాజమహేంద్రవరమునకును బద్ధవైర" మని వరదారెడ్డి యనెను.

"ఇంతటి గుంజాటన పడి యా శ్రీనాథు నిటకు రప్పించుట యెందులకో!" అని బాచయ్య హేళనగ పల్కెను.

"ఎందులకా? రాజమహేంద్రవర యువకులకు నిర్దుష్ట జీవనవిధానములు తెలియజేయుటకు. మా అన్నగారైన వేమా

రెడ్డి వంటివారిని, నీవంటివారిని అకాల వార్ధక్య వైరాగ్య భావములనుండి తప్పించుటకు. విలాసమూర్తులైన వరదారెడ్డి వంటి యువకులకు కొంత తాత్త్వక చింతన కల్పించుటకు. ఆత్మహత్యాసదృశమైన యీరెండు విపరీతమార్గములనునిరోధించి, రాజమహేంద్రవర యువకులకు శృంగార వైరాగ్యభావముల సమ్యక్ స్వరూపము నందించి జాతినుత్తేజితమొనర్చి నవోదయమును సృష్టించుట" కని వీరభద్రారెడ్డి శ్రీఘ్రముగా ననెను.

అంతట అన్నయామాత్యులు ప్రసన్నవాక్కులతో నిట్లు తెల్పెను: "బావయ్యా! నీవును వరదారెడ్డియు నేడు రాజమహేంద్రవర యువకులలోని రెం[illegible]కు ప్రతీకలు. ఒకరికి లోకముతో నేమి[illegible]త్ర త్రిపుండ్రములు, రుద్రాక్షమాలలు, బ్రహ్మసత్యం జగన్మిథ్యయను పలుకులు తప్ప సాంఘిక జీవనవిధానమున నాసక్తి లేదు. మరియొకరికి భోగభాగ్యజీవనము, లాలస భావనలు, బాధ్యతారహిత ప్రవర్తనమేతప్ప ఆధ్యాత్మికదృష్టి లేదు. అభ్యుదయమును కాంక్షించు జాతి కివి రెండును ప్రమాదకరమార్గములే! ఈరెండింటెని జీవితమున తగుమాత్రముగా పోషించుకొనిన గాని యాదర్శజీవనము లభింపదు. ఇందులకై రాజశాసనము లెన్ని చేసినను, బోధలెన్ని యొనర్చినను నిరర్థకము. యుగకర్తయైన మహాకవియొక్కడే ప్రజలలో నీమార్పును తీసికొని రాగలడు. అందును శృంగార వైరాగ్యములను తనలో సమానముగ బొందుపరచుకొని, సాక్షాత్తు అర్ధనారీశ్వరుడైన సదాశివునివలెభాసించుచున్న శ్రీనాథమహాకవీంద్రు

లిందుల కెంతయు తగినవారు. వారు వచ్చినచో రాజమహేం ద్రవరమున నవశక మే యారంభమగును. మనప్రజలకు నవజీవ నము కుసుమించును."

అన్నయామాత్యులు సంభాషించిన పిదప కొన్నిక్షణ ములవరకు నెవరును పలుకలేదు; వారి మనస్సులలో నా గంభీరమైన వాక్కు లావృత్తము లగుచుండెను.

అనంతరము వరదారెడ్డి "శ్రీనాథులవారి రాక యిచటి పండితులకరు చింపదేమో" యనియనుమానమును బ్రకటించెను

"మనపండితుల కేదియును రుచింపదు లెమ్ము. అన్న యామాత్యా! శ్రీనాథులవారికిని మీకును స్నేహమేకాక బంధుత్వముకూడ నున్నదికదా: అందువలన ఒకమహ్యాద్వర్త మానమునంపి వారియాలోచనలు తెలిసికొనుడు. రాజమహేం ద్రవరమునకు వచ్చుటకు వారు సుముఖులుగనున్నచో రాజ్యా ధిపతియైన కుమారగిరి యొద్దనుండి పిమ్మట సాధికారికమైన యాహ్వానము బంపుద" మని వీరభద్రారెడ్డి యనెను.

"అవును. అదియే సమంజసము. అట్లేచేయుదము. కాని శత్రురాజ్యమైన కొండవీటికి రహస్యముగ వెడలి, ఈ జా బాయన కందించి వారికడనుండి సమాధానము తీసికొనివచ్చు వా రెవ"రని యన్నయామాత్యులు సాలోచనులై యనిరి.

వెంటనే వరదారెడ్డి "ఆ పని నేను చేయుదు" ననెను.

"ఇకనేమి? మనవరదారెడ్డి యీకార్యమును సాధించు కొని రాగలడు. అతడు ప్రతినిధికదా! ఇకనాలస్యమెందులకు? పత్రమును లేఖనిని తెప్పించెదను శ్రీవారికిజాబువ్రాసిపంపుడు."

ఇట్లనుచు వీరభద్రారెడ్డి పరిచారికనురావించి వ్రాతపరికరము
లను దెప్పించెను.

అన్నయామాత్యు లాలోచించి యాలోచించి తుదకు
లేఖనిని తీసికొని వ్రాయ నారంభించిరి.

"బ్రాహ్మీదత్త వరప్రసాదులును, బ్రహ్మాండాది మహా
పురాణ చయ తాత్పర్యార్థ నిర్ధారిత బ్రహ్మజ్ఞాన కళానిధాను
లును అయిన శ్రీ శ్రీనా[illegible]స్వామ్యాడి అన్నయ
నమస్కారములు. [illegible] ప్రారం
భించి జాబు పూర్తి [illegible]చెను.
అతడు బాగున్నదని [illegible]

"ఆహ్లాదకు వినిపించి, వారి యామోదమును బొంది,
పిదప లేఖను తోలుసంచిలో వేసి లక్కపట్టులనుంచి వానిపై
తన ముద్రికల గుర్తులను వేసి వరదారెడ్డికిచ్చి కొండవీటికి
పంపెద" ననుచు అన్నయామాత్యులు లేచి నిలుచుండెను.
బాచయ్యయు వరదారెడ్డియు లేచిరి. ముప్పురును వీరభద్రా
రెడ్డియొద్ద సెలవుతీసికొని తిరిగివచ్చుచుండగ "నాకుడిచేయియు
కుడికన్నును అదురుచున్న" వని వరదారెడ్డియనెను.

"అయినచో నప్రయత్నలాభ" మనెను అన్నయ.

"కళ్యాణప్రాప్తియేమో" యనుచు బాచయ్య కొంటె
చూపులు చూచెను.

అన్నయామాత్యుల పెదవులపై హాసరేఖ గోచరించెను.

రాయలను, ఇంకొకవైపు బహామనీసుల్తానె నఫిరోజిషాను రాజమహేంద్రవరముపై పురికొల్పుచు నదను వచ్చినపుడు తాను కూడ కయ్యమునకు కాలుదువ్వుచు రాజమహేంద్రవర సామ్రాజ్యమునకు స్థిమితము లేకుండ పెదకోమటివేమారెడ్డి తన శక్తికొలది చీకాకు కల్గించుచుండెను. ఫలితముగ రెండు రాజ్యములకు మధ్య పచ్చగడ్డి వేసిన భగ్గుమనుచుండెను.

ఇంతటి గాథ యున్నది కనుకనే కోపోద్విగ్నుడై బాచయ్య ఆ రీతిని తీక్ష్ణముగ బ్రశ్నించెను. ఆ ప్రశ్న వెనుక నెట్టి అపోహగలదో విజయుడిట్టే గ్రహించినాడు. అపోహలు, అనుమానములు నెట్టి విషమపరిణామములకు దారితీయునో అతనికి ననుభవమువలన తెలిసిన విషయమే ! అట్టి అపోహ కారణముననే కదా పెదకోమటివేమారెడ్డి తమ కుటుంబము ను గృహనిర్బంధములో నుంచినది !

అపోహ కాక మరేమి ?

రాజమహేంద్రవర ప్రణిధినాయకుడును తన పెదతల్లి భర్తయు నైన సూరపరెడ్డిగారు మారువేషమున కొండవీడు వచ్చి వెళ్ళుటేమి, ఆవార్త తెలిసి అందు తమ ప్రమేయముండు నని అపోహపడి విచారణ యైనను జరుపకుండ నాయనగారిని రాయసముపదవినుండి తీసివేసి, వారితో కలిపి అమ్మను తనను పెదకోమటిప్రభువు గృహనిర్బంధమున నుంచుటేమి? ఇటులనే అనుమానముపై నెందరినో కొండవీటిలో పదవీభ్రష్టులను జేయుట జరిగినది. ఎంతయో చాకచక్య మువయోగించి,

దక్షత, బెండపూడి యన్నయామాత్యుల సూక్ష్మగ్రహణ పారీణత, ప్రణిధుల సమర్థ గూఢచారిత్వము నక్షత్రములవలె నాశాకిరణములను బ్రసరించుచున్నవి. చాణక్య యౌగంధరాయణులవంటి ప్రాచీన మహామంత్రుల మార్గము ననుసరించి తానెంతయో చాకచక్యముగ మంత్రాంగమును నెఱపినగాని రాజమహేంద్రవర రెడ్డిరాజ్య మీయాపదలనుండి బయటపడదు.

ఇట్లాలోచించుచున్న యల్లాడకు వీధిలోనుండి 'శివా!' యను సంకేత [illegible] సన్నగా వినిపించెను. ప్రణిధులలో [illegible] వలుగురైదుగురకు తానిచ్చిన యీ మాసపు సం[illegible]సమాసమునకు సంకేతమును మార్చివేయుట కద్దు. ఆసంకేతము విన్నంతనే తాను పంపిన ప్రణిధి యెవరో, శత్రురాజ్యములందు గూఢచారి చర్యలు పూర్తిచేసికొని వచ్చియుండునని తలచి చతుశ్శాలనుండి యల్లాడ వీధిలోనికి వచ్చుచు సింహద్వారము కడ నాగి 'శివోహ' మ్మని ప్రత్యుత్తరమిచ్చెను. దానికి నావలివ్యక్తి 'హరహర మహాదేవ' యని రెండవ సంకేతము చెప్పవలెను. కాని యా వ్యక్తి రెండవ సంకేతమును జెప్పజాలక పోయెను.

వెంటనే యనుమానించి యల్లాడ "ఎవరు నీ"వని భయంకరముగ గర్జించెను. కీసీడలో నిలువబడిన యావ్యక్తిని రెండడుగులలో పోయి బంధించెడివాడే! కాని యింతలో నావ్యక్తి తన మొలనున్న బాకు నల్లాడపైకి విసరి పరుగిడబోయెను. త్రుటిమాత్రములో నావేటునుండి యల్లాడ తప్పించుకొని తన కాసెలోని బాకు నావ్యక్తి మీదకు విసరెను.

పిక్కలో బలముగ దిగిన యా బాకు నూడబెరుకుకొనుటకు సమ
యములేక యా యజ్ఞాతవ్యక్తి యట్లే వేగముగ బారిపోయెను.

ఇది యంతయు మెరుపు మెరిసినట్లు కనురెప్పపాటులో
జరిగిపోయెను. తల పంకించి యల్లాడ 'ఆలోచనా మగ్న
డయ్యెను. వీ డెవరో శత్రుగూఢచారి యన్నమాట ! మొదటి
సంకేతమును మాత్రము తెలిసికొన గలిగెను. దాని సాహాయ్య
మున నన్ను వీధిలోనికి రప్పించి మట్టుపెట్టవలెనని తలచెను.

అల్లాడ అంతసులభసాధ్యుడు కాదని తెలియదు కాబోలు!
కాటయవేమప్రభువు గతించినపిదప రాజమహేంద్రవర మింత
యలుసైనది కాబోలు ! అల్లాడ కంఠమున ప్రాణముండగ
వీరి యాటలు సాగవని తెలియదు.

ఇట్లాలోచించుచున్న యల్లాడకు మరల 'శివా' యను
సంకేత మా గభీరనిశీధినుండి వినిపించినది. అల్లాడ యీమారు
మరింత జాగరూకత వహించెను. రెండవ సంకేతమును విన్న
పిదపకాని యా వ్యక్తిని లోపలికి రమ్మని యాజ్ఞాపింపలేదు.
వచ్చినవ్యక్తిని జూచి యల్లాడ సంభ్రమాశ్చర్యములతో కౌగి
లించుకొని గౌరవించి విశేషములేమి యని ప్రశ్నించెను.

"అన్నియు విశేషములే !" యని ప్రారంభించి "ఈ
నడుమ కొండవీడు వెడలిన మన ప్రణిధులలో నొకరిద్దరు,ధనా
శకు లొంగి యటు తిరిగినట్లు తెలిసినది. వా రెవరో తెలిసికొని
వారి యాట కట్టింపకున్నచో దేశమునకు ప్రమాదము. ఇది
యిట్లుండ గజపతులకు బాసటగ నుండుమని విజయనగర
రాయలు మాటయిచ్చినట్లు తెలిసినది. గజపతులు దండెత్తి

వచ్చి మన గన్నవరము వేపును స్వాధీనము చేసికొనుటకును, మన మెదిరించినచో వారికి సాయముగా విజయనగర సైన్య మును కదలివచ్చుటకును ఒప్పందము."

అల్లాడ సాల్లోచనముగ్గా [illegible] "విజయనగర బల మెంత?" యని ప్రశ్నించెను.

"[illegible] గుఱ్ఱములు, లక్షపది వేల [illegible] గాండ్రిరువది వేలు, [illegible] విలుకాం డ్రును కలిసి [illegible] ఇందులో సగము [illegible] ప్రణిధి తెలిపెను.

అల్లాడ కొంతతడవూరకుండి "గజపతుల బలమెం తయో తెలిసినదా?" యని యడిగెను.

"చిత్తము. ఈనడుమ వారు సింహళమునుండి తెప్పించు కొనిన వానిని కలిపినచో వారి గజబలము వేయి దాటును. అశ్వ దళము మాత్రము రెండు వేలే ! నలుబది వేల పదాతిబలములో నందరును విలుకాండ్రు, సెలగోల బలమే కాని కైజీతగాండ్రు లేనే లేరు. ఎక్కటి సైన్యమును లే"దని ప్రణిధి ప్రత్యుత్తర మిచ్చెను.

అల్లాడ నిట్టూర్చి "వీరిలో నే యొక్కరి బలమునకును మన సైనికబలము సరిపోదు. ఇరువురును కలిసినచో చెప్పవల సిన దేమి? సరియే... ఈ చిక్కు నెదుర్కొను నుపాయమును నే నన్వేషింతును లెండు. మీరు మాత్రము ఒకపని చేయుడు.

అన్నదేవచోడ దక్షారామము నాక్రమించుకొని కూరుచు న్నాడు గదా! కొందరు ప్రణిధులతో మీరు దక్షారామము మారువేషమున వెడలి, అతని సైనికశక్తిని ప్రజల కతనియందు గల యనురక్తిని తెలిసికొని నాకు కబురంపుడు. తదుపరి కార్యము నేను నిర్వహించెద" ననెను.

"చిత్తము"ని యా ప్రణిధుడు సెలవు తీసికొని వెడలి పోయెను. అతడు వెడలిన దిక్కుగ కొంతతడవు జూచి, అనంత రము ద్వారమును బంధించి, పర్యంకముపై మేనువాల్చుచు ఇటువంటి సమర్థులైన దేశభక్తిపరాయణులు నలుగురుండిన జాలును. ఈకష్టములనుండి గట్టెక్కించి రాజను హేంద్రవర రాజ్యపతాకను వినువీధి నెగురవేయవచ్చును. పాపము! ధర్మ పత్ని యగ్నిప్రమాదమున కాహుతికాగా నాకష్టమును దిగ మ్రింగి, యీవయస్సున నీ మహానుభావుడు దేశమునకు సేవ చేయుచున్నాడు. దైవికముగ నేర్పడిన యీయగ్నిప్రమాద మున తానును మరణించినట్లు ప్రవాదము పుట్టించి, శత్రువు లను ప్రమత్తులుగ జేసి తన ప్రణిధాన నైపుణ్యమును సమర్థ ముగ నిర్వహించుచున్న వీరి యశేష శేముషీధౌరంధర్యము వర్ణనాతీతము గదా!" యని యల్లాడ యనుకొనెను.

భావికర్తవ్యమునుగూర్చి యాలోచించుచున్న యల్లా డకు మరునాడు తా నేర్పరుపనున్న సచివసమితి సమావేశము లీలగ కనులముందు రూపుకట్ట సాగెను.

వీరభద్రారెడ్డికి సమీపమునగల స్వర్ణసింహాసనముపై పసికన్నులతో కుమారగిరిప్రభువు కూర్చుండి యుండెను. ప్రతి

సీరవెనుక దొడ్డాంబిక కుద్దేశించినయాసనమునకిరువైపుల నిటు నటు అనితల్లియు హరిహరాంబయు సుఖాసీనలై యుండిరి. భర్త పోయిన దుఃఖమునుండి తేరుకొనని కారణమున దొడ్డాంబిక యచటికి రాలేదు. ఆయాసన మట్లే శూన్యముగ నున్నది.

ఇక అరిమేటిలింగన, నరహరి, అన్నయామాత్యులు, పురోహితులైన జతనము పెద్ది వారి వారి యాసనములపై గూర్చుండిరి.

మొదట అన్నయామాత్యులు లేచి, తన లేఖకు శ్రీనాథ కవీంద్రుల యొద్దనుండి ప్రత్యుత్తరము వచ్చినదనియు, ఆ లేఖలో వారు రాజమహేంద్రవరము [illegible] కాంక్షించుచున్నను, పెదకోమటి వేమ [illegible] యాదరము సువర్ణశృంఖలములవలె [illegible] చిన వనియు వ్రాయించిరని తెల్పెను.

ఆసమాచార మల్లాడతోపాటు తక్కిన సచివసమితి సభ్యులకును నిరాశను, నిరుత్సాహమును గల్గించెను. "మన ప్రయత్న మట్లయిన దన్నమాట! సరియే. ఆమహాకవి నిటకు రప్పించి కాటయవేమప్రభుని కడపటికోర్కెను తీర్చుటకు మార్గాంతర మేమైన గలదేమో నిదానముగ యోచింతము. దేనికైనను సమయ సందర్భములు కలిసిరావలెను గదా!... నరహరిగారూ, విశేషము లేమైన గలవా?" యని యల్లాడ సర్వసైన్యాధ్యక్షుల దిక్కు తిరిగెను.

"చిత్త"మనుచు నతడు లేచి, "నాలుగురోజుల క్రిందట వింధ్యాటవీప్రాంతమున ముగిసిన దక్షిణాపథ అశ్వశిక్షణాపరీక్ష

లలో తమమూడవకుమారుడు దొడ్డారెడ్డి సర్వోత్తముడుగ
నుత్తీర్ణుడైనాడట! పరీక్షాధికారియైన విజయనగరరాయలు మన
దొడ్డా నైపుణ్యమును బహుధా పొగడి తానే కొన్ని పారి
తోషికముల నిచ్చినాడట. కొద్ది క్షణములక్రిందటనే వేగు
వచ్చిన"దని విన్నవించెను.

ఆవార్త యల్లాడ కెంతటి యానందమును కల్గించి
నదో, యతనిలో నంతటి యాలోచనలను రేకెత్తించినది.

"దొడ్డా, విజయనగరరాయల విశేషాభిమానమును
జూఱగొనినాడా! అయినచో రాయలతో జరుగనున్న రాయ
బారమునందు దొడ్డారెడ్డిని వినియోగించుకొనుట విజ్ఞత. అట్లే
కళింగదేశీయుడైన గౌతమజోషిని గజపతులయొద్దకు రాయ
బార మంపుట యుక్తము. వీరిరువురు నాయా ప్రభువుల
మనఃప్రవృత్తుల నెఱింగిన వారగుటచే విజయవంతముగ కార్య
మును ముగించుకొని రాగలరు.

రాయలకును రాజమహేంద్రవరమునకును పూర్వ
స్నేహము లేక పోలేదు. ఇప్పుడైనను ప్రత్యక్షవైరము లేదు.
మన గన్నవరము రేవును గజపతు లాక్రమించు తరుణమున
వారికి రాయలు సాహాయ్య మొనర్తురన్నది కేవలము గాలి
కబురు. దానికి బలమైన యాధారము లేదు. ఇప్పట్టున కానుక
లంపి స్నేహమును కాంక్షించినచో కాదని కయ్యమునకు
కాల్సాచునంతటి యవివేకియా విజయనగరరాయలు? మీదు
మిక్కిలి మనతో వైరము పెట్టుకొనినచో నతనికి కలిసివచ్చు

నదియు లేదు. ఏ గజపతులతో లాభము కలుగుననియు, ఏ కొండవీటివారికో మేలుచేకూరుననియు నతడు మనతో విరోధము నేల కొని తెచ్చుకొనును? అందువలన దొడ్డాను విజయనగరము పంపినచో నా రాయబారము తప్పక ఫలించును.

"అట్లే గజపతుల కడకు గౌతమజోషిని కానుకలతో బంపి, గన్నవరము రేవునుండి వాణిజ్యాదికముల నొనర్చుకొనుటకు వారికి మైత్రీధర్మముగ ననుజ్ఞ నిచ్చినట్లు కబురంప వచ్చును. వారికికావలసినదియు నదియే కదా? మీదుమిక్కిలి రాయలతో రాజమహేంద్రవరమున కేర్పడిన సత్సంబంధములనుకూడ వారికి తెలియున ట్లానోట నానోట ప్రచారము చేయింతము.అది విని భయ భ్రాంతుడు,కర్తవ్యతావిమూఢుడు నైన గజపతి దిగిరాక యేమిచేయును?" ఇట్లాలోచించి తన నిర్ణయమును సచివసమితి సభ్యుల కల్లాడ తెలియబరచెను.

వారిలో నొక్క యన్నయామాత్యులకు తప్ప తక్కిన వారి కెవరికిని యీయాలోచన రుచింపలేదు. తామై ముందుగ రాయబార మంపుట పిరికితనమునకును, అసమర్థతకునునిదర్శన మగునని వాదించిరి. శత్రువులతో రాయబారములాయని నిరసించిరి. ఇది రాజమహేంద్రవరమునకే యవమాన మని విమర్శించిరి.

వారి వాదములన్నిటిని శాంతముగ విని తదుపరి చిరునవ్వు నవ్వి యల్లాడ యిట్లు సమర్థించెను :

"మనకు కొండవీటి పెదకోమటివేమ శత్రువుకాని గజపతులను, రాయలును శత్రువులు కారు. మనపై వారు శత్రు

త్వము వహించుచున్నట్లు పెదకోమటివేమయే పన్నాగము పన్ను చున్నాడు. ఇప్పట్టున రాజనీతితో, వారితో మనకు మిత్రలాభ మును, పెదకోమటి వేమకును వారికిని మధ్య భేదమును కల్గించుట విజ్ఞత. వీరిలో నొక్కొక్కరి సైనికశక్తియు, రాజమహేంద్రవర సైనికశక్తికంటె నధికమే! ముగ్వురును కలిసినచో చెప్పవలెనా? అవమానము, పౌరుషము అనుచు మూర్ఖముగ నీబలవంతులను ఢీకొని పరాజయము పొందుటకంటె సమయసందర్భములు గుర్తించి సద్బుద్ధి బాటట్లొనర్చుకొనుట యుక్తము. మీదుమిక్కిలి రాయలతోను, గజపతులతోను స్నేహమొనర్చుట యవమాన మేమియును కాదు. మాతృదేశమునకు వారెంతయో సేవజేయుచున్న పవిత్రమూర్తులు. దక్షిణాపథమున హైందవ ధర్మోద్ధరణకై కంకణము కట్టుకొనినవాడు రాయలు. ఉత్తరదేశమునుండి యేతెంచు తురుష్క సైన్యము నెల్లప్పుడు తామే యెదుర్కొనుచు నా తాకిడి రాజమహేంద్రవరమునకు సోకకుండ కాపాడుచున్నవారు గజపతులు. ఈ దృష్టినుండి జూచినచో వారిరువురును మనకత్యంత స్నేహపాత్రులు, ఆప్తులు. ఆప్తులతో మైత్రి నెఱపినచో నవమానమేమి? అంతియేకాక బాహ్య శత్రువులైన వీరిరువురితోడను స్నేహముచేసి వారి బెడదను తప్పించుకొనినచో నంతశ్శత్రువులైన బుంగరాజాది సామంతులను సులభముగ నణచి రాజ్యమున శాంతిని నెలకొల్పవచ్చును.”

గంభీరస్వరమున నిట్లాడ పలికి యూరకుండెను. సచివ సమితి సభ్యుల కాయనమాటలు సమంజసముగ దోచెను.

అల్లాడ చెప్పినప్రకారము రాయలకడకును గజపతులయొద్దకును రాయబారముల నంపుటకు వారంగీకరించిరి. అనంతర మల్లాడ సమావేశమును ముగించి సభ్యులకు సెలవొసంగుచు "నరహరి గారూ! సైనికసమీకరణము, నూతనాయుధ నిర్మాణముల బాధ్యత మీరు స్వీకరింపుడు. అన్నయామాత్యా, ఏక్షణ మునసైనను గౌతమిని దాటి మనసైన్యము కొండవీటికి వెడలుట కనువుగ వేయి పడవలను సిద్ధముచేయుము. అరిగేటి లింగనగారూ, ఇటు బంపకోటదిశ నున్న మార్గములు, అటు దక్షారామమునకు బోవు బాటలేకాక తూర్పున సప్తమాడియ ముఖముగ నున్న రహదారులను సేనావాహిని పోవుట కనువుగ దాడికాంద్రచేత బాగుచేయించి [illegible]పుడ"ని యందర కన్ని బాధ్యతలు నప్పగించెను.

అల్లాడ మాటలు విననవారి కందరికిని త్వరలో రాజమహేంద్రవర మహాసైన్యముయుద్ధమునకుసన్నద్ధమగుచున్నట్లు తెలిసినది. కాని యా యుద్ధ మెవరితోడనో యర్థము కాలేదు. అన్నిరంగములు నొకేమారు సిద్ధమగుచున్నవి. అది తెలిసిన శత్రువు లెవరికివారే యప్రమత్తులై, తమతోడనే రాజమహేంద్రవర మహాసైన్యము తలపడునని భావింతురు. ఇందువలన నెవరి జాగ్రత్తయందు వారుందురే కాని, ఒకరికొకరు సాయము చేసికొనుస్థితిలో నుండరు. అది రాజమహేంద్రవరమున కెంతయు సహాయకారి. వారిని విడివిడిగ జయించుట సులభము.

ఇంతయాలోచనతోనల్లాడ అన్నయాదులకు వివిధమైన యాజ్ఞల నిచ్చి బాధ్యతల నప్పగించెను ఇది గ్రహించిన యొక

రిద్దకు సచివసమితిసభ్యు లల్లాడ మంత్రాంగమున కాశ్చర్యము చెంది యతని ప్రజ్ఞకు మనస్సులలో జోహారు లర్పించిరి. అందరు నల్లాడయొద్ద సెలవు దీసికొనిరి.

అందరితో బాటు అల్లాడ యాలోచనలుకూడ సెలవు దీసికొనబోయెను. ఇంతలో నల్లాడ యులికిపడి చూచెను. సచివసమితియు లేదు. సెలవుతీసికొను సభ్యులును లేరు... ఆశ్చర్యము! ఇది యంతయు తన యాలోచనయేనా ? ... బాగున్నది... ఆలోచనలోగూడ నొకమార్గము గోచరించి నది. అవును, ఇట్లే చేయవలెను. ఉదయము లేచినతోడనే సచివసమితిని సమావేశ మొనర్చెదను.

ఇట్లు నిర్ణయించుకొనిన యల్లాడ కాకసమున మేఘ ములు పోయి వెన్నెల యగుపించెను. రాజమహేంద్రవర రాజ్యాకాశమునగూడ నిట్లే మేఘములు తొలగిపోయి వెన్నెల కాయు నని తలపోసి యల్లాడ సుఖముగ నిద్రించెను.

౫

అన్నయామాత్యునిజాబును కొండవీటిలోని శ్రీనాథకవీంద్రుల కందించి తిరిగి వారియొద్దనుండి ప్రత్యుత్తరమును తీసికొనివచ్చి నప్పటినుండియు వరదారెడ్డి యొకవిధముగ మారిపోయెననియు సదా నవ్వుచు నవ్వించుచు నుండెడివా డీమధ్య మౌనము వహించి, పరధ్యానముగ నుండి, పలుకరించిన నులికిపడుచు నపరాధము చేసినవానివలె క్షణక్షణము భయపడుచు విచిత

ముగ బ్రవర్తించుచుండె ననియు, నన్నిటికంటె విరుద్ధముగ దేశము యుద్ధసన్నద్ధమైయున్న యీ తరుణమున, ప్రత్యేకాభ్యర్ధన మొనర్చి రెండున్నర పక్షములు రాచకార్యములనుండి సెలవు గైకొనినాడనియు అన్నయామాత్యులు బాచయ్యతో నొకటి రెండు పర్యాయములు తెల్పెను. చూడ జూడ బాచయ్యకు నట్లే తోచినది. ఏమై యుండనోపునని యోచించి యోచించి తుదకత డే ప్రేమవ్యవహారమునందో చిక్కుకొని యుండునని బాచయ్య నిర్ణయించెను. దానికితోడు మాటల సందర్భమున వరదారెడ్డి తా నీమధ్య నొక పెండ్లిసంబంధము చూచి వచ్చినట్లు చూచాయగా దెల్పెను.

ఇట్లు వరదారెడ్డినిగూ[illegible]లోచించు చుండగ బార్శ్వమున నడ[illegible] తలయెత్తి చూచెను.

విజయుడుమందహాస మొనర్చుచులోనికివచ్చుచుండెను. చిరునవ్వులు వెలయించుచున్న యీ విజయుని ముఖ మెంత యమాయకముగ నున్నది! ఇట్టివానిని జూచియా వరదారెడ్డి యనుమానించునది? "ఆతత్తరపాటు, బెదరుచూపులు జూచి నచో విజయునిపట్ల నాకేమియు సదభిప్రాయము కలుగుట లేదు. ఇత డెవరివాడో, ఏసీమవాడో నీవైనను తెల్పవు. ఇట్టివానిని కుమారగిరి యంగరక్షకదళమందు జేర్చుట వివేకమని నే నను కొన" నని వరదారెడ్డి తనతో నెన్నిపర్యాయములో యనెను.

కాని విజయుని జూచినచో నట్టిభావమే కలుగదు. ఇత నిలో నెంత యాకర్షణయున్నది! పరిహాసమాడినచో కపోలము లెరుపెక్కి విచ్చిన మందారము లగును. చిరుకోపము వచ్చి

నపు డాకనుల యందమును చూచితీరవలయును. పెదవి కదలని హాసము నిత డొక్కడే చేయగలడు. ఈ రెండు మాసముల లోను తనకును తన తండ్రికి నెంతచేరువై యాత్మీయు డయ్యెనో! "నీకొక తమ్ముడు దొరికినాడు. ఒంటరివాడ వని నే నిక చింతింప నవసరము లేదు. హాయిగ కన్ను మూయువచ్చు" నని విజయుడు కన్పించినపుడెల్ల తనతండ్రి అనుచుండును.

ఇటు లాలోచనలలో మునిగి తేలుచున్న బాచయ్య విజ యుని జూచియు పలుకరింపక యూరకుండెను. అందువలన విజ యుని మనస్సు చివుక్కుమనెను. బాచయ్య చూచియు బలుక రింప డేమి? తాను వీరి యింటికి తరుచు వచ్చుటవలన ననాదర మేర్పడినదా? పోనిమ్ము. ఇట్లు రాకుండ మానివేయుద మన్నచో నెల్లపుడు మన స్మృతే లాగుచుండును. కుమారగిరి ప్రభువు నంగరక్షకదళమున జేర్చి, నివాసము రాజాంతఃపురము నకు మార్చినది మొదలు పక్షమున కొక పర్యాయమైనను బాచయ్యను చూడకుండ నుండుట దుర్ఘట మగుచుండెను. తదనుగుణముగా గంగారెడ్డిగారును తనయం దమితవాత్స ల్యము జూపుచు తరచువచ్చి కన్పింపవలెనని యాదేశించిరి.

విజయు డిట్లాలోచించుచు ద్వారముకడనే యుండిపో యెను. విజయుడును బాచయ్యయు నెవరి యాలోచనలయందు వారుండి పరస్పరావలోకనమున చిత్తరువులవలె తోచ, నాసమ యముననే లోపలి మందిరమునుండి చతుశ్శాలలోనికి వచ్చు చున్న గంగారెడ్డి పకపక నవ్వి "ఏ మది? ఒకరినొకరు చూచు

కొనుచు మౌనముగ నున్నారు!" అనెను. వెంటనే వారిరు
వురు నొక్కసారి తొట్రుపడి "ఏమియు లే" దని గంగా
రెడ్డితో ననిరి.

"మా పెదతండ్రిగారు వారణాసినుండి యెప్పుడు వచ్చె
దరో తెలిసినదా?" యని విజయుడు గంగారెడ్డి దిక్కు గజూచుచు
బాచయ్యను బ్రశ్నించెను. ఆ ప్రస్తావన వచ్చినపుడెల్ల మాట
మార్చుట గంగారెడ్డివంతు. అందుకనే యతడు "విజయా! నీ
కీవిషయము తెలియునా! నేడు రాజమహేంద్రివర మహా
సైన్యము జైత్రయాత్రకు బయలుదేరుచున్నది. బాచయ్య
ప్రయాణాసన్నద్ధుడై యున్నా" డనెను [illegible] యనునట్లు
విజయుడు బాచయ్య కనులలోనికి [illegible]

ఇంతలో వాకిలిముంగిలి [illegible] ప్రారంభమైన
నట్లు నూదిన్మము ఘంటికానాదము, దాని వెన్వెంటనే యెడ
లంతయు గగుర్పొడుచునట్లు దుర్గమునుండి గంభీరముగ
కాహళధ్వనియు వినిపించెను. తోడనే బాచయ్య ఉష్ణీషము,
కృపాణము, రణరంగమునకు తగిన యుడుపులునుధరించి పితృ
పాదాభివందన మొనర్చెను.

కుమారుని సమరోత్సాహమునకు సంతోషము, అతడు
తిరిగి వచ్చువరకు తాను బ్రదికియుందునో ఉండనో యను
విచారము, తానేమైనను బాచయ్యకు విజయుడు బాసటయై
యుండునను ధైర్యము— ఈమూడు భావముల సమాహార
రూపమైన విలక్షణభావము మనసునునిండ నచేతనుడై కనుల
నీరు నింపుకొని గద్గదస్వరముతో గంగారెడ్డి బాచయ్య
నాశీర్వదించెను.

యుద్ధమునకు వెడలునపుడు వివాహితునకు భార్యయు, నవివాహితునకు తల్లియు వీరతిలకము నిడుట యాచారము. అవివాహితుడు మాతృవిహీనుడు నైన బాచయ్య తానే వీర తిలకము నిడుకొనఁబోయెను. వెంటనే యతని చేతిలోని తిలక మును దీసికొని విజయుడు అతనికి వీరతిలకము పెట్టెను.

ఆ సమయమున బాచయ్య నవ్వుచు పరిహాసోక్తిగ "నీవు నాకు తల్లివా, భార్యవా?" యనెను. ఆమాటలకు విజ యుడు సిగ్గుపడెను. అది చూచి బాచయ్య మరింత నవ్వెను. గంగారెడ్డియు నవ్వెను. విజయుడుకూడ నవ్వెను.

అటుల నవ్వుచు బాచయ్య యశ్వము నధిరోహించి, పట్టణపు పొలిమేరలయొద్ద సమీకృత మగుచున్న సైన్యమును గలియుటకు వెడలిపోయెను. కుమారుడు వెడలిన దిక్కునకల్లే చూచుచు స్థాణువవలె నుండిపోయి, ఒక్కమారుగ "బాచయ్యా!" యని హృదయవిదారకముగ నరచి గంగా రెడ్డి విజయుని చేతులలోనికి వ్రాలిపోయెను. విజయుని కనులు బాష్పాకులితము లయ్యెను.

బాచయ్య రాజమహేంద్రవరమునకు తూర్పుదిశనున్న విశాలప్రదేశమును జేరునప్పటికా ప్రదేశమంతయు నేలయీని నట్లు సైనికులతోడను, అశ్వములతోడను, గజములతోడను నిండిపోయెను.

ఎచట జూచినను సైనికసంరంభమే! ఎల్లెడలను హాయ హేషలే! ఎటుచిన్నను మదకరీంద్రఘీంకారములే!

[illegible] సైన్య [illegible] [illegible]లునో యెవరికిని తెలియదు. కొందరు కొండవీటి కనిరి. మరికొందరు మాకవరమున కనిరి. [illegible] కొందరు [illegible] కనిరి. వాదనలు, చర్చలు, ఊహాగానములు [illegible] [illegible] [illegible] బయలువెడలెను. మాడలు, టంకములు, [illegible] [illegible] [illegible] మీరిన కొందరు పూర్వయుద్ధములందలి [illegible] గురించి తెల్పుచుండిరి. కోలాహలముగనున్న [illegible] [illegible] మంతయు నున్నట్లుండి [illegible] [illegible] [illegible], ఏనుగులు, బారులు [illegible] [illegible] రాజ్యమ్ము హేంద్రవర [illegible] [illegible] తూర్యానచంద్రు [illegible] [illegible] యంతయునిళ్ళ [illegible] [illegible] గవనునుండి తూర్యారావములు [illegible]

[illegible] కెలంకుల నిరువదిమంది యాశ్వికులు నిటునటు నందీశ్వర భృంగీశ్వరులవంటి యుత్తమగజద్వయము కొలిచివచ్చుచుండ, పట్టపుటేనుగుపై తన ప్రక్క కుమారగిరి నిడుకొని యల్లాడ అచటి కేతెంచెను. వెన్నెలవెలుగులో పట్టపుటేనుగుపై యాసీనులైయున్న రాజును హేంద్రవరప్రభువు కుమారగిరిని జూచి, సైనికులు శిరములను వంచియు, నశ్వములు ముంగాళ్ళతో నేలను రాచియు, గజములు తొండము లెత్తియు గౌరవప్రణామము లాచరించెను.

అనంతర మల్లాడ యిరుకెలంకులనున్న భద్రగజముల నుపలక్షించెను. ఆయేనుగులపై చౌడోలులు కట్టించి, చప్పరములు సమకూర్చి, బంగారునిశ్శాణముల నిలిపి, ఒకదానిపై

నరహరియు వేమారెడ్డియు, మరియొకదానిపై వీరభద్రారెడ్డియు అన్నయామాత్యులు నాసీనులై యుండిరి. అనంతరము పంక్తికిపదిచొప్పున నూరుపంక్తులలో నిలువబడిన యేనుగులు, వాని వెనుక వరుస కిరువది వంతున నిన్నూరునరుసలలోనున్న సింధు యవన పారశీకాద్యశ్వములు, వాని వెనుక బారున కేబది తీరున వేయిబారులుగ తీర్చియున్న కాల్బలములతో కూడిన రాజమహేంద్రవర మహాసైన్యమును జూచి తల యూచి గంభీరస్వరమున నిట్లు ప్రకటించెను.

“జగనొబ్బగండ, కేళాదిరాయ, జగదగోపాల, సంగ్రామ ధనంజయ, జగరక్షణ భుజబలభీమ, (శ్రీ) (శ్రీ) (శ్రీ) కుమారగిరి మహారాజుగారు తన ప్రజల యభ్యున్నతిని, ఈదేశ గౌర వౌన్నత్యములను కాంక్షించి ప్రారంభించిన యీ జైత్ర యాత్రకు సర్వసైన్యాధ్యక్షులైన నరహరిగారిని నాయకులుగ నియమించినట్లు ప్రకటించుచున్నారు. మీరందరు క్రమశిక్ష ణతో మెలగి శౌర్యధైర్యముల బ్రదర్శించి దేశగౌరవమును బ్రతిష్ఠించి విజయలక్ష్మిని వరించి తిరిగి రండు. మీకు శుభ మగుగాక” యనెను.

జయ జయ ధ్వానములతో నా సైన్యమంతయు పూర్వ దశాభిముఖముగ కదలినది. రాత్రి యంతయు నట్లు ప్రయాణ మొనర్చి సూర్యోదయ మగుసరికి దక్షారామపురద్వారమును జేరి భేరీ మ్రోగించినది.

దక్షారామనగరునందు ప్రమత్తుడైయున్న అన్నదేవ చోడ గుండెలలో మ్రోగిన ట్లాభేరీ వినిపించెను. కాటయ

వేముడు గతించి యింకను రెండు మాసములైన కాలేదు. ఇంతలో కాల్నేతలు కూడదీసికొని రాజమహేంద్రవరసైన్య మెట్లు రాగలదను ధైర్యముతో నయిదు వేలమంది కాల్బలము, మూడువందలమంది యాశ్వికుల సాహాయ్యమునదక్షారామము నాక్రమించుకొని కూర్చున్న అన్నదేవచోడ ఈ హఠాత్పరిణామమును జూచి యేమిచేయుటకును దోచక, ఎటుబోవుటకును నిర్ణయించుకొనలేక తాత్కాలికముగ దోచిన యాలోచనప్రకారము ససైన్యముగ భీమేశ్వరాలయమున ప్రవేశించి నలువైపులనున్న గోపురద్వారములను బంధించెను.

ప్రతిఘటన మేమియు లేని కారణమున రాజమహేంద్రవర సైనికులు అనాయాసముగ దక్షారామము ప్రవేశించి నగరు నాక్రమించుకొనిరి. దర్భ పెట్టెడుప్రేళ్ళను మాణిక్యాల యుంగరములను దాల్చిన భూసురవరులు వారికి స్వస్తి వాచకములను, స్వాగతవచనములను బలికిరి. గంధర్వాప్సరోభామినులవంటి యాయూరి గణికలు మంగళహారతులనిచ్చిరి. అశేష దక్షారామప్రజలును నిండుమనస్సులతో వారికి జేజేలుపెట్టిరి.

పిదప, కెంబట్టు పొంబట్టు గుడారములను వేయించుకొని యందుపవిష్టులై నరహరి వీరభద్రారెడ్డి అన్నయామాత్యాది ముఖ్యులు తదుపరి కార్యక్రమమును, అన్నదేవచోడను నిర్జించు మార్గమును గురించియు చర్చించిరి. ఏమైనను గోపురద్వారములనుగాని, పవిత్ర దేవాలయ ప్రాకారములనుగాని భగ్నమొనర్చుట కన్నయామాత్యు లంగీకరింపలేదు. అంతియే కాదు. దేవాలయావరణమందు రక్తపాత మగుటకుకూడ నత డియ్య

కొనలేదు. ఇక నెట్లన్నదేవచోడను జయించుట ? మార్గాంతర మేమియు దోచక మిన్నకుండిరి. ఇట్లొక పగలు రాత్రియు గడచినవి.

దేవాలయప్రాకారములోపల అన్నదేవచోడ సైన్యము, బయట రాజమహేంద్రవర మహాసైన్యము. ఆసైన్యము బయటకు రాదు. ఈసైన్యము లోనికిబోవు నుపాయము లేదు. ఇట్లుండ వేకువజామున నొక జంగమదేవర రాజమహేంద్రవర సైనికులతో తీవ్రముగ వివాదపడి, తుదకు నరహరిసముఖమునకు తనను పిలిపించుకొని, నరహరిచేతిలో నొక పత్రముంచి, ఏమియు బలుకక వెడలిపోయెను. నరహరి యేకాంతమున నా పత్రములోని పంక్తులు చదువుకొని, అన్నయామాత్యులను రావించి యతని కాపత్రమును జూపించెను.

రేపురాత్రి మూడవయామము-ఉత్తరగోపురద్వారము-తెలిదిరాజు-కెంపుపతకములతో నాటకట్టు- అని వ్రాసియున్న యాపత్రమును జూచి యన్నయ తలయూచి, ఆనందముతో 'సమస్య తీరినది' యనెను.

మరునాడు రాత్రి రెండవయామము గడచుచుండెను. దేవాలయమందున్న యైదువేల సైనికులకును కొలదిమాత్రముగ నాహారపదార్థము లున్నవి, కాని దాహము తీర్చుకొనుటకు గ్రుక్కెడు నీరైనను లేదు. అన్నదేవచోడుని సైనికులకు నీరులేకపోవుట తీరని సమస్యయయ్యెను. సైనికులలో నసంతృప్తి బయలుదేరెను. ఇక లాభము లేదని గ్రహించి రాత్రి రెండవయామమునందు రహస్యముగ దక్షిణగోపురద్వారమును దెఱచి, ద్వారమునొరసికొనియున్న సప్తగోదావర

మను సరస్సునుండి నీరు లోనికి గొనిపోవుట కన్నదేవచోడ యనుజ్ఞ నిచ్చెను.

ఆ విధముగ గడచిన రాత్రియు కొందరు సైనికులు కడవలలో నీటిని లోపలకు జేర వైచిరి. అట్లే యీరాత్రి రెండవ యామమున పదిమంది యన్నదేవచోడుని సైనికులు కడవలను సప్తగోదావరముతో ముంచి నీటిని లోనికి మోయుచుండ, నాపదిమందిలో నొకడు పూర్తిగ నీటిలో మునిగిపోయెను. కాని, అతనిస్థానమున వేరొకవ్యక్తి వెంటనే కడవతో నీటిలో నుండి లేచెను. చీకటిలో [illegible] తమవాడే యను కొనిరి కాని, [illegible] జేర వైచినపిదప [illegible] లోనికి బోయెను. [illegible] సైనికులు బంధించిరి. ఎల్లెడల [illegible]. మూడవయామ మారంభ మాయెను. అన్నదేవచోడుని సైనికులందరు నిశ్చింతగ నిద్రించినపిదప నా నూతనుడు నెమ్మదిగ నుత్తరగోపురద్వారమును దెరిచెను. ద్వారముకడ వేచియున్న వేయిమంది రాజమహేంద్రవర సైనికులు నురమున కెంపుపతకములు మెఱయ ఛెంగు ఛెంగున గుఱ్ఱముల నాలయములోనికి దూకించి, అన్నదేవుని సైనికులు నిద్రనుండి లేచి కళవళపడి జరిగినదేదియో యర్థము చేసికొని సమాయత్తమగుటకుమున్నే యందరను బంధించి వైచిరి. ఆచీకటిలో కెంపు కాంతినిచ్చుటకును, తమవారికిని పెరవారికినిగల భేదమునుగుర్తించుటకు నుపయోగించినవి కెంపు పతకములు. అరుణోదయమగుసరికి అన్నయామాత్యుల యాశయము ప్రకారము రక్తపుబొట్టు చిందకుండ కార్యసాధనమైనది.

అన్నదేవచోడను, అతని ముఖ్యానుచరులను రాజమహేంద్రవరమునకు బందీలుగ బంపి, జితోస్మి యనిన యతని సైనికు నొక్కొక్కని నరహరి తన సైన్యమున జేర్చుకొనెను అన్నయామాత్యులు వీరభద్రారెడ్డితో కలిసి భీమేశ్వరాలయమున సంప్రోక్షణ జరిపించి, యా మహాదేవునకు సహస్రఘటాభిషేక మొనరించెను. పిమ్మట భీమేశ్వరునకు మొగలవాకిటధామమును రచించుటకు సప్తగోదావరమందు మంటపభవన నిర్మాణమునకు నేర్పాటులు గావించెను.

మరునాడు రాజమహేంద్రవర మహాసైన్యము విరామము లేకుండ పది గవ్యూతుల దూరము ప్రయాణముచేసి సర్పవరమును జేరుకొనెను. అచట తనమామ కాటయవేమ ప్రభువు నిర్మించిన భావనారాయణస్వామికి తన బావమరదియు రాజమహేంద్రవర ప్రభువునైన కుమారగిరి గోత్రనామములతో నర్చనలను భోగములను వీరభద్రారెడ్డి చేయించెను.

పిదప రెండహోరాత్రములునడచి యాసైన్యముమాకవరము జేరినది. మాకవర ప్రభువైన వానరాజు ముందుజాగ్రత్తకై యన్నియును సిద్ధముచేసికొని యుండెను. ఏదియో యొకరోజున రాజమహేంద్రవర మహాసైన్యము తనపైదండెత్తునని యూహించెను. అందులకే యప్రమత్తుడై కోట

యంతయు బాగుచేయించి ఆరుమాసములకు సరిపడు నాహార పదార్థములను లోనికి జేర్పించెను. కోటచుట్టును అగడ్తలను విస్తృతమొనర్చి వానిని నీటితో నింపెను. అంతియే కాదు, కోట కొక గోరుతము దూరమున మట్టికోటను, రెండు గోరుతముల దూరమున కంపకోటను నిర్మించెను. కంపకోట మాటునసైన్య ములో సగభాగమునుంచి రాజమహేంద్రవర సైన్యము నచ టనే యెదుర్కొనుటకు నిర్ణయించెను. ఇది యిట్లుండ సాహా య్యమునకై సప్తమాడియప్రభువైనపీరార్జుననకు కబురంపెను.

ఒకపగలు, ఒకరాత్రి కంపకోటయొద్ద యుద్ధము జరి గెను. కంపకోట మాటుననుండి మాకవర సైనికులు వేయు బాణములు సూటిగవచ్చి రాజమహేంద్రవర సైనికులకు తగులుచుండెను. ఘడియలో నూరుమంది రాజమహేంద్రవర సైనికులు మరణించిరి. ఇక లాభములేదని యారాత్రి జరిగిన యుద్ధములో వారు బాణములచివర నూనెగుడ్డలు చుట్టి నిప్పు ముట్టించి శత్రువులపై కిప్రయోగించిరి. అగ్నిబాణప్రయోగము వలన కంపకోట యంటుకొనెను. మాకవరసైనికులకు రక్షణ పోయెను.

వెంటనే వానరాజు తనసైన్యమును మట్టికోటలోనికి తీసికొనిపోయెను. కంపకోట మంటలార్పి రాజమహేంద్రవర సైన్యము వారిని తరుముచు మట్టికోటను చుట్టుముట్టెను.

ఆకోటకు నాలుగు గవనులు, నెనిమిది దిడ్లు, పదునారు బురుజులు, నరువదినాలుగు కొమ్మలు నున్నవి. గవనుకు వేయి, దిడ్డికి ఇన్నూరు, బురుజున కెనుబదిమంది చొప్పున సైనికు

లుండిరి. వీరితోబాటు కొమ్మనకు నల్వురు చొప్పున సాయుధు
లగు విలుకాండ్రుకోటను రక్షించుచు యుద్ధముజేయుచుండిరి.

తన సైన్యమును నరహరి నాలుగు భాగములుచేసి
మట్టికోటకు నలువైపుల నుంచెను. మూడువైపులనున్న
సైన్యము యుద్ధముచేయుటకును, నాల్గవముఖమైనకోట వెనుక
భాగమున రణ మొనర్పకుండ వీరభద్రారెడ్డి యప్రమత్తుడై
సైన్యముతో నిలచి యుండుటకు నేర్పాటు గావించెను.

అనంతరము నరహరి, యామట్టికోటకు నాలుగు శర
ముల దూరముననున్న సరస్సునుండి కాలువలు త్రవ్వించి
మట్టికోట చుట్టును నీరు పాఱునట్లు చేసెను. కుల్యలలోని నీరు
తొండములతో పీల్చి మూడువైపులను మూడువందల యేను
గులు మట్టికోటను తడుపుచుండ, నా తడిసినకోటను తమ
నడికి కట్టిన దారుకాస్తంభములతో తాకుటకు రెండువందల
యేనుగుల నాసర్వసైన్యాధ్యక్షుడు సమాయత్త మొనర్చెను.
ఇంకొక యిన్నూరు గజములుకూడ నట్లే తమకుంభస్థలముల
తోడను దంతములతోడను, తడిసిన మట్టిగోడను వ్రయ్యలు
చేయుట కేర్పాటుచేసెను. ఈ మహాకార్యమును సాధించు
చున్న యేనుగుల కన్నింటికి సమర్థమైన రక్షణ కల్పించెను.
వందలకొలది యాశ్వికులును, వేలకొలదివిలుకాండ్రును వానిని
రక్షించుచుండిరి.

పోరు ఘోరముగ సాగుచుండెను. క్షణక్షణమునకు
తడిసిపోవుచున్న మట్టికోట, ఏనుగుల భయంకరమైన తాకిడికి
ఊగిపోవుచుండెను. మాకవరసైనికుల నిశితాయుధము లాపాద
మస్తకవర్త్రితములైన యా గజముల నేమియు జేయజాల

కుండెను. ఇంకొక ఘడియసేపు పోరట్లే సాగినచో ఫెళఫెళార
వములతో కోటయంతయు కూలిపోయి యుండెడిది.

ఆ ప్రమాదమును గ్రహించియే వానరాజు మట్టి
కోట వెనుకభాగమునుండి పారిపోయి రాతికోటను జేరవలెనని
ప్రయత్నించెను. అచట పోరు జరుగుటలేదన్న మాటయే కాని
వేయిమంది యోధులతోడను పదివేలమంది కాల్బలము
తోడను వీరభద్రారెడ్డి కాపుండెను. అపర వీరభద్రావతారము
వలె నతడు కన్పించెను. ఇంతలో కోట బయట జయజయ
ధ్వానములు విన్పింప వానరాజు బురుజునుండి చూచెను. తనకు
వీరార్జునుడు [illegible] పంపిన సైన్యమును దొడ్డారెడ్డి
బంధించి [illegible] లేదని వాన
రాజు కోటపై [illegible] లొంగి
పోయెను. [illegible]

[illegible] "ధర్మదార" పట్టించెను.
"జయించినవాని కాలియందెలో నోడినవాని రూపున నున్న
బొమ్మ చెక్కించుట" యను బొమ్మపెట్టించు కార్యక్రమము
ప్రారంభము కానున్న సమయమున రాతికోటనుండి వానరాజు
భార్య యగ్నిశిఖవలె నేతెంచి కనుమూసి తెరచునంతటి సమ
యములో భర్తను బాకుతో పొడిచి తానుకూడ పొడిచికొని
చనిపోయెను. మానధను లవమానమును సహింపరుగదా!
పిమ్మట నాదంపతులకు రాజలాంఛనములతో నగ్నిసంస్కా
రాదులు జరిపించి, పూర్వము మాకవరాధీశవంశజుడును,
రాజమహేంద్రవర విధేయుడునైన పురుషోత్తముని మాకవర
ప్రభువుగ నియమించి, ససైన్యముగ నరహరి సప్తమాడియ
దిశగ బయలు దేరెను.

సప్తమాడీయును జయించి, వీరార్జును నోడించి తిరిగి రాజమహేంద్రివరమున కాతని సామంతునిగ జేయుట, రాజమహేంద్రవరసైన్యమున కెంతయో కష్టసాధ్య మయ్యెను.

కోటలోపల సురక్షితముగ వీరార్జునుని సైన్యము, కోట బయట కవచములు దక్క వేఱు రక్షణ యేమియును లేని రాజమహేంద్రవరసైన్యము. మధ్య పదిబాహువుల ఎత్తయిన కోట. అయిదు బాహువుల వెడల్పయిన యగడ్త. ఎట్లయినను కోటను పట్టుకొనవలెనని యిటు; ఏమైననుతీసిపోరాదని యటు. రోజులు గడచుచున్నవి. కోట చెక్కుచెదర లేదు. కోటలోని వారిధైర్యము మొక్కవోలేదు. ముట్టడించిన వారికి దిక్కుతోచుట లేదు.

పరిఖలనీది కోటద్వారమును తాకవలెనని రాజమహేంద్రివర దంతావళము లెన్నిమారులో ప్రయత్నించినవి. కాని కోటపైనుండి నిశితనిస్త్రింశాయుధములు వైచియు, గంధక ద్రావమును గుమ్మరించియు వీరార్జునుని సైనికులా ప్రయత్నము లన్నింటిని వమ్మొనర్చిరి.

ఒకరోజున వేమారెడ్డియు బాచయ్యయువీరావేశముతో పోరు సలిపి కోటలోని బురుజుల మాటునుండి బాణములను వేయుచున్న శత్రువుల నిన్నూరుమందిని చంపివైచిరి. ఎచ్చట చూచినను తానయైశత్రువులపాలిటి పిచ్చురపిడుగువలె విహరించుచున్న బాచయ్యనుపరిమార్చవలెనని శత్రువు లానాడు విఫలయత్న మొనర్చిరి.

మరియొకనాడు నరహరి ఆగ్రహావేశపరవశుడై భీకరముగ యుద్ధ మొనరించెను. అరువదేడుల యా వీరవరుడు

సింహళగంధసింధురముపై చౌడోలు వేయించి అధివసించి, సేనాముఖమున నిలిచి, ఒకచేతితో బల్లెమును ప్రయోగించుచు నోటితో కోటిని నొక్కిపట్టిన ధనువునకు రెండవ చేతితో బాణములు తొడుగుచు, కురుక్షేత్రమందలి భీష్మాచార్యునివలె యుద్ధమొనర్చుచుంత నిరుసేనలలోని వీరవరులును అమితాశ్చర్యమునొంది చూచిరి.

వారము దినము లైనది.

కోటలోనివారు లొంగివచ్చు నుపాయము కన్పించుట లేదు. తుదకు నరహరియు [illegible] మంత్యాలును సుదీర్ఘమగు మంతనము లొనర్చిరి. [illegible] దేశానుసారము మరునాడుదయమున రాజమ[illegible]న్యము శిబిరములనూడ బెటికి వచ్చినదారిని [illegible] చూచిన వీరార్జునుని యానందమున కవధుల[illegible] అంతటి మహాసైన్యమును వారమురోజు లెదిరించి నిలుచుటయే ఘనమైన విషయము. ఇక సైన్యము హతాశతో పారిపోవుచుండిన చెప్పవలెనా! ఆనందాతిరేకముతో వీరార్జునుడు "రాజమహేంద్రవర సైన్యమును తరిమి చీకాకుచేయు"డని తనసైనికుల కాదేశించెను.

వెంటనే కోటతలుపులు తెరచుకొనెను. బిలబిలమని కోటలోని పదునైదువేలమంది సైనికులును బయటకువచ్చి రాజమహేంద్రవరసైన్యమును తరుమసాగెను. అట్లు వారినిమూడు గవ్యూతులదూరము తరుమనిచ్చి ఒక్కమారుగ రాజమహేంద్రవర మహాసైన్యము వెనుదిరిగి వీరార్జునుని సైన్యమును చక్రబంధ మొనర్చి చుట్టుముట్టినది.

ఆదేసమయమున తెఱచిన కోటద్వారములోనికి వేయి మంది యాశ్వికులతో శరవేగమున బాచయ్యయు వేమారెడ్డియు బ్రవేశించి కోటను స్వాధీనమొనర్చుకొనిరి. ఈహఠాత్పరిణామమునుజూచి వీరార్జునుడు నిర్విణ్ణుడై జితోస్మియనెను.

సప్తమాడియ విజయానంతరము నరహరి తన సైన్యమునకు క్షణమైన విశ్రాంతినొసంగక హుటాహుటి శృంగవరపుకోటకు బయలుదేరెను. శృంగవరపుకోట స్థలదుర్గము కాదు; జలదుర్గము కాదు; గిరిదుర్గము.

ఏబదిబాహువుల యెత్తున నిట్టనిలువుగ నున్న యొక పర్వతముపై శృంగవరపుకోట యున్నది. అంతరిక్షములోనికి నిట్టనిలువుగ నధిరోహించుట యెట్లు? ఏమాత్రము వాలులేని కొండ నెక్కుట దుస్సాధ్యము. అయినను కొండపై మొలిచిన తుప్పలను మొక్కలనుపట్టుకొని రాజమహేంద్రవర సైనికులు కొందరు కొండనెక్కి దుర్గకుడ్యమును జేర బ్రయత్నించిరి. కాని కోటలోని బుంగరాజుసైనికులు వారినినిశితశస్త్రములతో వధించిరి. వారొకరి వెనుక నొకరుగ దొర్లిదొర్లి వచ్చి సేనాముఖముననున్న నరహరి పాదములయొద్ద పడిరి. హృదయవిదారకమైన వారిమరణము నరహరి, అన్నయామాత్యాది నాయకులను బాష్పాకులితనేత్రులుగను సామాన్యసైనికులను భయకంపితులుగను జేసినది.

భేరీపటహామృదంగములు మ్రోగించి కాహళులూది రాజమహేంద్రవరసైన్యము ముట్టడిని బ్రకటించినదేకాని ఎవరిని ముట్టడించుట, ఎవరితో యుద్ధముచేయుట? అంతరిక్షమున దుర్గరక్షణలో వారు; క్రింద కొండచరియ పాతాళములోవీరు.

రెండురోజులు గడచినవి. ఎన్నినా ళ్ళిట్లు కొండదిగువున కాచుకొని యుండుట? యుద్ధములేదుగాని కొండకు కాపుదల మాత్రము మిగిలినది! రాజమహేంద్రవర సైనికులలో నోర్పు తగ్గుచుండెను. ఎందులకీ వృధానిరీక్షణ యని వారిలో వారు విసుగుకొనుచుండిరి.

మూడవరోజున అన్నయామాత్యులు బాచయ్యతో కలిసి కొండచరియ వెంబడి గవ్యూతిదూరము వెడలి, కొండకు ప్రదక్షిణము చేయుచున్నట్లు మలుపుతిరిగిరి. అచటను కొండ నిట్టనిలువుగ నంతియే యెత్తున నుండెను. ఇరువురును మరల నట్లే మలుపు తిరిగి కొండ మూడవదిశకు వెడలిరి.

ఆశ్చర్యము! అచట కొండ నిట్టనిలువుగా లేదు. ఏటవాలుగ నెక్కుటకు వీలుగనే యున్నది. కాని కొండచరియ ప్రాంతమంతయు నరణ్యమయమై యుండెను. ఆ అరణ్యమున సైన్యమును నిలిపి, ఏటవాలుగనున్న యాదిశనుండి కొండపైకి వెడలి దుర్గము నాక్రమింపవలెను. ఈయాలోచనతో వారిరువురును దుర్గ మాక్రమించినంత సంతోషము కలిగెను.

వాస్తవముగ వారాశించినంత సుకరము కాదనియు, ఆ దిశనుండి కొండపైకి వెడలుట కూడ నత్యంత దుర్ఘటమనియు మరునా డుదయమున జరిగిన యుద్ధముతో కాని వారికి దెలిసి రాలేదు.

కొండపైకి వెడలుటకు ప్రయత్నించిన ప్రతిసైనికుని పైనను దుర్గమునుండి శిలావర్షము నగ్నివర్షము కురియ జొచ్చెను. వాని నెదిరించి వెడలుటకే యవకాశము లేదు. ఒక వేళ నెవరైన సాహసించినను వెంటనే యగ్నిశిలాపాతముల

కాహుతియగు చుండిరి. ఘడియలోనిన్నూరుపైనికులుమరణిం చిరి. నరహరికి దిక్కు తోచదయ్యెను. ఎవరైనను మొదట సాహసముతో కొండనెక్కి యా యగ్నిశిలాపాతముల నాప వలెను. అట్టి సాహసికు డెవరు ?

"ఎవరు? ఎవ" రని నరహరి యెలుగెత్తి యరచెను. సమాధానము లేదు. తమ కనులయందు జరిగిన యాబీభత్స మును జూచియుండుటచే నెవ్వరును సాహసింపజాలకపోయిరి.

"సరియే, నేనే బయలుదేరుదు"నని కనులలో విక్రాంతి మెఱయు నావృద్ధవీరు డనుటయు, "నేను పోవుదును" "నేను పోవుదు" ననుచు బాచయ్యయు దొడ్డారెడ్డియు నేకకంఠమున ననుటయు నొక్కమారే జరిగెను.

అనుటయే తడవుగ బాచయ్యయు దొడ్డారెడ్డియు తమ యశ్వములనెక్కి, ఆయేటవాలుకొండపై వానిని చిత్రవిచిత్ర గతుల నడిపించుచు, అగ్నిశిలాపాతములనుండి తప్పించుకొనుచు మనోవేగమున విఘటికకాలములో నేబదిబాహువులదూరము గడచి దుర్గకుడ్యమును సమీపించిరి. కుడ్యమున కిటునటు తిరుగుచున్న రెండుపళ్ళచక్రములను దొడ్డారెడ్డికి చూపించి "అవియే యగ్నిశిలాయంత్రములు. వానిని నిరోధించినచో అగ్నిశిలావర్ష మాగిపోవు" నని బాచయ్య యనెను. వెంటనే దొడ్డారెడ్డి తన చేతిలోనిబల్లెము నొక పళ్ళచక్రముపైకి విసర బోయెను. కాని యింతలో నొక పెద్ద బండరాయివచ్చి అతని తలకు తగిలినది. వెంటనే దొడ్డారెడ్డి గుఱ్ఱముపై నొరిగిపోయెను. బాచయ్య అతని చేతిలోని బల్లెమును తనచేతిలోనికి తీసికొను

చుండ మరియొక శిలవచ్చి బాచయ్య యురమును దాకెను.
విశ్వాసపాత్రమైన దొడ్డారెడ్డి యశ్వము తన యజమానిని
భద్రముగ సురక్షితప్రదేశమైన కొండదిగువభాగమునకు తీసి
కొనిపోవుచుండ, వక్షస్థలమునుండి కారుచున్న రక్తమును
లక్ష్యపెట్టక బల్లెము నాపళ్ళచక్రముపైకి విసిరి ఇంకను
ముందుకు పోసాగినాడు బాచయ్య.

బల్లెము పళ్ళచక్రములో గ్రుచ్చుకొనుటతో దాని
భ్రమణమాగినది. ఆభ్రమణముతో శిలాపాతము నాగినది.
కాని యింకను అగ్నిఖండములు వచ్చి పడుచునేయున్నవి. రెం
డవచక్రమాగినగాని అగ్నిపాత మాగిపోదు. ధట్టీలోని కృపా
ణమును బాచయ్య తీయబోయెను, కాని యింతలో నతని కుడి
భుజముపై నొక యగ్నిఖండము వచ్చిపడినది. వెంటనేకంఠ
సమీపమున మరియొకటి. అశ్వముయొక్క నుదుటనొకటి.
అతనియుడుపులపై నింకొకటి. ఆయగ్నిఖండముల నుండి వెలు
వడిన మంటలతనిని దహించివేయుచుండెను. భరింపరాని వేదన.
దుస్తులు మండి శరీరమంతయు కాలి బొబ్బలెక్కుచుండెను.
మరల మరియొక యగ్నిశిఖవచ్చి యతనిని దాకినది.

బాచయ్య భరింపరాని యాబాధ నణచుకొనుచు, కాలిన
కుడిచేయి స్వాధీనము తప్పుటచే నెడమచేతితో కరవాలమును
ధట్టీనుండి తీసి తనశక్తికొలది యారెండవ పళ్ళచక్రముపైకి
విసరెను. పళ్ళమధ్య కృపాణము గ్రుచ్చుకొని చక్రభ్రమణ
మాగినది. అగ్నివర్షము నాగినది. అగ్నిశిలావర్షములు రెండును
స్తంభించుటచే రాజమహేంద్రవర మహాసైన్యము శృంగవరపు
కోటనధిరోహించి దుర్గమునాక్రమించిబుంగరాజునోడించినది.

విజయమును సాధించిన సంతోషము నరహరికి కాని, అన్న యామాత్యులకు కాని లేదు.

దొడ్డారెడ్డియు, బాచయ్యయు తీవ్రముగ గాయపడిరి. అందును బాచయ్య పరిస్థితి మరింత ప్రమాదకరముగ నుండెను.

రాజమహేంద్రవరము చేరువరకైన నతడు సజీవుడై యుండునా ?

8

శరీరమంతయు గాయములతో, గాయములకు కట్టిన కట్లనుండి చిప్పిలుచున్న రక్తముతో, పూచిన మోదుగువృక్షమువలె నున్న బాచయ్యను నలుగురు కృపాణధారులు పల్లకినుండి దింపిరి. కుమారుని యా స్థితిలో జూచుటతోడనే గంగారెడ్డి స్పృహాగోల్పోయెను. అనారోగ్యముతో మంచానబడిన గంగారెడ్డికి సేవచేయుటకై యప్పటికి వారముదినముల క్రిందటనే యంతఃపురోద్యోగమున కొక పక్షము సెలవు పెట్టి గంగారెడ్డి యింటికి వచ్చిన విజయుడు బాచయ్య పరిస్థితినిజూచి దుఃఖవివశుడై నోటమాటరాక చేష్టలు దక్కి నిస్తేజుడై యుండిపోయెను.

ముందు బాచయ్యను దొడ్డారెడ్డిని అంచెబోయీలపై రాజమహేంద్రవరము బంపి అల్లాడకు తమ విజయపరంపరలను వార్తాహరులచే దెలియబరచి నరహరి, అన్నయ, వీరభద్రారెడ్డి ప్రభృతులు సైన్యముతో నెమ్మదిగ వెనుక బయలు

చేరిరి సామంతుల నందరిని జయించి రాజమహేంద్రవర సార్వ
భౌమత్వమును తిరిగి చిలుకసముద్రమువరకును స్థాపించి, కాట
యవేమప్రభుని తుదికోర్కెను దీర్చగలిగినందుల కానందించి
నను, వీరవరులైన దొడ్డారెడ్డి బాచయ్యల ప్రమాదస్థితికి అల్లాడ
మిక్కిలి యాందోళన జెందెను. రాజవైద్యులైన పరహితా
చార్యులను వారికి చికిత్సచేయుటకై నియమించెను.

పరహితాచార్యులు బాచయ్యగాయములపై రకరకము
లైన పసరులుపిండి, నాలుకపై నాలుగుచుక్కలౌషధముపోసి
పక్షమువరకును రాత్రింబవళ్ళేమరక చూచుచు చికిత్స చేసిన
గాని బాచయ్య దక్కుట కష్టమని విజయునకు హెచ్చరిక చేసెను.

విజయుడును రాజవైద్యుల సూచనప్రకారము జాము
నకు రెండుచుక్కల చొప్పున బాచయ్యనాలుకపై నౌషధము
వేయుచు, మధ్యమధ్య గంగారెడ్డి పర్యంకము కడకేగి యతనికి
సపర్యలొనర్చుచు రాత్రింబవళ్ళు గడపుచుండెను.

ఒకనాడు గంగారెడ్డి విజయుని చేతులుపట్టుకొని "నీ
సేవల కెన్నిజన్మలెత్తినను ఋణము తీర్చుకొనజాలము నీఓర్పు
నేర్పు చూచినచో నెప్పటికైన బాచయ్యనొక యింటివానిగను
చేయగలవనియు, వివాహమునకు వాని నొప్పించగలవనియు
దోచుచున్నది. నా బాల్యమిత్రుడగు బేతిరెడ్డికొమార్తెను
గాకున్న మరి యే యువతినైనను సరియే. వాడు పెండ్లి చేసి
కొని యీ వంశము నిలిపిన జాలును. నీవు నాకా సాహాయ్య
మొనర్తువా?" యనెను.

విజయు డట్లే యని గంగారెడ్డికి మాట యిచ్చెను.

వెంటనే గంగారెడ్డి భారము తీరినట్లు దీర్ఘముగ శ్వాస వదలి "ఇక నే నేమైనను చింతలేదు. భగవంతుడా! ఇకనన్ను దీసికొని పొమ్ము. నా కుమారుని బ్రతికింపు"మని పరమేశ్వరుని బ్రార్థించెను. అతనిమొఱ యా సర్వేశ్వరు డాలకించెనో యను నట్లు మరునాటినుండి గంగారెడ్డి పరిస్థితి విషమించి బాచయ్యకు స్వాస్థ్యము చిక్కినది. పక్షము తిరుగకుండగనే బాచయ్య లేచి నట్టింట నడయాడెను. గంగారెడ్డి స్వర్గస్థుడయ్యెను.

పితృవియోగముచే దుఃఖితుడైన బాచయ్యను విజయు డోదార్చి అతనిని అన్నివిధముల నాదుకొనెను. వీరభద్రారెడ్డి స్వయముగ వచ్చి బాచయ్యను పరామర్శించెను. మిత్రులైన యన్నయామాత్యులును వరదారెడ్డియు సరేసరి. ఉదయ సాయంసంధ్యలందు తప్పక వచ్చి బాచయ్యను పలుకరించి వెడలుచుండిరి. ఎవరేవిధమున నూరార్చినను బాచయ్యకు విజయుని యాదరణయే హృదయమున కుపశాంతిని గల్గించు చుండెను. అందులకే మరియొక మాస మాతనిని సెలవుపెట్టి తనయొద్ద నుండవలసినదని కోరెను.

ఆ నెలయంతయు విజయుడు బాచయ్య యింటనున్నను అతని శయ్యాగారము వేఱు. అతని స్నానాలంకరణాది కృత్య ములు ప్రత్యేకము. సంభాషణాది సమయములందు తప్ప తక్కిన సమయములందు విజయుడు దాదాపు ఏకాంతముగనే కాలము గడపును. బాచయ్య యింకను నిద్రలేవకముందే తన స్నాన మును ముగించుకొనును. ఏ వేళందును శరీరమును పూర్తిగ నాచ్ఛాదన మొనర్చు నుడుపులను, తలపాగను ధరించుట మరు వడు. విజయుని ప్రవర్తనకు బాచయ్య మధ్యమధ్యనాశ్చర్యము

తెంగుచున్నను, అది యతని యలవాటు, అతని స్వభావము తెన్నని సరిపెట్టుకొనుచుండును.

ఒకరోజున విజయుడు బాచయ్య వివాహప్రస్తావన దెచ్చెను. తన మనస్తత్వము వివాహమునకు విముఖమనియు, మీదుమిక్కిలి తన నాకర్షించెడి స్త్రీ తన కింతవరకును తటస్థపడలేదనియు బాచయ్య చెప్పెను.

చేతిరెడ్డిగారి కుమార్తె మాటేమిటని విజయుడు ప్రశ్నింప తన తండ్రికిని చేతిరెడ్డిగారికిని చిన్ననాటి చెలిమియే కాని తన కూహావచ్చిన తర్వాత తా మచటకుగాని వారిచటకుగాని రాలేదనియు, తండ్రి తనతో తరచు చేతిరెడ్డికుమార్తెను కోడలిగ చేసికొనవలెనని యనుటయేగాని వాస్తవముగ నామె రూపముగాని తుదకు నామె పేరుగాని తనకు తెలియదని బాచయ్య చెప్పెను. అయితే విజయుని ప్రథమపర్యాయము కలిసినపుడు తాను [illegible] చేతిరెడ్డిగారి యింటనుండియే వచ్చుచుంటినియు, కాని యాయనకొమార్తెను చూడలేదనియు తాను వివాహము చేసికొనవని ఖండితముగ జెప్పుటవలన చేతిరెడ్డిగారికింత కోపము వచ్చియుండుననియు బాచయ్య చెప్పెను.

అపుడు విజయుడు "ఎటువంటి యువతియైనచో నీవు వివాహమున కంగీకరింతు" వని ప్రశ్నించెను.

"నీవంటి..." యని బాచయ్య అర్ధోక్తిలోనే యాగి ఎఱ్ఱబడిన విజయుని కపోలములు చూచి పకపక నవ్వెను.

ఈ విధముగ బాచయ్యకు విజయునితో బాగుగ కాలక్షేపమయ్యెడిది. కాని సెలవు పూర్తియై యతడుద్యోగమున

దిరిగి ప్రవేశించి యంతిపురమున కేగిన పిదప బాచయ్య కేమియు తోచదయ్యెను.

తాను మాళవక,సప్తమాడియ మొదలగుదండయాత్ర లలో నుండ వరదారెడ్డికి వివాహమైనదట. "వివాహమున కెట్లును రాలేదు. మా యింటికైనను వచ్చి నాతో విందారగించి నాభార్య చేతివంట రుచిచూడు" మని వరదారెడ్డి పదే పదే యనుచుండెను. అతనికోరిక తీర్చినట్లును తనకు కాలక్షేప మైనట్లు నగునని బాచయ్య వరదారెడ్డి యింటికి బయలుదేర బోయెను. కాని, యింతలో వరదారెడ్డియే బాచయ్య యింటికి వచ్చి "రాజమహేంద్రవర విజయపరంపరలను బ్రకటించుజయ స్తంభమును చిలుకసముద్రముకడను శాసనమును పలివెల యొద్దను అల్లాడ వేయించి పౌర్ణమి పర్వదినముగాన ఆరోజు ననే రాజమహేంద్రవరమున ముత్యాలశాలలో సంగీత సాహిత్యసభల నేర్పాటుచేసె" నని తెలిపెను.

సభల కింక కొన్ని నిముసములుమాత్రమే వ్యవధియుండుటవలన మిత్రులిరువురునుముత్యాలశాలవైపు బయలుదేరిరి.

మార్గమధ్యమున వరదారెడ్డి కొండవీటిలోని విశేషములను బాచయ్యకు చెప్ప నారంభించెను. "అన్నయామాత్యులిచ్చిన లేఖను కొండవీటికి గొనిపోయితినిగదా! అచటి ప్రజలకు తమ ప్రభువైన పెదకోమటివేమ యన్నచో నెంత యాదరమని! మనకు శత్రువైనను ఏమాట కామాటయే చెప్పకొనవలెను. పెదకోమటివేమ రాజకీయములందేగాక సాహిత్యమునందును సమర్థుడు. శ్రీనాథునివంటి ఆంధ్రకవులను, వామన భట్టువంటి సంస్కృతకవులనేగాక ప్రాకృతకవులను కూడగౌర

[illegible] పోలుసి [illegible] శతికి వ్యాఖ్యాన మొనర్చిన పెద కోమటి వేమ కేవలము పండితుడుమాత్రమే కాదు. సంగీతశాస్త్రజ్ఞుడు, అలంకారశాస్త్రవేత్త, [illegible] రసికుడు. "సాహిత్య చింతామణి", "శృంగారదీపిక" మున్నగు గ్రంథముల నాతడు రచించెను.

[illegible] దుర్మదవరిపంధి శిఖరిదంభోళి [illegible] వేమ భూపతి ర్జయతి" అని [illegible] సరియే. పెరవారు నతని [illegible] సర్వజ్ఞుడు గనుక నే [illegible] తనిని తన యాస్థాన [illegible]

[illegible] ప్రస్తుతించుట [illegible] మనతో [illegible] ప్రజ్ఞా [illegible] ఒకే తెలుగుగడ్డలోని రెండుభాగములైన కొండవీటి రాజమహేంద్రవరములను సన్నిహిత మొనర్పరాదా? ఈ యకారణ వైరములవలన నొకే వేషభాషలు నొకే జీవితసరణియు గల తెలుగుబిడ్డలైన యన్నదమ్ముల మధ్య అగాధము లేర్పడుచున్నవిగదా? కొండవీటి కోడలు పుట్టిల్లయిన రాజమహేంద్రవరములోను, రాజమహేంద్రవరములోని రాజోద్యోగి కొండవీటియందలి భార్యాబిడ్డల కొఱ కలమటించుట యేమి? ఈయసంగతమున కర్థము లేదా?"

బాచయ్య యిట్లు తలపోయుచుండునంతలో వారిరువురును ముత్యాలశాల చేరిరి.

చందనాగురుకస్తూర్యాది సుగంధములతో, వజ్రవైడూర్యాది నవరత్నకాంతులతో వీరభద్రారెడ్డి, అన్నయామాత్య, శివలెంక కొమ్మనాది రసజ్ఞులతో నిండి, శారదానికేతనమై, రసరాజధాని యై, హృద్యంబై సకలజనమనోవేద్యంబై ముత్యాలశాల యలరారు చుండెను.

శాలనడుమ సముచితాలంకృతమైన వేదిక యొప్పారు చుండెను. ఆ వేదికపై సంగీతసాహిత్య చర్చలు జరుగనున్నవి. వేదిక సమీపమున నవరత్నఖచిత సువర్ణసింహాసనముపై కుమారగిరిప్రభు వాసీనుడై యుండెను. ఆబాలున కిరుకెలంకుల నల్లాడయు వీరభద్రారెడ్డియు నుచితాసనములపై నుపవిష్టులై యుండిరి. దక్షిణపార్శ్వమున సచివసమితిసభ్యులు, రాజబంధువులు మరల సామంతులుగ మారిన వీరాగ్రజాదులును కూరుచుండిరి. వామపార్శ్వమున కవి గాయక నాట్యాచార్యులును పట్టణప్రముఖులును, విద్వాంసులును, ద్వారపాలక లేఖక సూత మాగధ స్తుతిపాఠక వైతాళికులును గూర్చుండిరి. మేల్కట్టుపై ప్రతిసీరకు వెనుక అనితల్లి, హరిహరాంబ, తదితాంతఃపురస్త్రీలును రాజోద్యోగుల భార్యలును గూర్చుండిరి.

అన్నయామాత్యుల యధ్యక్షతను సాహిత్యచర్చకై నరసింహభట్టు, పెద్దిభట్టు, శివలెంక కొమ్మన, త్రిపురాంతకులు వేదికమీది కాహూతులైరి. ప్రజాసామాన్యమునకు సులభగ్రాహ్యముగ నుండునని సంస్కృత గ్రంథములను ఆంధ్రములోని కనువదించుట యెంతవరకు సమంజసమను విషయముపై చర్చ ప్రారంభమయ్యెను.

"సంస్కృతము దేవభాష. అందలి భావములు మహో
దాత్తములు. గ్రంథములు పవిత్రములు. వాని ననువదించి
యపభ్రంశ మొనర్చుట తగ" దని పెద్దిభట్టనెను.

"భాషాంతరీకరణమున భావములు మలినములగునా?"
యని యవహేళనగ వ్యధికరణ మొనర్చెను కొమ్మన.

"భావములు కాకున్న గ్రంథస్వరూపము తారుమారై
పోవును. ఏమైన నేమి?" యని నరసింహాభట్టనెను.

"అవును, వ్యాసప్రోక్తమగు మహాభారతమున కట్టి
గతియే నన్నయ పట్టించెను. తన క్షమగతము కాని వర్ణనలను
పహరించెను. తక్కిన యిరువురు స్వమార్గముననే వెడలి,
సంస్కృతభారతమును తమ యిచ్చవచ్చిన ట్లనువదించిరి."
పెద్దిభట్టు చేసిన యీ యధిక్షేపణకు [illegible] కలకలము
బయలుదేరినది. కరసంజ్ఞతో కలకలము వారించి అన్నయా
మాత్యులు కవిత్రయమువారి యనువాద విధానమును సమ
ర్థించెను. పురాణధోరణిలో సాగిన సంస్కృతభారతారణ్య
మును ఆంధ్రములోనికి చక్కని యుద్యానవనమువలె మార్చి
యుంచిరి కవిత్రయమువారని యన్నయామాత్యులు పలుక
సభలోని రసజ్ఞులు కరతాళధ్వను లొనర్చిరి.

"సరియే కవిత్రయము సంగతి యటుండనిండు. శబ్దము
ననుసరించుచు, భావము నుపలక్షించుచు, నసిధారావ్రతముగ
ననువాదము చేయుదునని ప్రగల్భములు పలుకుచున్న వారట్లను
వదించుచున్నారో చూచినారా?" యని పెద్దిభట్టధిక్షేపించెను.

"శ్రీనాథ మహాకవిని గురించియేనా మీరనునది ?" యనెను త్రిపురాంతకుడు.

"మహాకవియో మారణకవియో! నైషధములోని బంగారమువంటి శ్లోక మిది. వినుడు.

"సువర్ణ శైలా దవ తీర్య తూర్ణం
స్వర్వాహినీ వారికణావకీర్ణైః
తం వీజయామః స్మర కేళి కాలే
పక్షై ర్నృపం చామర బద్ధ సఖ్యైః."

దీనిని తన యిష్టమువచ్చినట్లు మార్చి యనువదించుట పాడియా?" యని పెద్దిభట్టు పృచ్ఛించెను.

వెంటనే వీరభద్రా రెడ్డి, "ఏమి చేసినాడు?"

"కనక శైలమ్ము డిగ్గి యాకాశసింధు
సలిలముల దోగి మిగులంగ చల్లనైన
చారు హాటక మయ గరుచ్చామరముల
వీతు నతనికి వైశాఖ వేళలందు."

అని కదా ఆయన యనువదించినది? ఇందు దోష మేమి?" య నెను.

"మూలములోని స్వర్వాహినిని వదలివై చినాడు. అనువాదమున 'చారు', 'హాటక' యను వ్యర్థపదముల నుపయోగించెను. వైశాఖవేళ ప్రస్తావన యప్రస్తుతము. అది కేవలము పాదపూరణకై తెచ్చిపెట్టుకొన్నది." పెద్దిభట్టు చెప్పిన ఝా

యభ్యంతరములును, చేసిన యీ యధిక్షేపణలను విని యన్న యామాత్యు లించుక కినిసి శ్రీనాథుని యనునాదవిధానము నిట్లు సమర్థించెను.

"స్వర్వాహినిని వదలిన నేమి? రససింధువు నందించిరి కదా? ఇక 'చారు' 'హాటక'ముల సంగతి. అవి వ్యర్థపదము లెట్లగును? నలుని వైభవమును దెలుపు సందర్భమున నవి యుచితపదములే! మూలమందలి 'స్మర కేళి కాల' ప్రస్తావనకంటె వైశాఖవేళ ప్రస్తావనయే యుచితము. ఏమన, దమయంతిని నలునివల్ల బద్ధానురాగను జేయవలసిన సందర్భమున నలు డితః పూర్వమే స్మరకేళియం దుండెనని తెల్పుట యెంత యసమం జసము! అందువలన శ్రీనాథుడు మూలమునకు మెఱుగులనే దిద్దెను గాని యందములను క్రిందుచేయలేదు."

సభలో కరతాళములు మ్రోగినవి.

సాహిత్యచర్చ ముగియుటకుముందు శివలెంక కొన్ముని, శృంగవరపుకోట యుద్ధమున యసమాన సాహసమును ప్రకటించిన దొడ్డారెడ్డికి తాను రచింపబూనిన శివలీలావిలాస మంకిత మీయదలచితి నని ప్రకటించి,

'అతుల మరంద బృంద సముదంచిత నాభినవాబ్జ షట్పద
శ్రుతుల దదంతరస్థిత సరోజభవానన సామ కోమల
శ్రుతులనిజాకృతుల్ముదము సొంపును బెంపు వహింపమెచ్చున
చ్యుతు డఖిలేశ్వరుండు మనుచున్దయ నల్లయదొడ్డభూవరున్.'

అనుచు నాశీర్వాదపద్యమును మనోజ్ఞముగ జదివెను. అనంతరము వీరభద్రారెడ్డి "శ్రీనాథకవీంద్రులను రాజమహేంద్రవరమునకు తీసికొనివచ్చుటకు మార్గముల నన్వేషించుచుంటి"మని ప్రకటించెను. సభ్యులు మిన్ను ముట్టునట్లు హర్షధ్వానము లొనర్చిరి. పండితులు ముఖము త్రిప్పుకొనిరి.

పిమ్మట శతావధాన మొనర్చిన సరస్వతిభట్టునకు ముత్యాలహారమును, అష్టావధాన మొనర్చిన వైకుంఠభట్టునకు నాలుగు వందల దీనారములను, నిరోష్ఠ్యపద్యముల నాశువుగ జెప్పిన శ్రీవల్లభున కిన్నూరు టంకములను దుశ్శాలువలను అల్లాడ కుమారగిరిప్రభువుచే నిప్పించి, దక్షిణ తాంబూలాదులు చర్చలో పాల్గొనిన కవిపండితులకును, చందనాక్షత పుష్పఫలములను సదస్యులకును సమర్పించెను.

అనంతరము జరిగిన సంగీతసభకు గౌతమజోషి యధ్యక్షత వహింప, కోరుకొండ ప్రభువైన సింగయనాయకుడు, సంగీత శాస్త్రవేత్తలైన సోమనాథభట్టు, శివదేశికులు, వల్లయలు సంగీతకళానిధిగ బేరుగాంచిన వేమారెడ్డియు సంగీత చర్చయందు బాల్గొనిరి.

చర్చయం దెన్నియో సంగతులు ప్రస్తావనకు వచ్చినవి. కళలయందు సంగీత ముత్తమ కళయని కొంద రనిరి. తపస్సునకును సంగీతమునకును పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ యనా నాలుగే యవస్థలనియు, నందువలన సంగీతము తపస్సువలె మోక్షసాధన మార్గమనియు, 'అ' కార 'ఉ' కార 'మ' కార

ముల సమన్వయమే ఓంకార మనియు, ఓంకారమే సంగీతము నకు బీజమనియు, ఈ ఓంకారమందు విష్ణురూపమైన 'అ' కారము, బ్రహ్మరూపమైన 'ఉ' కారము, భర్గరూపమైన 'మ' కారము నిమిడియుండుటచే సంగీతము ఓంకార నాదాత్మకమై సర్వోత్కృష్టమైన కళగా శ్లాఘిత మనియు వేమారెడ్డి యను టతో సభ్యులందరు 'నోహో' యనుచు తల లూచిరి. ప్రతిసీర వెనుకనున్న హరిహరాంబ యా మాటలకు పులకించెను. ప్రక్కనేయున్న యనితల్లి యది గమనించెను. అనంతరము వేమారెడ్డిని వీణవాయింపుడని యధ్యక్షుడైన గౌతమజోషి యభ్యర్థించెను. తనవీణె నిరుపయోగముగ నున్నదనియు, దానికి క్రొత్త తీగెలు వేయవలెననియు వేమారెడ్డి చెప్పెను.

రాజమహేంద్రవరమున సర్వోత్కృష్టమైనవీణెలు రెండే యున్నవి. ఒకటి అతనిది. రెండవది హరిహరాంబది. తన వీణె నిరుపయోగమైనది కాన ఇక హరిహరాంబ వీణె యొక్కటియే శరణ్యము. కాని హరిహరాంబ రాణివాసపుస్త్రీ. ఆమె సంగతి నిండుసభలో నెట్లు ప్రస్తావింపగలడు ? అందులకే తన వీణె యుపయోగరహితముగ నున్నదని మాత్రము జెప్పి వేమా రెడ్డి మిన్నకుండెను.

కాని, యింతలో నంతఃపురపరిచారిక, హరిహరాంబ యాదేశానుసారము వీణెను సభలోనికి తీసికొనివచ్చి వేమా రెడ్డి ముందుంచి వెడలిపోయెను.

ఈ వీణె ఎవరిది ? ఎవరు పంపిరా రని సభ్యులు నివ్వెఱ పడిరి. కాని యావీణె హరిహరాంబది యని యు,నా మెయే తన

పరిచారిక చే నది పంపియుండు ననియు వేమారెడ్డికి తెలియును. అతని మది పులకించినది. అతని యంగుళి యావీణెను శ్రుతి పర్వముగ పలికించినది. అతనిపాట హరిహరాంబ మదిలో ప్రేమామృతము నొలికించినది. వేమారెడ్డి హరిహరాంబ హృదయములలో వెలిగిన ప్రేమజ్యోతి వారికనులలో కన్పింప అనితల్లి యా నూత్న తేజము నొక కంట తిలకించినది.

వేమారెడ్డి కల్యాణిరాగ మాలపించినపుడు హరి హరాంబ దృక్కులు ప్రతిసీరను దాటివచ్చి యతని కనులతో కలసి కళ్యాణవతు లయ్యెను.

అతని మోహనరాగ మామెను విమోహితనొనర్చెను.

హంసధ్వని యామె మదిలో కలహంసారావమును సృష్టించెను.

అమృతము వర్షించినట్లు, చంద్రికలు శబ్దించినట్లు, సెల యేళ్ళు హసించినట్లు సర్వజనానందకరముగ వీణావాదనమొన ర్చిన వేమారెడ్డిని సభ్యులందరు వేనోళ్ళ ప్రస్తుతించిరి. సంగీత సాహితీమూర్తులుగ వెలుగొందుచున్న వీరభద్రారెడ్డి వేమా రెడ్డి సోదరులను సభాసదు లెల్లరు నభినందింప వారిరువురు తన కుమారులే కనుక అల్లాడ కనులు రెండును ఆనందాశ్రువులతో నిండెను.



౮

"ఉద్యోగి, అందును రాజోద్యోగి బ్రదుకు పరాధీనముగదా! నేను గత బుధవారమునాడు మీ యింటికి రాలేదని యలిగిన ట్లు? అయినను నీకు కాలక్షేపము కానిచో వివాహముజేసి కొని యామెతో ముచ్చటలాడుకొనవలెను గాని నావంటి మిత్రులను వేధించుకొని తినుట తగదుసుమా!" యని విజ యుడు ముసిముసి నవ్వులు నవ్వుచు ననెను.

"బాచయ్య చిరుకోపముతో "మాటిమాటికిని వివాహము వివాహ మందువు. ఇట్లు వేధించి బాధింపుమని మా నాయన నీకు హితోపదేశ మొనర్చి చనిపోయినాడా యేమి?" యనెను.

అయినను చేకరెడ్డిగారి కొమార్తెను పెండ్లి చేసికొను టకు నీ కభ్యంతర మేమి?" "అభ్యంతరమా? ఆమె సంగతి కేమి గాని నీ వాడుదానివిగ మారిపొమ్ము. అపుడు నిన్ను పెండ్లి చేసికొందు" నని బాచయ్య కోపముతో హేళననుకూడ కలిపి యనెను. విజయుడు సిగ్గుపడి, వెంటనే గాంభీర్యము వహించి "మిత్రమా! అయినచో నాయట్టి యందగత్తె కావలె నన్న మాట!" యనెను.

"నీవంటిదియైనచో సరిపోదు... ముమ్మూర్తులా నీ వలెనే యుండవలెను."

"చేకిరెడ్డిగారి కొమార్తె యట్లేయుండును. మే మిరువు రము కవలలవలె కన్పించెదము. ఆమె మగవేషము వేసికొని

నను, నేనాడు వేషము ధరించినను మాలో నెవరెవరో గురి_ంప లేరు. తెలియునా ?" యని విజయుడు దీర్ఘముగ నాలోచింప సాగెను.

"అట్లనా? ఈసంగతి నా కింతవరకును చెప్పితివి కావేమి? అయినను ఆమె నీకెట్లు తెలియును ? ఓహో... నీది కూడ కాజ్కూరపర్తికి సమీపమున గల కొండగుమురు గ్రామమే కదూ ?" బాచయ్య ప్రశ్నకు విజయుడు వెంటనే సమాధాన మీయలేదు; నిశితముగ నాలోచించుచుండెను.

"ఆమె నీకు తెలియునా? ఆమెయు నీవు నొకేరూపమున నుండు టెట్లు సాధ్యము? ఆమె నీకు దగ్గరచుట్టమా?" యని బాచయ్య యొకటితరువాత నొకటిగ ప్రశ్నలు వేసెను.

పరధ్యానముగనున్న విజయు డులికిపడి "అవును. ఆమెయు నేను నన్నదమ్ముల పిల్లలము. రెండుమూడు రోజు లలో నామె యిచటికి వచ్చును. అపు డామెను మీ యింటికి దీసికొని వచ్చెదను. ఆమెకును నాకును రూపమందే కాదు. నామమందు కూడ సామ్యమున్నది. నా పేరు విజయుడు. ఆమె పేరు విజయాంబిక" యని చెప్పి బాచయ్య ముఖకవళికలను బరిశీలించెను.

అత డాలోచనా మగ్ను డయ్యెను.

చేతిరెడ్డి కొమార్తె యింతటి సౌందర్యవతియా ?

విజయుడు నామెయు నింత సమీప బంధువులా ?

ఈసంగతి విజయు డింతవరకు జెప్పలే దేమి?

విజయు డంతఃపురమునకు వెడలిపోయిన పిదప బాచయ్య యట్లే యాలోచించుచు గూర్చుండెను.

అంతలో వరదారెడ్డివచ్చి "ఏమిటి బాచయ్యా! ఏకాంతముగ నేమి యాలోచించుచున్నావు? మా యింటికి పోవుదము, రమ్ము. వివాహమైన తర్వాత నీవు మా యింటికి రాలేదుకదా! మన మిరువురము కలిసి భుజించియు చాలరోజు లైనది." యనుచు బలవంతముగ నొప్పించి బాచయ్యను తన యింటికి విందునకు తీసికొనిపోయెను.

మార్గమధ్యమున వరదారెడ్డి యెన్నియో సంగతులు ముచ్చటించెను. విజయుని బెదురుచూపులు చూచినప్పుడెల్ల నతనిపై తన కనుమానము కలుగుచుండు ననియు, అట్టి యను మానాస్పదుడగు వ్యక్తిని కుమారగిరి యంగరక్షకదళమందు జేర్చుట ప్రమాదకర మనియు జెప్పెను.

అతని ననుమానింప నవసరము లేదనియు నతడు ప్రణిధి నాయకులు నూరన్నరెడ్డిగారి మఱదలికుమారు డనియు బాచయ్య వరదారెడ్డికి జెప్పబోయెను.

కాని యింతలో వారిరువురును వరదారెడ్డి గృహమును సమీపించిరి. మొదలే వరదారెడ్డి భోగపరాయణుడు. దానికి తోడు క్రొత్తగ పెళ్ళైనది. ఇక జెప్పవలయునా? గృహ మంతయు నవీనాలంకరణలతో శోభాయమానముగ నుండెను. ద్వారము చిత్తరువులతో, గోడలు చిత్రపటములతో నేల యంతయు మానికపు రంగుతో అగారములన్నియు సుగంధ పరిమళములతో నిండియుండెను.

భోగపరాయణత్వమును సూచించు నా యలంకరణము గాంచి బాచయ్య యిట్లు తలపోసెను.

"కర్మభూమియని పేరుగాంచి నిరాడంబర జీవనమునకు నెలవై ప్రసిద్ధిజెందిన యీ దేశము తురుష్కదండయాత్రా ఫలితముగ నెంతటి విలాసజీవనము నలవరచుకొనినది ! ఎవరిని జూచినను సంప్రదాయజీవనమును విడచినవారే. నియమజీవితము నీసడించువారే. అభిషేకమొనర్చి, శివార్చనజేసి, ప్రాసాదపంచాక్షరి నయుతసంఖ్యముగ జపించి, స్నానసంధ్యాగ్నిహోత్రములను నియమము తప్పక యాచరించుచు, భస్మత్రిపుండ్రములను రుద్రాక్షలను ధరించి యాధ్యాత్మికదృష్టితో జీవించువారిని ఛాందసులని యవహేళన మొనర్చు కాలమాసన్నమైనది. రాజమహేంద్రవరమునగూడ నీ భోగలాలసత యధికమైనది. దీనివలన బాధ్యతలు మరచి, జాతి నిర్వీర్యమగును కదా !"

ఇట్లాలోచించుచున్న బాచయ్యకు ప్రతిసీరవెనుక నడుగుల సవ్వడి వినవచ్చెను. అంత వరదారెడ్డి "శ్యామలాంబా! ఇతడే నా మిత్రుడు బాచయ్య. ఇతనిని గురించియే నీకుతరచు చెప్పుచుందు" ననెను.

ప్రతిసీర వెనుకనుండియే యామె నమస్కరించెను. బాచయ్యయు నామెకు ప్రత్యభివాద మొనరించెను. సుఖాసీనులై మిత్రులిరువురు నెన్నియో సంగతులను ముచ్చటించిరి. "వేమారెడ్డి హరిహరాంబల నడుమ ప్రేమ యంకురించినట్లున్నది. మొన్న సంగీతసభయందామెయే యతనికి వీణ బంపినదట" యని వరదారెడ్డి యనెను. బాచయ్య యతని పలుకులువినియు విననట్లూరకుండెను.

"ఆంపదొర యవిధేయుఁడై రాజమహేంద్రవరమునకు కప్పము కట్టుట మానినాడట. అతని నణచుటకై యల్లాడ ప్రభువే స్వయముగ సైన్యాధిపత్యమును వహించి అంపపై దాడి వెడలనున్నారట!" యని వరదారెడ్డి యాశ్చర్యముగ దెలుపుటతో బాచయ్య మరింత యచ్చెరువు నంది "అట్లనా! అల్లాడరెడ్డియే స్వయముగ వెడలునా? నిజమా?" యనెను.

అన్నియు వడ్డించి యింకొక యగారములోనికి తప్పు కొనుటవలన, విందారగించిన బాచయ్య శ్యామలాంబను చూచుటయే తటస్థింపలేదు. బాచయ్య వెడలిన పిదప వరదా రెడ్డి శయనాగారమును జేరెను.

అచట శ్యామలాంబసోరణగండ్లనుండి హేమంతశోభను జూచుచు వరదారెడ్డి రాకకై సాలంకృతయై వేచియుండెను. చేమంతులు పూయుటకు ఉసిరికలు కాయుటకు పగలంతయు నెండ యెంత తీక్ష్ణముగ కాసినదో, సెనగచేలు పెరుగుటకు గోవులకు క్షీరసంపద వృద్ధిచెందుటకు రాత్రిసమయమున మంచు అంత దట్టముగ కురియుచుండెను. మసకవెన్నెలలో పచ్చిక మెరయుచుండెను. ఆ పచ్చికపై నప్పటికే పడుచున్న మంచుబిందువులు వెన్నెలలో మెరయుచు, భూదేవికి శీతఋతు ప్రభువు కానుకగ నర్పించిన వజ్రములవలె తోచెను.

ప్రకృతిని తిలకించుచు నటు తిరిగి నిలుచుండిన శ్యామ లాంబను వరదారెడ్డి యెడ లంతయు గన్నులు జేసికొని చూచెను. పట్టుంబట్టుచీరయు యమునరవికయు ధరించి, పాపటబొట్టు, చంద్రవంక, రాగిడితో శిరోజముల నలంకరించుకొని

ముత్యాలజల్లియు బంగారు జడకుచ్చులు వినీలకుంతలములకు వినూత్న సౌందర్యమునీయ, కంఠమున నేకావళియు రత్నహార మును ధరించి, చెవులకు చౌకట్లు, ముక్కునకు ముక్కెఱ, బాహువులకు వలయకేయూరములు, నడుమునకు రత్నమేఖ లయు, పాదములకు పారాణియు పిల్లందియలు నలంకరించుకొని యామె మన్మథు నారవసాయక మట్లు కన్పించెను.

తమకము నాపుకొనలేక తటాలున వచ్చి వరదారెడ్డి యామెను తన సందిట పొదువుకొనెను. ఆమె యులికిపడి యంతలోనే మధురముగ నవ్వెను. ఆలింగనమం దిరువురు నానందావధి నతిక్రమించి తా మిరువురు నొక్కరే యను మధురభావన పొందిరి.

మరునాడుదయమున శ్యామలాంబముంగురులుసవరించి యామె కపోలములు స్పృశించుచు "వైవాహికజీవిత మెంత మధురమైనది. ఈ యానందము తెలియకయే వేమారెడ్డి బాచయ్యవంటి యమాయకులు వైరాగ్యభావనలు పెంచుకొని యకాల వార్ధక్యమును తెచ్చుకొనుచుండి" రని వరదారెడ్డి యనెను.

"వేమారెడ్డియన నల్లాడప్రభువు పెద్దకుమారుడేనా?"

"అవును. బాచయ్యయన నిన్న సాయంత్రము వచ్చి నాతో మనయింట విందారగించి వెళ్ళినవ్యక్తి. పాప మతని తండ్రి గంగారెడ్డి..."

"ఏ గంగారెడ్డిగారు? కాజ్కురపర్తి యుద్ధమున కొండ వీటి సైన్యమును చెదరగొట్టి 'ఆహావమల్ల' యను బిరుదమును

కాటయవేమప్రభువు నొద్దనుండి పొందినవారేనా ?" యని శ్యామలాంబ యాత్రముగ నడిగెను.

"అవును... ఆయన నీకెట్లు తెలియు" ననెను వరదారెడ్డి. వెంటనే శ్యామలాంబ సంబాళించుకొని "మా నాన్నగా రొకటి రెండు సార్లు వారినిగురించి చెప్పినారు లెం"డనుచు పర్యంకము దిగి, తన ముఖకవళికలను వరదారెడ్డి గమనించునను భయముతో నింకొక యగారములోనికి వెడలిపోయెను. గంగారెడ్డి బాచయ్యలతో నీమెకు పూర్వపరిచయముండునని వరదారెడ్డి నిర్ధారించెను.

తరచు తనతండ్రి ప్రస్తావించెడి బాచయ్య యితడన్నమాట! వార్ధకమువలన తన తండ్రియు గంగారెడ్డిగారును పదిపదునైదు సంవత్సరములనుండి యొకరినొకరు కలిసికొనజాలక పోయిరి; కానిచో తా నీ బాచయ్యకు భార్యయై యుండెడిది. బాచయ్య కార్యకర్తగ వచ్చినరోజున తాను మేనమామల యింటికి వెడలినది. కానియెడ నతడు తనను చూచియుండెడివాడు. ఏమో ! అపుడేమి జరిగియుండెడిదో. వివాహము చేసికొనునని యానాడు బాచయ్య తన తండ్రితో ననుటవలననే కదా తన తండ్రి యమిత విరక్తి చెంది యిక బాచయ్యసంగతి ప్రస్తావించకుండ తన నీతనికిచ్చి వివాహ మొనర్చెను. ఇన్ని జరిగియుండకపోయినచో...?" ఇట్లు శ్యామలాంబ యారోజంతయు నాలోచించుచుండెను. భార్య దేనినిగూర్చి యంత తీవ్రముగ నాలోచించుచున్నదా యని వరదారెడ్డి యాశ్చర్యము జెందెను.

కుమారగిరిప్రభుని దైనందిన కార్యక్రమము మాతృపాదాభి వందనముతో నారంభమగును. ఆరోజుకూడ నంగరక్షకుడైన విజయుడు కుమారగిరిప్రభువును దొడ్డాంబిక యంతఃపురమునకు తీసికొని వెడలెను. ప్రతిసీర వెనుక ధవళాంశుకము ధరించి శోక మూర్తియై కూర్చుండిన దొడ్డాంబిక తనయుని జూచి కనులు దుడుచుకొని లేచి యెదురువచ్చినది. వినీతుడై పాదాభివందన మాచరించిన కుమారు నాశీర్వదించుట మరచి విచారో ద్విగ్నయై బుజములు పట్టుకొని లేవనెత్తి గుండెలకు హత్తు కొనినది. కన్నులను కపోలములను ముద్దాడినది కాని మూర్ధా ఘ్రాణ మొనర్చుట మరచినది. ఒకచేత చిబుకమును పుణికి మరియొకచేతచుంచువు దువ్వి, అంతరంగమునుండి పొంగివచ్చు చున్న యాత్మీయభావములకు తగిన పదములును, భాషయు దొరకక దొడ్డాంబిక మౌనముగ కనులనీరు నింపినది.

భర్త కాటయవేమప్రభుని మరణమువలన జనించిన విషాదమునుండి యిన్ని నెలలు గతించినను ఆమె యింకను తేరుకొనలేదు.

కుమారగిరిని మాతృమందిరమునుండి తిరిగి తీసికొని వెడలుచుండ, "ఉంపదొరను శిక్షించుట కల్లాడప్రభువు తానే దండయాత్ర కాధ్వర్యము వహించి యింక కొద్ది గడియలలో ఉంపకోటకు వెడల నున్నారని పరిచారకు లనుకొనుమాటలు

విజయుని చెవినిబడెను. సైన్యము నంపకోటకు బయలుదేరు నన బాచయ్యకూడ బయలుదేరు నన్న మాట !

యుద్ధమునకు సన్నద్ధుడగు బాచయ్యకు వీరతిలకము నెవరు దిద్దుదురు ? వ్యవధి యెంతయో లేదు. తాను వెంటనే వెడలి యతని నుదుట తిలకము నుంచవలయును. కాని తానిప్పు డెట్లు వెడలుట? అంతఃపురాధికారి లేడు. ఆయన యనుజ్ఞాపత్రము లేనిచో ద్వారపాలకులు నంతఃపురరక్షకులును తనను బయటకు పోనీయరు. అధికారి మరిరెండు ఘడియలకు కానిరాడు.

ఇపు డేమి చేయుట ?

వ్యగ్రుడై యున్న విజయునిజూచి కుమారగిరిప్రభువు "విజయా ! విచారముగ నున్నావేమి ?" యని తనచిన్నారి మాటల బలుకరించెను.

విజయుడు తక్కినదంతయు దెలుపక, "ముఖ్యకార్యము మీద వెంటనే యూరిలోనికి బోవలసియున్న" దని మాత్రము దెలిపెను. అంతఃపురాధికారి లేనిచో తన యంగుళీయమును దీసికొనివెడలి ద్వారపాలకులకు జూపింపుమని కుమారగిరి తన యంగరమును విజయున కిచ్చెను. సందేహించి, సందేహించి తుదకు విజయు డాయుంగుళీయమును గ్రహించి కనుల కద్దుకొనెను.

గత సాయంత్రమే యా చిన్నారిప్రభువు తనతో "మామయ్యగారెచటికో వెడలుచున్నారట. తిరిగి వచ్చుట తోడనే యాచార్యులయొద్ద నాకు బాణములు వేయుట, కోశ ములు జవుపుట, గంటముతో వ్రాయుట నేర్పించెదరట. అవి యన్నియు నేర్చినచో నేను గొప్పవాడ నగుదునట ! పెద్ద

కోమటివేముకంటె, కర్ణాటప్రభువైన రాయలకంటెగొప్పవాడ నగుదునట. అపుడు నా యంగుళీయమును గాంచినచో నెంతటి వారైనను తలవంతురట!" యని పసితనము జాలువాఱ, నేవేవియో ముచ్చటగొలుపునట్లు ముద్దుగ బలికెను.

ముందెన్నడో యేల? కుమారగిరిప్రభుని యంగుళీయమున కిపుడే ప్రాధాన్యము వచ్చినది. ఇట్లనుకొనుచు విజయుడు ద్వారపాలకులకు ప్రభువు నుంగరమును జూపి అంతిపురము వదలి నగరములోనికి బ్రవేశించెను.

రాజవీధులను గడచి బాచయ్య గృహాభిముఖుడై పోవుచున్న విజయునకు బాచయ్యమాటలు జ్ఞప్తికి రాసాగెను.

గోదావరిని దాటుచుండ తాను బాచయ్యను మొదట చూచినపుడు, "రెప్పవాల్చక చూచుచున్న నీవు యువకుడవు కనుక సరిపోయినది. ఇదియే యువతివైనచో..."యని యర్థోక్తిలో నాగి నవ్వెను.

ఇంకొకమారు రొయ్యారముగ నిలుచుండినపుడు "ఆడుదానివలె నెంత యందముగ నున్నావు!" అనెను.

వీరతిలకము నిడినపుడు "నీవు నాకెట్టి బంధువు? తల్లివా, భార్యవా?" యని ప్రశ్నించెను.

మరియొకమారు "చెలిరెడ్డి కొమార్తె ముమ్మూర్తులా నీవలె నున్నచో బెండ్లిజేసికొందు" నన్నాడు.

ఇవి యన్నియు దలపోయ విజయునకు తా నిప్పుడేల చెలిరెడ్డికొమార్తె రూపమున బాచయ్య యొద్దకు పోరాదు అని తనను తాను ప్రశ్నించుకొనెను.

"అవును. కొండవీటిలో గృహనిర్బంధమునుండితప్పించు కొనినది మొదలు నేనీ పురుషవేషమును ధరించి చాల వెత నొందుచున్నాను. అడుగడుగున గండము. అసహజమైన వేషము. విజయాంబికను విజయుడనైతిని. పెదనాన్న సూరపరెడ్డిగారి యిల్లుజేరిన పిదప నీవేషము తీసివేసి స్వస్వరూపముననుఖముగ నుండవచ్చునని యాశించితిని. కాని నా దురదృష్టము! వారు వారణాసి వెడలి యింతవరకును రాలేదు. ఇంతలో నీరాజో ద్యోగము ఒకటి! మగవేషమున నుండుట రానురాను చీకాకు కల్గించుచున్నది... నేను తిరిగి విజయాంబికనై యట్లే యుండి పోయినచో ప్రాణమునకు సుఖముగ నుందును. అందుల కిపుడు మంచి యవకాశము లభించినది. దుకూలవ్యాపార ప్రదేశమున కేగి స్త్రీల యుడుపులను కొని, రహస్యప్రదేశమున అమ్మవారి గుడిలోనో, చంప్రదు గుడిలోనో యీ యుడుపులను మార్చి వానిని ధరించి, వీరతిలకము నిడుటకై బాచయ్య యొద్దకు బోయినచో నేనే బేతిరెడ్డికొమార్తెనని యతడు విశ్వసించును. ఆమె నతడు చూడలేదు కదా? తుదకామె పేరైనను బాచ యక్యకు తెలియదు. మీదుమిక్కిలి ఆమెపేరు విజయాంబిక యనియు నాకు చెల్లెలువరుస యగుననియు నతనితో నింతకు పూర్వమే చెప్పితిని. అంతేకాదు. ఆమె రాజమహేంద్రవరము వచ్చినది. ఒకటి రెండురోజులలో తీసికొనివచ్చెద ననికూడ చెప్పియుంటిని. ఇపుడు నేను కనిపించినచో నామెయే యను కొనును. పురుషవేషమున నుండినపుడే నన్నుజూచి మెచ్చు కొనుచుండెడివాడు. స్త్రీనై యతని కనులకు కనిపించినచో

నాయందమునకు విమోహితుడు కాకుండునా ? నన్ను చేపట్టి నా యాశలను జీవితమును వెలిగింపడా ?"

ఇట్లాలోచించి, ఆలోచనప్రకారము విజయుడు విజయాంబికయై తన వేషమును మార్చి నవయౌవన సుందరాంగియై బాచయ్యముందు నిలిచెను.

శిరస్త్రాణమును ధరించి, పట్టుధట్టీని బిగించుకొని యుద్ధమునకు సన్నద్ధమగుచున్న బాచయ్య, ద్వారమును దాటి యెంతయోపరిచయమున్న వ్యక్తివలె చతుశ్శాలలోని కడుగిడి యభివాదమొనర్చిన విజయాంబికను జూచి చకితుడై యట్లే యుండిపోయెను.

తాను బేతిరెడ్డికొమార్తెననియు, తనపేరు విజయాంబిక యనియు, విజయుడు తన పెదతండ్రి కుమారుడనియు, నతడు రాజకార్యముల యొత్తిడివలన రాజాలకపోవుటచేత తాను మాత్రమే గంగారెడ్డిగారిని చూచుటకు వచ్చితిననియు విజయాంబిక తెల్పెను.

విజయాంబిక యూహించిన ప్రకారము బాచయ్యకెట్టి యనుమానము కలుగలేదు. రూపములో, కంఠములో, నిలుచున్నతీరులో, మాటాడు విధానములో నీమెకు విజయునకు నెన్నిపోలికలు గలవని యతడాశ్చర్యము చెందెను. తనతండ్రి గంగారెడ్డి మరణించినారని తెలిపి బేతిరెడ్డిగారు క్షేమమా యని బాచయ్య యామెను ప్రశ్నించెను.

పంట ధ్వంసమై తన తండ్రి సుంకమును కట్టలేకపోగా రెడ్డికము తన తండ్రిపై ఉపమండలాధిపతియొద్ద నభియోగము వైచెననియు, మొదట కాయసాధికారికి పిదప మండలేశ్వరునకు

తదుపరి మహామండలేశ్వరునకు పంపించుకొనిన విజ్ఞాపనలు వ్యర్థమైనవనియు, నగరరక్షకసభయందు శిక్షపడినదనియు, మహాతలవరి తన తండ్రిపాదములకు నిగళయుగమును తగిలించి ముంజేతులకు వెదురుగడియ వేసి, కంఠమునకు పాదములకు నొక గొలుసులదండ బాగుదండ గల్పించి జామున్నర కాల మెదురెండలో నిలువబెట్టి పిదప కారాగారమున పైచెననియు విజయాంబిక కథ కల్పించిచెప్పెను.

అది యంతయు నిజమని బాచయ్య నమ్మెను. తన తండ్రిగారి మిత్రుని కొమార్తె దుస్థితికి బాచయ్య వగచెను. తండ్రి యట్లగుటవలన నిక కాజ్యారవర్తిలో నుండలేక విజయుని వెదకుకొనుచు తాను రాజమహేంద్రవరము వచ్చితి ననియు, నీ మూడు నాలుగు రోజులనుండియు విజయునిమిత్రుని యింట తాను తలదాచుకొంటి ననియు విజయాంబిక చెప్పెను. అంతఃపురమున తనకు ఏదకు పరిచారిక యుద్యోగమైనను లభింపదా యని ప్రశ్నించెను. ఏదకామె కాశ్రయమైనను లేదని విని బాచయ్య మరింత వ్యథజెందెను.

"నే నిపుడు యుద్ధమునకు వెడలుచున్నాను. మూడు నాలుగుదినములలో తిరిగివచ్చెదను. పిమ్మట మీనాయనగారిని చెఱసాలనుండి విడిపించుటయో, నీకు అంతఃపురమున నేదైన యుద్యోగము కల్పించుటయో, అన్నయామాత్యులతో సంప్రదించి నిర్ణయింతును. అంతవరకును నీవిచటనే యుండుము సందేహింపకుము." ఇట్లనుచు బాచయ్య బయలుదేరెను.

విజయాంబిక "ఒకింత యాగు" మని వీరతిలకమునుతీసి కొనివచ్చి యతని నుమట నుంచినది. అతడు మొదట వారించి తుద కంగీకరించి ఆమె యిడిన తిలకమును ధరించుచు "విజయుడు నిల్లే యొకపరి నాకు వీరతిలకము నిడెను. అతని నడిగి నట్లే నిన్ను నడుగుదునా? వీరతిలకము నవను పెట్టుదునో తెలియునా?" యని నవ్వుచు యుద్ధమునకు వెడలిపోయెను.

తిలకాంకితమైన తనవ్రేళ్ళను చెక్కిలికి ఆనించుకొని ఎన్నియో మధురమైనయూహలను మనస్సులో నింపుకొనుచు, బాచయ్య వెడలినదిక్కునే చూచుచు పరధ్యానముగ విజయాంబిక యట్లే యుండిపోయెను.

వరదారెడ్డి యింటనున్న పరిచారిక యేతెంచి "గంగా రెడ్డిగారియింట నెవ రుండిరో తెలిసికొని రమ్మని వరదారెడ్డి భార్య శ్యామలాంబ పంపినది" అని చెప్పెను.

ఈ యింట నాడువారు లేరే! అయినచో నిచట నుండు వారితో నామె కేమిపని? ఆశ్యామలాంబకు ఈబాచయ్యకును పూర్వపరిచయ మున్నదా? ఉన్నచో నెట్టి పరిచయము! విజయాంబిక హృదయమున సంతృప్తి చేగినది. కలయూపు తెలిసికొనవలె నను నుత్సుకతయు గలిగినది. అంతటి విలాస పురుషుడైన వరదారెడ్డిభార్య యెట్లుండునో చూడవలయునను కోర్కెకూడ జనించినది.

ఆ పరిచారిక వెనుక విజయాంబిక శ్యామలాంబకడకు బయలుదేరినది.

హేమంతఋతుపత్నివలె ధవళాంశుకమును మాత్రము ధరించి, నిరలంకృతయై నిరాడంబరముగ మందాక్రాంతవృత్తమువలె నడచివచ్చిన విజయాంబికనుజూచి శ్యామలాంబయు, ధరించిన యాభరణముల సౌవర్ణకాంతులు సహజ సౌజన్యరూపమునకు మెరుగులు దిద్దుచుండ శాంతగంభీరముగ నిటునటు నడయాడుచున్న శ్యామలాంబనుగాంచి విజయాంబికయు పరస్పర సౌందర్యాకర్షితులైరి.

బాచయ్యతండ్రి గంగారెడ్డి, తనతండ్రి బేతిరెడ్డి యాప్తమిత్రులనియు,తనకు వరదారెడ్డితో వివాహమై రాజమహేంద్రవరమునకువచ్చిననాటినుండియు తాను గంగారెడ్డిగారినిచూచుటవలయు ననుకొనుచుంటిననియు, నొకటి రెండురోజులక్రితమే తనభర్తకును బాచయ్యకును స్నేహమని తనకు తెలిసినదనియు, గంగారెడ్డిగారు గృహమునందేయున్న [illegible] కలసి తానా సాయంకాలము వారినిదర్శింపదలచితిననియు శ్యామలాంబ చెప్పెను.

ఈమెయా బేతిరెడ్డికొమార్తె! బాచయ్యకు భార్య కావలసిన యీమె, వరదారెడ్డి యిల్లాలెనదా! ఇపుడు తాను బేతిరెడ్డికుమార్తెవలె నటించుచున్నదే! ఇంత సమీపమున బేతిరెడ్డికుమార్తె యున్నదని తెలిసినచో కొన్ని క్షణములక్రిందట బాచయ్యయొద్ద తానట్లు నటించి యుండెడిది కాదు. వరదారెడ్డి భార్యయే బేతిరెడ్డికుమార్తెయని, యుద్ధమునుండివచ్చిన తర్వాతనైనను బాచయ్యకు తెలియకపోవునా? అపుడుతనపరిస్థితియేమగును? అందువలన నిక యేమాత్రమును బాగుసేయుక

తాను కుమారగిరి యంగుళీయమును తిరిగి ద్వారపాలకులకు చూపించి యంతఃపురములోనికిపోవలెను. అనంతరము తాను తిరిగి విజయుని యవతారమును ధరించుటయో, విజయాంబిక రూపమున నుండిపోయి బాచయ్య కనుల బడకుండ తప్పించు కొని తిరుగుటయో చేయవలెను.

ఈవిధముగ నిర్ణయించుకొని విజయాంబిక నిరుక్కన తిరిగి పోనుంకించెను. అనంతరము శ్యామలాంబ ప్రశ్న పై ప్రశ్న వేయుచు విజయాంబిక కూపిరి సలుపనీయలేదు. సమాధానము లీయకుండ నెంత ప్రయత్నించినను, గంగారెడ్డిగారు మరణించినారనిన వార్తయు, తాను బాచయ్యను ప్రేమించుచున్న వ్యక్తిననియు చెప్పక తప్పలేదు విజయాంబికకు.

"బాచయ్య బ్రహ్మచారి. అతడు వివాహమునకు విముఖుడని మావారు తెలుపుదురే! "యని యాశ్చర్యముగ బ్రశ్నించుటకు ముందు, శ్యామలాంబ గంగారెడ్డిగారు కాలముచేసినారని విని విచారించినది.

"బాచయ్య యిప్పటికిని వివాహమునకు విముఖుడే యనియు, తన ప్రయత్నము ఫలించి బాచయ్యను వివాహము చేసికొనువరకు తన సంగతి గుప్తముగ నుంచవలసిన దనియు, వరదారెడ్డియొద్దగాని బాచయ్యసమక్షమునగాని తన ప్రస్తావన తేవలద"నియు విజయాంబిక శ్యామలాంబను వేడుకొనెను.

శ్యామలాంబయు శ్లేయని యంగీకరించినది. శ్యామలాంబ కోరిక ప్రకారము తరచువచ్చిముచ్చటించుట కంగీకరించి,ఆమె

యిచ్చిన కుంకుమ ఫలపుష్పములను స్వీకరించి విజయాంబిక తనబసను నంతఃపురమునకు బయలుదేరినది.

అప్పటికి వర్షమారంభమయ్యెను. చీకటి పడుచుండెను. జల్లులతో వచ్చినవాన కుంభవృష్టిగ కురిసినది. రాత్రి రెండు జాములవరకును బాపయ్యగారి మొగసాలలో తలదాచుకొని, వాన తగ్గినతర్వాత విజయాంబిక యంతఃపురమునకు తిరిగి బయలుదేరినది. అంతఃపురద్వారమును సమీపించుచుండ పెద్ద పిడుగు పడినట్లు చప్పుడై మరల నంతటను నిశ్శబ్దమావరించెను. ఇంతలో నాపాదమస్తకము నాచ్ఛాదనమొనర్చుకొనిన యొక వ్యక్తి తొట్రుపడుచు నంతఃపురమునుండి ఈవల కరుదెంచెను. ఆవ్యక్తి నిజాచి యనుమానించి విజయాంబిక యతని ననుసరించి గోదావరివైపు బయలుదేరినది. చుట్టును చిమ్మచీకటి. ముందు ముసుగుమనిషి, వెనుక విజయాంబిక.

౧౦

మేలుజామున స్నానార్థమై గోదావరికి వెడలిన రాణి వాసపుస్త్రీలకు నీటియంచున స్పృహతప్పిపడియున్న విజయాంబిక కనిపించెను. హరిహరాంబ యామె నంతఃపురమునకు తీసికొనివచ్చు నేర్పాట్లుగావించి, తలపై కన్పించినగాయమునకు చికిత్స కేయించెను. మరునాడు హరిహరాంబయడిగినప్రశ్నలకు సమాధానముగ తనయూరు కొండగుదురనియు, తనపేరు విజ

యాంబిక యనియు, ఆస్త్రీయు లెవ్వరును లేరనియు, కొందరు స్త్రీలు తనను మోసము జేసి తనయొద్దనున్న యాభరణము లు తీసికొనితలపైబలముగకొట్టి యచట బడవైచినారని యు నొకకథ యల్లి విజయాంబిక చెప్పెను. చెప్పి, తన బ్రిదుకంతయు నిట్టి యసత్యపు కథలతోనే సరిపోవుచున్నదని మనస్సులో కుమిలి పోయినది. ఆమె గాథవిని జాలిపడి హరిహరాంబ యామెను తన యంతఃపురమున నుంచుకొనుటకు నిశ్చయించినది.

జాముస్నర ప్రొద్దెక్కినది.

ఒక్కమారుగ నగరము నగరమంతయు నొక ఘోర దుర్వార్తతో ఘూర్ణిల్లినది.

గతరాత్రి విప్రప్రయోగ మొనర్చి యెవరో కుమారగిరి ప్రభువును హత్యగావించిరి. ప్రభువుగారి యంగరక్షకులలో నొకడగు విజయుడు కన్పించుట లేదు. ప్రభువుచేతి యంగుళీ యము నదృశ్యమైనది.

పిడుగువంటి యావార్తను ప్రధానియైన యరియేటిలింగ నకు మొదట తెలియబరచి, యంతఃపురాధికారి తగు చర్యలను తీసికొనెను. అంతఃపురములోనివా రెచ్చటికినికదలకుండ శాసిం చెను. బయటివారు లోనికిగాని లోనివారు బయటకుగాని పోకుండ కట్టుదిట్టము చేసెను. కుమారగిరి యంగరక్షకసభ్యు లను, ద్వారపాలకులను బందీల నొనర్చెను.

కుమారగిరి మరణవార్తను విని ప్రధాని క్రుంగిపోయెను. వెంటనే అంపకోటకు వెడలిన యల్లాడకు అంచెలమీదకబురు జేసెను. సైన్యాధ్యక్షుడైన నరహరినిరావించెను. ప్రధానియు

నరహరియు నాలోచించి సైన్యమునంతటిని నగరుచుట్టును కాపుంచి, ఎవరైనను నగరునుండి పారిపోవ ప్రయత్నించినచో వధించియైనను, ప్రాణములతో బంధించియైనను, తీసికొనిరావలెనని యుత్తరువు లిచ్చిరి. అనంతరము వారిరువురు నంతఃపురమునకు వెడలి యంతఃపురాధికారి తీసికొనిన చర్యలను బరిశీలించిరి.

కుమారగిరి మరణవార్త దొడ్డాంబికకు, నసితల్లికి, హరిహరాంబకు నశనిపాతమువలె తగిలినది. రాకుమార్తెలిరువురును తమ సోదరుని యకాలమృతికి బిట్టు విలపింపసాగిరి. మొదలు నఱకిన యరటిచెట్టువలె కూలిపోయిన దొడ్డాంబికకు స్పృహయే లేదు.

వేగిరావుల కబురందుకొని యల్లాడ రాజమహేంద్రవరమునకు హుటాహుటి బయలుదేరెను. నగరుజేరిన యల్లాడ ప్రళయరుద్రునివలె కన్పించెను. అత డెవరితోడను మాటాడుటలేదు. ప్రధానియు, నరహరియు, నంతఃపురాధికారియు జేసిన యేర్పాట్లను బరిశీలించి సూటిగా కుమారగిరి శవమును జూచుటకు వెడలెను. పసివాని మృతదేహమును చూచుటతోడనే యతనికి దుఃఖ మాగలేదు. అంతవరకు నణచిపెట్టుకొనిన విచారము కట్టలు త్రెంచుకొనెను. బిట్టుగ విలపించి యాతడచేతనుడై యుండిపోయెను.

అనంతరము కళ దరుగని కుమారగిరి ముఖముచూచి, యాశతో పరహితాచార్యులనురప్పించి "ప్రాణమింకను ఉన్నట్లున్నది.చూడు"డని యల్లాడయనెను.ఆరాజవైద్యుడు పెదవివిరిచి," మాయనురాగమట్లనిపించుచున్నది. అంతియే"యనెను.

అల్లాడ శూన్యముగ జూచెను. మేరునగధీరుడైన యల్లాడట్లు బేలతనము వహింపుటను జూడలేక పరహితాచార్యులు కనుల నీరుపెట్టుకొనెను.

పిదప నల్లాడ దొడ్డాంబికను పరామర్శింప నేగెను. కాని యామె శోకమునుజూచి, యేమి చెప్పుటకు దోచక మౌనముగ కనుల నీరునింపుచు నుండిపోయెను. దొడ్డాంబికయు "మీరేమిచేయగలరు? నాయదృష్ట మిట్లున్న"దని విలపించి విలపించి స్పృహ గోల్పోయెను.

అన్ని యేర్పాట్లను తానే జూచుకొనెను. కాని రాజ సౌధరక్షణ, అంగరక్షకనియామకము నను నీరెండు బాధ్యతలను కుమారుడైన వీరభద్రారెడ్డి కప్పగించెను. అతడు వేయి కనులతో జూచిగొనియుండడా? మరి యిట్లయిన దేమి? తాను రాజధానిని వదలి అంపకోటకు వెడలక యుండిన నీ ఘోర విపత్తు జరిగెడి కాదేమో!

ఏ రాజు నిమిత్తము తన యసాధారణప్రజ్ఞానైపుణ్యము ప్రదర్శించి నరహరిని బంపి సామంతుల నోడించి రాజమహేంద్రవర పూర్వవైభవమును పునఃస్థాపించెనో, ఏ బాలునికొఱకు కాటయవేమునికి మాటయిచ్చి యీ రాజ్యభారము నీ వయస్సున తలపై నిడుకొనెనో, ఏ ప్రభువు భవిష్యత్తుకై యీ సామ్రాజ్యమును బలమైన పునాదులపై పునర్నిర్మించుచుండెనో, ఆరాజు, ఆబాలుడు, ఆప్రభు విక లేడు!

అల్లాడకు లోకమంతయు నంధకారమయ మయ్యెను. రాత్రి యొక్కనూరు కన్నుమూయలేదు. దావానికుని బంపి

నరహరికి కబురుజేసెను. వేత్రహస్తుని బిలిచి తన యాంతరం
గికుడైన వృద్ధప్రణిధిని తీసికొని రమ్మని పంపెను. ఆప్రణిధి తన
యనుమానమును ధ్రువపరచినచో నింకేమి? పెదకోమటివేమ
చావు మూడినట్లే! అల్లాడ పండ్లు పటపట కొరికెను. "కుమార
గిరి పసివాడు. వానిని మీచేత నుంచుచున్నా" నను కాటయ
వేముని పలుకులు వినిపించినట్లయి, యత డులికిపడి యిటునటు
జూచెను. అల్లాడ మన స్సంతయు తీవ్రమైన వేదనతో వికల
మైపోయెను.

రాజులేని రాజ్య మరాజక మగునని దెలిసి, దొడ్డాంబిక
నుండి సమాధానము నతిప్రయాసతో బడసి, 'భావిరాజ
మహేంద్రవరసామ్రాజ్ఞిగ ననితల్లిని అల్లాడ ప్రకటించెను.
కుమారగిరి మరణముతో ఘూర్ణిల్లిన ధరా సామ్రాజ్య
మంతయు నెమ్మది నెమ్మదిగ స్తిమితము కాసాగెను.

ఒకరోజున బాచయ్యయు వరదారెడ్డియు విజయుని
గురించి వాదించుకొనిరి. "విజయుడు నిర్దోషి. పరిస్థితులనుబట్టి
యతడు దోషిగ తోపవచ్చును. దోషిదొరికినపిదప విజయుని
నిర్దోషిత్వము తెలియగలదు." ఇది బాచయ్య వాదము.
"కుమారగిరికి విషప్రయోగము జరుగుట, విజయు డంతర్హితు
డగుట, ఇప్పటికేని వచ్చి తన నిర్దోషిత్వము నిరూపించుకొన
కుండుట. ఈకారణములవలన తప్పక విజయుడే దోషి." ఇది
వరదారెడ్డి వాదము. మొదటి నుండియు వరదారెడ్డి విజయు
ననుమానించుచునేయుండెను. అనంతరము వరదారెడ్డినవ్వుచు,
"నీవు వివాహము చేసికొనుటకు నిశ్చయించితివట! వధువు
కూడ సిద్ధముగ నున్నదట!" యనెను.

బాచయ్య "ఈ యసత్యము నెవరు చెప్పిరి ?" యని యడిగెను.

"అసత్యమా ?... మరి యిట్లని వధువే చెప్పినదే నా భార్యకు."

"వధువా ! ... ఎవ రామె ?" బాచయ్య కోపముతో గద్దించెను.

"విజయాంబిక"

"వి...జ...యాం...బి...క..." వెంటనే బాచయ్యకు జ్ఞప్తికి వచ్చినది. "ఆమెయా ?... తండ్రిగారి స్నేహితుని కొమార్తె గదా యని యాశ్రయమిచ్చి, తాను అంవకోట యుద్ధమునుండి తిరిగి వచ్చువరకు నింట నుంచుమన, నుండుట మానివైచి మీదుమిక్కిలి ఇట్టి ప్రచారము చేయుచున్నదా?" ఇట్లాలోచించుకొని బాచయ్య లోలోపలనే విజయాంబికపై నసహ్యమును, కోపమును బెంచుకొనెను. అతని ముఖకవళికలు గమనించి బాచయ్యకు విజయాంబిక యన్నచో నిష్టము లేదని వరదారెడ్డి గ్రహించెను.

ఆ సమయమున వారికి వేమారెడ్డి గృహమునుండి బయటకు వచ్చుచున్న విజయాంబిక కనిపించెను. "విజయాంబికా ! ఆగు!" మని గర్జించి బాచయ్య యామెను సమీపింపబోయెను. వరదారెడ్డి యతనిని వారించి "యిప్పు డామె హరిహరాంబకు ముఖ్యమైన చెలికత్తె. ఆమెపై నేదైన నత్యాచారముచేసినచో నది యంతఃపుర నేరముగ బరిగణింపబడు" ననెను. అందువలన బాచయ్య యాగిపోయెను. కానిచో నామె వెంటబడి సిగపట్టు

కొని యీడ్చుకొనివచ్చి యామె జేయుచున్న ప్రచారమును గురించి గద్దించి యడిగి యుండెడివాడే!

అనంతరము వా రిరువురు "వేమారెడ్డి గృహమునకు హరిహరాంబ చెలికత్తె యేల రావలసివచ్చినది?" యని వితర్కించుకొనిరి. తుదకు వేమారెడ్డి హరిహరాంబల ప్రేమగాథ రసవద్ఘట్టము చేరుకొని యుండునని నిర్ణయించి తమలోతాము సంతృప్తిగ నవ్వుకొని తల లూచిరి.

మరునా డంతయు వరదారెడ్డికి విజయాంబికను గురించియే యాలోచనలు. ఈవిజయాంబిక మనస్తత్వ మతి చిత్రముగ నున్నది. తనను ద్వేషించువ్యక్తి తనకు కాబోవు భర్త యని ప్రచారము చేయుటేమి? కావలసినచో తనకు బాచయ్య వంటి భర్త లభింపడా? అంత యందమైన స్త్రీ నంగీకరింపవలెనేగాని యామెను వివాహ మాడుట కెవ డంగీకరింపడు?

ఈ యాలోచనతో వరదారెడ్డికి తా నిప్ప డవివాహితుడుగా నున్నచో నెంత బాగుండెడిది అనిపించినది. శ్యామలాంబయు,గుణవతియు,సౌందర్యవతియే కాని విజయాంబికలో నున్న యాకర్షణ ఆమెలో లేదు. శ్యామలాంబ వర్షాశుభ్రస్నాత పారిజాత కుసుమము. విజయాంబిక కోరికలు రెచ్చగొట్టి మనస్సునకు మత్తెక్కించు అడవిమల్లె.

ఆమెతో నెట్లయిన పరిచయము సంపాదించి యామె యనురాగమును బొందవలెనని వరదారెడ్డి కాంక్షించెను. హరిహరాంబకడ ననుమతిగొని యామె యెప్పుడైన నంతఃపురమువీడి నగరులోనికి వచ్చినచో వరదారెడ్డి ఆ యవకాశమును వదలుట

లేదు. రోజురోజునకు నామెతో పరిచయమును వృద్ధిచేసికొను
చుండెను. ఆమెకూడ నతని స్నేహమును కాంక్షించెను. అందుల
కామెకుగల కారణము వేరు. బాచయ్య యోగక్షేమములు,
సమాచారములు తరచు తనకు తెలియవలెను. కాని ఆరోజు
తాను వేమారెడ్డి గృహమునుండి వచ్చుచుండ నతడు వేసిన
కేక తన హృదయమును పర్జన్యగర్జనవలె తాకి భయము కలి
గించెను. అందువలన నతనిని సమీపించుటకు వెరపు. ఇప్పట్టున
నతని మిత్రుడైన వరదారెడ్డితో పరిచయము వృద్ధియైనచో
బాచయ్య కబురులు తనకు తరచు తెలియుట కవకాశముకలు
గును. ఇది విజయాంబిక యోచన. ఇట్లిరువురు వేరువేరు
ప్రయోజనములకై ఒకరి స్నేహమును మరియొకరు కాంక్షిం
చిరి.

ఆసక్తియున్నచో నవకాశమున కేమికొదువ ? వణిగ్వీ
థులు, ఉద్యానవనములు, గౌతమీసైకతములు వారికి పరిచయ
ప్రదేశము లయ్యెను. విజయాంబికతో స్నేహము చేసినకొలది
వరదారెడ్డి శ్యామలాంబతో మనసిచ్చిమాటాడుట లేదు. అతని
యుదాసీనతకు శ్యామలాంబ యాందోళన చెందుచుండెను. ఈ
మధ్య మీ రెందులకిట్లు విపరీతముగ బ్రవర్తించుచుండినారని
భర్తను నిలదీసి యడుగుటకామెకు ధైర్యము లేదు. ఇంతవరకే
తన యదృష్టమని సరిపెట్టుకొని లోలోన నామె బాధపడు
చుండెను.

వరదారెడ్డి విజయాంబికల స్నేహము వృద్ధికాజొచ్చెను.
విజయాంబికపై తమక మధికమైనకొలది వరదారెడ్డికి బాచయ్య
ప్రత్యర్థివలె కనిపింపసాగెను. అతనిని, యతని వైరాగ్యచింత

నను, వార్ధక భావములను విజయాంబికతో మాటాడినప్పుడెల్ల అవహేళన మొనర్చుచుండెను. ఆ విధమైన సంభాషణ తనకు రుచింపకపోయినను, విజయాంబిక వరదారెడ్డి యభిప్రాయము లతో నేకీభవించుచున్నట్లు నటించెను.

బాచయ్య నవహేళన మొనర్చుటతో నాగలేదు. తన ప్రజ్ఞాప్రాభవములను తెలిపి యామెను మరింత యాకర్షింపవలె నని వరదారెడ్డి తలచెను. అందువలననే యొకరోజున తన ప్రణిధి నైపుణ్యమును గురించి ముచ్చటించుచు విజయాంబికతో "నా ప్రణిధినైపుణ్య మెట్టిదన, అన్న యామాత్యులు శ్రీనాథులకు వ్రాసియిచ్చిన జాబును గూఢచారినై కొండవీటికి తీసికొని వెడలినపుడు, పెదకోమటివేమ గౌరవసన్మానములను గూడ పొందితి" నని తెలిపెను.

విజయాంబిక యదరిపడెను.

"అంతియేకాదు. ఎవరో యిరువురు కొండవీటిరాజో ద్యోగులు పావము రాజమహేంద్రవరమందున్న తమ బంధువులను రహస్యముగ జూడవలెనట. అందుల కేర్పాట్లొనర్చి, వారికి కావలసిన సౌకర్యముల నతి గుప్తముగ నొనర్పుడని పెదకోమటి వేమప్రభువు నాకు రెండువేల దీనారముల నిచ్చి నా చేతులు పట్టుకొని బ్రతిమాలెను."

"మీ రంగీకరించినారా ?"

"అంతటి ప్రభువు వేడినపుడు కాదని యెట్లందును? ఆ యిరువురు రాజోద్యోగులలో నొకడు గౌతమికి యవ్వలనే యుండిపోయెను. రెండవవ్యక్తి నాతో రాజమహేంద్రవరమునకు

రహస్యముగ వచ్చెను అతనికి నే నన్నచో నెంత గౌరవమని! కనిపించినపుడెల్ల కనకఖండములు కలకండలు నందించును. ఆ మధ్య నెలదినము లతడు కనిపింపలేదు. కొండవీటికి వెడలిపోయె ననుకొంటిని. కాని తర్వాత కనిపించి పిక్కపై గాయము తగులుటవలన కనిపింపజాలకపోయితి ననెను. మరల నీమధ్య కనిపించుటలేదు."

ఆ మాటలు విన్నతోడనే విజయాంబికకు ఛట్టునస్ఫురణకు వచ్చెను. కుమారగిరి హత్యజరిగిన రాత్రి తా నంతఃపురమును జేరుచుండ నంతఃపుర ద్వారమునుండి ముసుగుమానిసి బయటకు వెడలుచుండెను. అనుమానముతో తా నతనిని వెంబడించెను. తళుక్కుమనిన మెరపుకాంతిలో నతని పిక్కపై నల్లని గాయము మచ్చ స్పష్టముగ కానబడినది వాడును, తిరముకడ వానికై వేచియున్న మరియొకడును, తాను వెంబడించుచున్న సంగతి గ్రహించి తీవ్రప్రహరణములతో తనకు స్పృహతప్పునట్లుచేసి పారిపోయిరి. దీనినిబట్టి చూడ వా రిరువురును కొండవీటి గూఢచారులనియు, వారే కుమారగిరి మరణమునకు కారణమనియు, వారిని రాజోద్యోగులని వరదారెడ్డిని నమ్మించి పంపించుటలోనే పెదకోమటి వేముని ప్రజ్ఞ ద్యోతక మగుచున్నదనియు, బంధువులను చూచుటకు వచ్చిన రాజోద్యోగులుగ వారిని నమ్ముటలో వరదారెడ్డి యవివేకము ప్రస్ఫుటమగుచున్నదనియు విజయాంబిక కర్థమైనది.

"మీతో నిట్లిరువురు రాజోద్యోగులను కొండవీటినుండి తీసికొని వచ్చిన దెవరితోనైనను మీరు చెప్పినారా?" యని విజయాంబిక వరదారెడ్డిని ప్రశ్నించెను.

వరదారెడ్డి, "లేదు. ఇందితరులకు జెప్పవలసినంత ప్రాముఖ్య మేమున్నది?" యనెను. విజయాంబిక యతనిమంద బుద్ధి కాశ్చర్యము చెందెను.

పిదప విజయాంబిక రాజసౌధమునకు వెడలిపోయెను. ఆరాత్రి నిద్దురలో వరదారెడ్డి "విజయాంబికా!" యని కలవరించెను. సమీపమున నిద్రించిన శ్యామలాంబ యా కలవరింత విని కలతజెంది, ఈమధ్య భర్త ప్రవర్తనలో వచ్చినమార్పున కిదియా కారణమని యనుకొనెను. విజయాంబిక బాచయ్య ప్రేమికురాలే! మిత్రుని ప్రేయసిని ప్రేమించెడి వ్యక్తియా తన భర్త! ఛీ యనుకొనెను.

౧౧

ఎంత ప్రయత్నించినను, భర్త విపరీత ప్రవర్తనను శ్యామలాంబ సరిపెట్టుకొనలేకపోయెను. జీవితాంత మన్యోన్యానురాగముతో కలిసిమెలిసి యుండవలసిన భార్యాభర్త లిట్లు తాత్కాలిక వ్యామోహములకు లోనై దాంపత్యజీవితమును కళంకమొనర్పదగునా? పురుషుడు కావున తనభర్త చపలస్వభావుడు మరి యా విజయాంబిక కిట్టి ప్రవర్తన తగునా? తాను బాచయ్య ప్రేయసి నన్నట్లును, త్వరలో తమకు వివాహము కానున్నట్లును జెప్పినదే! అట్టి యువతి కిట్టి చర్యలేమి? ఆమెనే ప్రశ్నింతును. సమాధాన మేమి యిచ్చునో! ఆమధ్య పరిచారికను బంపినపుడు బాచయ్య యింటియొద్దనే కదా యామెయున్నది!

ఇవుడు నచటనే యుండి యుండునని తలచి పరిచారికను బిలిచి బాచయ్య యింటి గుర్తులను తెలిసికొనెను.

స్నానాదికములు పూర్తి చేసికొని శ్యామలాంబ భర్నెని పెట్టె తెరచి ధౌతవస్త్రము ధరించెను. సకినాలమంచముపై గూర్చుండి, యాభరణములేమియు ధరింపక, నుదుట, కుంకుమ మాత్ర మలంకరించుకొనెను. గృహకృత్యములు పూర్తి చేసి కొని పరిచారికకు తత్తదుచితాదేశముల నిచ్చినది. పురోహితులు వచ్చి గడపపై తులసి నుంచి వారము, వర్జ్యము తెలుప, ఫలములు బియ్యము నాయనకు సమృద్ధిగ నిచ్చి పంపినది. అనంతర మవగుంఠనము సరిచేసికొని బాచయ్య యింటివైపు పాద చారిణిగా బయలుదేరినది.

ఆమె యిల్లువదలుటకు మున్నే వరదారెడ్డి యింటినుండి బయలుదేరెను. అతని కేమియు దోచుట లేదు. చేతి నిండుగ పనియు లేదు. ఎందువలననో యల్లాడ యీ నడుమ తనను బిలువనంపుట లేదు. ప్రణిధు లందరికి నన్నిపనులు నున్నవి. తనకుమాత్ర మేపనియు లేదు.

అల్లాడ తన నేలదూరముగ నుంచుచున్నారు! కాదు పెదకోమటివేమయొద్ద కానుకలు స్వీకరించిన సంగతి తెలిసినదా యేమి? పెదకోమటివేమ పంపిన వ్యక్తుల కొకటి రెండు చిన్న చిన్న సాయములు తక్క తానేమియు తప్పుచేయలేదు! చేతిలో పుష్కలముగ ధనముండినగాని మహాకూర్పాసము, అత్తరువు, సంపంగినూనె, దంతపుపావలతో కూడిన తన విలాస మయ జీవితము సాగదు. కావున నయాచితముగ లభించిన ధనమును తాను స్వీకరించెను, ఇందు తప్పేమి! అయిన నీ

సంగతి యెవరికిని తెలియదు విజయాంబికకు మాత్రము తా
నా నాడు తమకము నాపుకొనలేక చెప్పెను. ఆమెయీసంగతి
యల్లాడ కందించెనా ?

ఏమో ! ఏమైనను అల్లాడ చారచక్షువు. అతని కీ
సంగతి తెలియును. ఆ సంగతి తెలియదు అని లేదు. ఆయనకు
లోకమంతయు కళ్ళే ! ఎంతటి శక్తిసామర్థ్యములు, మేధాసం
పద, మంత్రాంగ చాతుర్యము, రాజనీతిజ్ఞత లేనిచో, కాటయ
వేమ ప్రభువు మరణించినను, అనంతరము కుమారగిరి మరణిం
చినను, స్త్రీయైన యనితల్లిని సింహాసనమున నుంచి పరిపాలన
సమర్థతతో నిర్వహించుచున్నారు !

సైన్యసమీకరణము, ఆదాయవ్యయపరిశీలనము, కోశ-
ఆయుధాగార పరిరక్షణ, శత్రుమిత్ర పరీక్షలయందే కాదు
వ్యూహరచన, మిత్రభేద మిత్రలాభాది రాజనీతిజ్ఞతయందును
ఆయన కాయనయే సాటి. దేశప్రజల కాయన యన్న నెంత
భక్తియో యంత భయము.

శత్రువులకు సకేసరి- సింహస్వప్నమే !

ప్రతివ్యక్తియు తన నీడను తానుజూచుకొని యల్లాడ
యని భయపడును. ఆయనపేరు చెప్పినచో గుట్టములు నీరు
త్రాగవు.

అంతటి ప్రజ్ఞాధురీణునికి తాను జేసిన యీ చిన్న తప్పి
దము తెలియకుండ నెట్లుండును ? విలాసజీవితము ధనలోభము
నకు, ధనలోభ మీ చిన్న తప్పిదమునకు దారితీసినది. ఇంత

మాత్రమున తనకు దేశభక్తి లేదా? ప్రభుభక్తి యుండదా? ఏమైనను తాను కూడ ప్రభుభక్తి గల యుత్తమ ప్రణిధినని నిరూపించుకొనవలెను. అందులకు కుమారగిరిహత్యారహస్యమును ఛేదించుట యొక్కటియే మార్గము. విజయుని బంధించి యతనియొద్దనుండి యీ రహస్యమును కనుగొనవచ్చును. కాని చిత్రముగ విజయు డంతర్ధాన మయ్యెను. కాని యతడు బాచయ్య కాప్తమిత్రుడుగదా! అత డేమయ్యెనో బాచయ్యకు తెలియదా? అసలు బాచయ్యయే విజయుని తన యింటదాచి రక్షించుచుండెనేమో! ఏమో! స్నేహమెట్టి సాహసమునైన జేయించును.

ఇట్లు నిశ్చయించుకొని, బాచయ్య యింటిపైపే వరదారెడ్డియు బయలుదేరెను. చెరియొక దిశనుండి వచ్చిన శ్యామలాంబయు వరదారెడ్డియు బాచయ్య ద్వారముకడ తారసిల్లి యొకరిని జూచి యొకరు నివ్వెఱబోయిరి.

ఇరువురి కనులలోను జీవము లేదు.

ఇరువురినోటను మాట లేదు.

ఇరువురి మనసులలోను ఆలోచన లేదు.

ఇరువురి శరీరములందును చైతన్యము లేదు.

చేష్ట లుడిగిన ప్రాణులవలె, ప్రాణము లేని జీవులవలె, జీవము లేని స్థాణువులవలె, హృదయచలన మాగి, ఊపిరి స్తంభించి ఒకరినొకరు చూచుకొనుచు నమోహమయస్థితిలో నొక్క క్షణ ముండిరి.

ఇత డేల యిచటికి వచ్చెనో! విజయాంబికనిమిత్తమా? ఈమె యేల వచ్చినది? బాచయ్య గంగారెడ్డిగార్ల

ప్రస్తావన వచ్చినపుడు రెండుమూడు పర్యాయములు శ్యామ లాంబ నిస్తేజయై తత్తరపడినది. ఎన్నిమార్లు కారణమడిగినను చెప్పలేదు. బాచయ్యకు యీమెకు తెలియునన్నమాట. పరిచయ మున్నట్లు మరి యెప్పుడును చెప్పలేదేమి? చెప్పుటకు వీలులేని పరిచయమా!

ఆమెలో నుత్తాల తాలమైన జుగుప్స.

అతనిలో నుద్వేగపూరితమైన యాగ్రహము.

అన్యస్త్రీ నాశించి పరులయిండ్లకు పరుగులుతీయు భర్త కొఱకా తన బ్రతుకు! చీదరించుకొనినది శ్యామలాంబ.

భర్త కన్నుగప్పి పరపురుషుని గృహమున కేతెంచు నదియా తన భార్య! వెఱ్ఱి యావేశముతో నూగిపోయెను వరదారెడ్డి. ఆమెను తెగనఱకవలెనని యొరలోని ఖడ్గము తీసెను.

కాని శ్యామలాంబ యప్పటికే వికలమైన మనస్సుతో మహాప్రభంజనమువలె చంపుదుగుడివైపు దూసికొని పోయినది.

మొదట వరదారెడ్డి యామె ననుసరించెను.

కాని మార్గమధ్యమున విజయాంబిక కనిపించుటతో నా ప్రయత్నము విరమించి ఖడ్గము నొరలో పెట్టి యామెతో ముచ్చటింపబోయెను.

"కత్తి దూసి రాజవీధులందు పరుగిడుచున్నారేమి?" యని విజయాంబిక యతనిని పరిహాసపూర్వకముగ పలుక రించెను. "సంగతి యిది" యని చెప్పుట కతని కభిమానము ..డ్డువచ్చెను.

"నేనొక ముఖ్యవార్తను వేమారెడ్డి కందించవలె" ననుచు విజయాంబిక వడివడిగ వెడలిపోయెను. ఆమె నడక లోని యందమునల్లే చూచిచూచి కొంత సేపటికి శ్యామలాంబ జ్ఞప్తికి వచ్చుటచే నామె వెడలిన దిక్కు వరదారెడ్డి పరుగు దీసెను. కాని యతడు చంపుడుగుడిని చేరుసరికి చాలయాలస్య మైనది. అచట వరదారెడ్డికి శ్యామలాంబ కనిపించలేదు.

౧౨

అల్లాడ శాసన మతిభయంకరము. అవక్రము, కఠినాతికఠినము నైన యాశాసనము సర్వులకు సమానమే. అధికులు,అల్పులు, ఆత్మీయులు, అపరిచితులు; సైన్యాధ్యక్షుడు,సామాన్యపౌరుడు నను తరతమభేదము లాశాసనముముందు పనికిరావు. ఇపు డా శాసనము ఆయన రెండవ కుమారుడును, సామ్రాజ్ఞియైన అనితల్లి భర్తయు, శాస్త్రపారంగతుడును, రసానందైకలోలు డును, సరససాహితీవేత్తయు, వినీతమూర్తియునైన వీరభద్రా రెడ్డిపై ప్రవర్తిల్ల నున్నది.

కుమారగిరి రక్షణ, అంగరక్షకదళ నియామకము నను రెండుబాధ్యతల నతడు ప్రమత్తతతో నిర్వహించెననియు, కుమారగిరి హత్యతో సంబంధము కలదని యనుమానితుడైన విజయుని యంగరక్షకునిగ నియమించుటలో నతని బాధ్యతా రహితమైన ప్రవర్తన కనిపించుచున్నదనియు, అందుల కతడు

శిక్షార్హుడనియు, పక్షముదినములలో వీరభద్రారెడ్డి తన సమాధానమును సచివసమితికి సమర్పింపజాలనిచో నతడు శిక్షకు సిద్ధము కావలయుననియు నాదేశము.

ఆయాదేశము నిర్దాక్షిణ్యమైనదని నరహరివాదించెను. ఇది ఘోరమని సచివసమితి ఘోషించెను.

రాజ జామాత నవమానించుట తగదని దొడ్డాంబిక కబురుచేసెను.

ఆ యాదేశమునకు సామ్రాజ్ఞిగ తన యంగీకార మొసగనని అనితల్లి చెప్పెను.

ఎవరేమియభ్యంతరము చెప్పినను, ఆ యాదేశ మమలు జరుగక తప్పదనియు, రాజనీతి బహుక్రూరమైనదనియు, దానికి తనవాడు పైవాడు ననుభేదముండదనియు, సచివసమితి యధ్యక్షుడుగ తనకది యనుల్లంఘనీయమనియు అల్లాడ స్పష్టముగా జెప్పెను.

ఆ యాదేశ మందరికంటె బెండపూడి యన్నయామాత్యుల కెక్కువ క్లేశముకలిగించెను. వీరభద్రారెడ్డి యతని యనుంగు మిత్రము. మీదుమిక్కిలి విజయు నంగరక్షకునిగ నియమించుటలో తన బాధ్యతయు కొంత యున్నది. ఈశాసనము వీరభద్రారెడ్డిపై ప్రవర్తిల్లకుండ నెట్లు చేయుటయా యని యతడు దీర్ఘముగ నాలోచించెను.

ఎంతటి క్లిష్టసమస్యనైనను అన్నయామాత్యు లిట్టే పరిష్కరించును. సచివసమితి సభ్యులందరు నతని బుద్ధిసూక్ష్మతను మిక్కిలి శ్లాఘింతురు. మంత్రాంగమం దల్లాడకు, పరిపా

లనయుం దరియేటిలింగనకు, వ్యూహరచనలందు నరహరికి నతడు కుడిభుజము. సచివసమితిసభ్యులలో నందరికంటె వయస్సులో చిన్నవాడైనను బెండపూడి అన్నయ యందరికంటె మిన్న. రాజకీయములందేకాక సాహిత్యప్రపంచమున గూడనతడు సర్వులకు శిరోధార్యుడు. నరసింహాభట్టు వ్రాసిన కాదంబరిలోని దోషములను జూపించినదిట్టు. త్రిపురాంతకుని చంద్రతారావళిని తలతన్ను సూర్యతారావళిని వ్రాసిన కవిశేఖరుడు. కవులలో కవి. పండితులలో పండితుడు. రసికులలో రసికుడు. వేదాంతులలో వేదాంతి. వివేకమునకు సూక్ష్మగ్రహణ పారీణతకు బెండపూడి అన్నయామాత్యులు పెట్టినదిపేరు. అట్టి బుద్ధిశాలియే వాజారమున తొలియామమును సూచించు గంటలు కొట్టినపుడాలోచన ప్రారంభించి మూడవయామమునకు కూడ పరిష్కారమార్గమును కనుగొనజాలకపోయెను.

అన్నయామాత్యు లిట్లు తనయింట వీరభద్రారెడ్డిపై నల్లాడ శాసనము ప్రవర్తిల్లకుండ జేయుట యెట్లాయని యాలోచించుచుండ నల్లాడ యింటిముందొక ముష్టివాడు కోతి నాడించుచు నరచుచుండెను. ఆ యల్లరి కల్లాడ విసిగి మొగసాలలోనికి రాగ నా ముష్టివాడు నెమ్మదిగ "అంగదరాయబారమరఘడియలో" నని గొణుగుచు వెడలిపోయెను.

అనంతరము శివభక్తుడొకడుసంకేతములనుబలికియల్లాడతో మంతనములాడుట కాతని యభ్యంతరమందిరమున కేగెను.

"విశేషములేమి?" యని యల్లాడ ప్రశ్నించెను.

"కుమారగిరికి పాయసమందు విషముగలిపి హత్య జేసినవాడును, మీపై నానాడు బాకు విసిరినవాడు నొకడే! అతని

జాడ యరసి బంధింపవలెనని ప్రయత్నించుచుంటిని. పడుగు పేకలవలె మన గూఢపురుషులచే దట్టముగ నల్లుకొనిన యీ రాజమహేంద్రవరమున వా డిన్నినాళ్ళు పట్టుబడక యుండుటయే యాశ్చర్యము.

ఆ కొండపీటి ప్రణిధికోట మన ప్రణిధి యెవరో బాసటగ నుండవలెను. అందువలననే వాని యాట యింతవరకును సాగినది. ఇక నచటికి పోగలడు లెండు. ఒకవేళ మన పొలిమేరలు దాటినను వాని నచట బంధించు నేర్పాటులన్నియు గావించితిని. మన ప్రణిధులందరు నప్రమత్తులై యున్నా"రని యా వృద్ధ గూఢచారి చెప్పెను.

"మరి విజయుని సంగతి?"

"అతడు నిర్దోషి. కాని పిరికివాడు కాబోలు. అందువలన కనబడకుండ పారిపోయెను."

"అయినచో నాయూహ సరియైనదే! కాని నిజమైన హంతకుడు బంధితుడగువరకు మనము విజయుడే నిందితుడని ప్రకటించుచుండవలెను. అందువలన నిందితుడు స్వేచ్ఛగా సంచరించి మనచేత జిక్కును."

"చిత్తము. మీ యాలోచన బాగున్నది."

"ఇంకను విశేషము లేమి?"

"ముఖ్యమైన సంగతి. పెదకోమటివేమ తనసైన్యమును పటిష్ఠమొనర్చుచున్నాడు. మనపై దాడివెడలనుండెనని వేగు వచ్చినది. తనకు సాహాయ్యముగ సైజాముల్ ముల్కును రావలసినదిగ రాయబారమంపినట్లును తెలిసినది. రాజమహేంద్రవర

రాజ్యమును పూర్తిగ తుడిచిపెట్టి చిలుకసముద్రమువరకు కొండవీటి ప్రభుతనే స్థాపించునట !"

"అటులనా? కానిమ్ము. కాజ్యకారపర్తి యుద్ధమును మరచెను కాబోలు! మీరు రేపు కర్ణాటప్రభువైన రాయలయొద్దకు బయలుదేరుడు. వారికి నేను జాబువ్రాసి మీకిచ్చెదను. ఇపుడు రాయలును, గజపతులును మన మిత్రులైనారను సంగతిని మరచెను కాబోలు పెదకోమటివేమ! మనలను తుడిచిపెట్టునా? వీనిని కాలరాచినగాని కావరము తగ్గదని యల్లాడ భయంకరముగ హుంకరించెను. అతని హుంకరింపునకు ప్రతిధ్వనిగ గజశాలలోని మదకరీంద్రములు దిక్కులల్లాడునట్లు భయంకరముగ ఘీంకరించెను.

౧౩

అల్లాడ ముందుగ నూహించిన ప్రకారము పెదకోమటివేమ సైన్యము, నైజాముల్ముల్కు సైన్యము కలిసి రాజమహేంద్రవరముపై దండయాత్రకు బయలుదేరెను. గోదావరికి నవ్వల పదిగవ్యూతుల దూరమున తురుష్క, రెడ్డిసేనలు శిబిరములు వైచికొని వేచియున్నవని యల్లాడకు వేగు వచ్చెను.

అతడు మరియొక వేగుకై వేచియుండెను. రెండవ వేగు వచ్చునంతలో నల్లాడ సచివసమితిని సమావేశ మొనర్చి, రాజమహేంద్రవరమున కేర్పడిన విపత్కరపరిస్థితిని వివరించి, సేనను సిద్ధము చేయుమని నగరహారికిని, గోదావరిని దాటి సైన్యము

శత్రువులను మార్గమధ్యమునందే యెదుర్కొనుట కనువుగ రెండు వేల పడవలను సిద్ధముచేయుమని యన్నయామాత్యుల నాదేశించెను. అనంతర మల్లాడ వీరభద్రారెడ్డిపై తీసికొనబోవు చర్యగురించి యోచింపుడని సచివసమితిని హెచ్చరించెను.

"ఈ మహాయుద్ధముపై ప్రస్తుతము మనదృష్టిని కేంద్రీకరింపవలెను గదా!... శత్రుసైన్యము లక్షాబదివేలున్నది... ఈ యుద్ధము మన సామ్రాజ్యమునకే పెద్దపరీక్ష. ఇది పూర్తియైన పిదప మనము వీరభద్రారెడ్డి సంగతి యోచింత"మనెను నరహరి. అందరును "నరహరి చెప్పినది సమంజసముగ నున్న" దనిరి. "సరే" యని యల్లాడ యూరకుండెను.

ఆ రాత్రియంతయు నల్లాడకు విశ్రాంతిలేదు. ఇరువురు లేఖకుల కొకేమారు లేఖలను చెప్పసాగెను. రాజోద్యోగులను బిలిపించి వారి కాదేశముల నిచ్చుచుండెను. నగరపాలకుని రావించి యతనితో నేమియో ముచ్చటించెను. కొందరితో సంభాషించెను. కొందరితో మంతనమొనర్చెను. మరికొందరితో మంత్రాంగము నెఱపెను. ఇట్లెన్ని కార్యములందు నిమగ్నుడై యున్నను, రెండవవేగుకై నిరీక్షించుచునే యుండెను.

వేకువజామున వేచియున్న వేగు వచ్చెను. అల్లాడ యభ్యర్థనను మన్నించి విజయనగరప్రభువైన దేవరాయలు తన సైన్యములో కొంతభాగమును కొండవీటిపైకి పంపినాడనియు, ఆసైన్యము కొండవీటి రాజ్యములోని బాపట్ల మండలముపైబడి కొల్లగొట్టుచున్నదనియు నా వేగు సారాంశము.

అల్లాడ ముఖ మానందముతో వెల్లివిరిసెను. మరునాడు మరియొక వేగువచ్చెను. బాపట్లమండలమునకు వచ్చిన యుపద్రవమును విని, గౌతమి కవ్వల విడిసిన పెదకోమటివేమ, తన సైన్యమును దీసికొని బాపట్లకు హుటాహుటి బయలుదేరెనట.

తా నూహించిన ట్లైయైనదని యల్లాడ సంతోషించెను.

రెండురోజులాగి మూడవనాటి రాత్రి వేయిపడవలలో రాజమహేంద్రవరసైన్యము గౌతమిదాటి, ఏమరియున్న నైజాముల్ముల్కు సైన్యముపై బడెను. పెదకోమటివేమ బాపట్ల నుండి తిరిగివచ్చి [illegible]దా రాజమహేంద్రవరముపై దాడి యని నైజాముల్ముల్కు శిబిరములో సుఖముగవిశ్రాంతి దీసికొనుచుండెను. ఉన్నట్టుండివచ్చి మీదపడిన రాజమహేంద్రవరసైన్యమును జూచి తురుష్కసైన్యము కళవళపడెను. ఆ కళవళపాటునుండి తేరుకొనులోపుననే రాజమహేంద్రవర మహాసైన్యము ముసల్మాన్సైన్యమునుచీల్చి చెండాడసాగెను. ఇంకొకజాము యుద్ధమట్లుసాగినచో తన సైనికులలో సగభాగమైన మిగులరని భయపడి నైజాముల్ముల్కు శిబిరములు వదలి సైన్యముతో పారిపోయెను. దక్షిణాపథమున ముసల్మానులను ప్రప్రథమమున నోడించిన గౌరవము రాజమహేంద్రవరమున కావిధముగ లభించెను.

దాదాపు మాసము గడచినది.

బాపట్లలోని పరిస్థితిని చక్కదిద్దుకొని పెదకోమటివేమ రాజమహేంద్రవరముపైపు మిక్కిలివేగముతో వచ్చుచున్నా

డని తెలిసికొని యతనిని మార్గమధ్యముననే యెదిరించుట కల్లాడ నిశ్చయించుకొనెను. రెండువేల పడవలలో రాజమ హేంద్రవర మహాసైన్యము గౌతమినిదాటి హుటాహుటిని ప్రయాణమొనర్చి గోదావరి మండలమందలి (నత్తా) రామేశ్వ రముకడ కొండవీటి సైన్యమును దాకెను.

అపుడు పోటెత్తిన రెండు మహాసముద్రము లొకదాని నొకటి తాకినట్లును, మేరుమందరపర్వతములు పరస్పరము డీకొన్నట్లును కన్పించెను. కొన్ని క్షణములు సంకులసమరము సాగెను. అందు వందలకొలది యోధు లిరుపక్షముల మడిసిరి. ఇది కాదని, మామిడిసింగన రాయపనాయకతిప్పనాయకులను సంప్రదించి పెదకోమటివేమ తన సైన్యము నంతను గారుడ వ్యూహముగ మోహరించెను. అల్లాడయు తన సైన్యమును సమీకరించి బృహదర్ధచంద్రాకృతిగ వ్యూహరచన చేసెను.

భేరీ పటహ సింహనాదాది భయంకర ధ్వనులతో, కొట్టుడు చంపుడు నఱకుడను కేకలతో, నేనుగుల ఘీంకార ములతో, హయహేషలతో, సైనికుల సింహనాదములతో నర్ధచంద్రము వచ్చి గారుడమును దాకెను. శిరములు తెగిన మొండెములతో, వ్రయ్యలైనశిరములతో, బాహువులు తెగిన శరీరములతో నాయుద్ధభూమియంతయు భయంకరముగ మారి పోయెను. కొనయూపిరితో పడియున్న సైనికుల నేనుగులు త్రొక్కివేయ నాలుకలుబయటకు వ్రేలాడి భయంకరరూపము లతో వారు మరణించుచుండిరి. ఇవి కను, లివి చెవు, లిది ముక్కను వివక్షతలేకుండ మొత్తమంతయు నెత్తురు మాంసపు

ముద్దరమై నెత్తుట దోగుచున్న వీరుల ముఖములు బీభత్సముగ నుండెను. ఒక్కొక్క దంతావళము కూలిపోవుచు చేసిన భయంకర ఘీంకారము లురుములవలెను, కరవాలములు రాపిడి వలన జనించిన నిప్పురవ్వలు తటిల్లతలవలెను, వేలసంఖ్యలో వచ్చిపడుచున్న శరపరంపరలు వర్షధారలవలెను తోచి, ఆ సంగ్రామము పెనుతుపాను దలపించెను. ఇట్లింతకాలము యుద్ధమొనర్చినను [illegible] గరుడవ్యూహమం దలి నాసికను [illegible] మొనర్చినగాని పెదకోమటివేమ సైన్యము [illegible] గ్రహించి యల్లాడ, నాసిక నెదిరించు వీరునిశై [illegible] తా నెదిరింతునని ముందునకు రాలేదు.

[illegible] కారణము, నాసికను రక్షించుచున్నది సామాన్యుడు కాదు, సింగనామాత్యుడు. మామిడిసింగన యన నాకలిగొనిన సింహము. బహమనీసుల్తానైన ఫిరోజ్‌షా యంతటివాని మెప్పు పొంది యతని నుండి రవ్వలుపొదిగిన పిడితో మహానిస్త్రింశ మును బహుమతిగ బడసిన పరాక్రమశాలి యతడు. అతని తాకుట యన్నచో కోరి మరణమును తెచ్చికొనుటయే! కావలయునని మృత్యువునోటిలోని కెవడు పోవును ?

తాను పోవుదునని బాచయ్య ముందునకు వచ్చెను.

బాచయ్య సింగనల యుద్ధము చూచి తీరవలయును. ఉష్ణీషఖడ్గకవచాదులతో పారసీక హయముపై బాచయ్య, ఆపాదమస్తకము నుక్కుకవచము ధరించి ఖడ్గ పరశు ధనురా ద్యాయుధములతో బంగరుహౌదా నలంకరించిభద్రగజముపై సింగనామాత్యుడు. జాముసన్నరకాల మొకరికొకరు తీసిపోక

భయంకరముగ యుద్ధమొనర్చిరి. ఇంతలో బాచయ్యపైకి గురి చూచి సింగనామాత్యుడు బాకు విసిరెను. అది తగిలినచో బాచయ్య ప్రాణమును తీసి యుండెడిది. కాని యుద్ధారంభము నుండి బాచయ్య ననుసరించి రక్షించుచు, పురుషవేషములో యుద్ధభూమియందు సంచరించుచున్న విజయాంబిక తన డాలు అడ్డుపెట్టెను. బాకు డాలునకుతగిలి క్రింద పడిపోయెను. తనను రక్షించిన దెవరా యని బాచయ్య చూచి "విజయుడా!" యని యాశ్చర్యపడెను. కాని యింతలో సింగనామాత్యుని తాకిడి యెక్కువై యటు తిరిగెను.

అంతటి మహాయుద్ధమందును, బాచయ్యను విజయుడు రక్షించిన సంగతిని ఒక వృద్ధవీరుడు జూచెను.

బాచయ్య విజృంభించి బాణవర్షమును లెక్కింపక తన గుఱ్ఱమును సింగనామాత్యుని యేనుగుదరికి పురుగెత్తించి తన నిశితఖడ్గముతో దాని తొండము నొక్క వేటున దెగగొట్టెను. అది హాహాకారములు చేయుచు సింగనామాత్యుని క్రిందపడ వైచెను. అతడు స్పృహ గోల్పోయెను. అదేసమయమున నరహరి రాయప నాయకుని శిరము ఖండింప, సల్లాడ ప్రళయరుద్రునివలె శత్రువులపైబడి వీరవిహార మొనర్చి తిప్పనాయకుని పాశములతో బంధించెను.

తమ నాయకులు ముప్పేరిట్లగుటతో ధృతిని గోల్పోయి కొండవీటిసైన్యము పలాయనము చిత్తగించెను. పెదకోమటి వేమ యెంత ప్రయత్నించినను వారిలో ధైర్యము నుద్దీపింప జేయలేకపోయెను. ఇంక చేయునదేమియు లేక, తానును వారి ననుసరించెను. శిబిరములు, వాహనములు, భోజనాదికములకై

తెచ్చుకొనిన యనంత వస్తుసామగ్రి, వీనినన్నిటిని వదలి పారి పోవుచున్న కొండవీటిసైన్యమును జూచి రాజమహేంద్రవర సైనికు లానందముతో జయఘోషలు పెట్టిరి. పెదకోమటివేమ సైన్యమును తరుముచు దొడ్డారెడ్డితో నైదువందలమంది యాశ్వికులు వెడలిరి.

మిగిలిన రాజమహేంద్రవర సైన్యమునకు విశ్రాంతి నొసగి యల్లాడ నరహరి యరియేటిలింగనాదులతో కలిసి శత్రువుల శిబిరములను బరిశీలించుటకై వెడలెను. సైనికు లందరును గుంపులు గుంపులుగ స్థిమితముగ గూర్చుండి యుద్ధ విశేషములను జెప్పుకొని యానందించుచుండిరి.

సూర్యు డస్త్రాద్రిని గ్రుంకెను. లోకమంతయు నింద్రనీల ములు కెంపులు కలబోసినట్లు రమణీయముగ నుండెను. ఆరామ ణీయకమును కనులతో గ్రాగుచు, రణరంగమున కించుక దూరమున గల సరస్సుకడకు పోయి నిశ్చలముగ గూర్చుండ దలచిన విజయాంబికకు శరీరము గగుర్పొడుచున ట్లొక దివ్య స్వరము విన్పించెను.

"భారద్వాజసగోత్రః... శ్రీనాథశర్మా... అహంభో అభివాదయే" అని సంధ్యావందనమందలి సంకల్పభాగముగ వినిపించిన ఆ గంభీరస్వరము విజయాంబికను హర్షపులకిత నొనర్చినది.

"ఎవరు! శ్రీనాథ మహామహులా?"

సరస్సులో నొక మహాతేజస్సు. ఆజానుబాహుడు. జ్ఞాన నిమీలితలోచనుడు. కాంతిచ్ఛటల నీను గంభీరవదనుడు. మానవరూపమున నున్న మహేశ్వరుడు.

బ్రహ్మజ్ఞాన కళానిధానమగు నా లోకోత్తరమూర్తికి పురుషవేషముననున్న విజయాంబిక యంజలి ఘటించెను.

సంధ్యావందనము చేసికొని ధ్యాననిమీలితములైన కనులుదెరచి, గట్టుపైకి వచ్చుచున్న శ్రీనాథ కవీంద్రులు దోయిలించి నిలువబడిన విజయాంబికను గాంచి 'సమస్త సన్మంగళాని భవన్తు' అని యాశీర్వదించెను. "ఎవరు నీవు? యుద్ధసంరంభ మేమియు వినిపించుటలేదేమి? అంతయు ప్రశాంతనిశ్శబ్దముగ నున్నది; యుద్ధ మాగినదా?" యని పరిసరములను బరిశీలించుచు శ్రీనాథు డామెను ప్రశ్నించెను.

విజయాంబిక యాశ్చర్యమున కవధులు లేవు! "ఏమి యాశ్చర్యము! వీరికి యుద్ధపర్యవసానమే తెలియలేదా? పెదకోమటివేమ పరాజితుడై పాఱిపోవుచున్నపుడు సంధ్యానుష్ఠానతత్పరుడైన తపస్సమాధిమగ్నుడైన యీ వైదికధ్యాయుతునకు వారి పలాయన సంరంభము వినిపించనే లేదన్నమాట! ఆహా! ఏమి మనోనిశ్చలత! ఏమి ఏకాగ్రత!" అని మరల మరల నచ్చెరువు నొందుచు, జరిగినదంతయు శ్రీనాథులకు విజయాంబిక విన్నవించెను.

ఆమె మాటలు వినుచున్నపు డాకవీంద్రుల ముఖములో నాశ్చర్యము, నిర్వేదము, సంతోషము, నిర్లిప్తత నొకదాని వెంట నొకటి కనిపించెను. "ఆశ్చర్యము! పగ యణగించుట భావ్యమని చెప్పిన నా హితవాక్కును పెడచెవిని బెట్టి, తాను దండ

యాత్రకు బయలుదేరి యిచటికి వచ్చుటయేగాక, సాహితీసమ
రాంగణ సార్వభౌములనుచు నన్నుగూడ తనతో పెదకోమటి
వేమ తీసికొనివచ్చెను. తరలించుకొని వచ్చిన వ్యక్తిని మరలిం
చుకొని పోవలదా?... మరచినాడు ...మంచిది... ఈ విధ
మున కొండవీటిని వదలి అన్నయామాత్యు లెన్నడో పంపిన
యాహ్వానమును మన్నించు నవకాశము లభించినది. ఇదియు
నొకందులకు మంచిదే. గౌతమీస్నానము, భీమేశ్వరధ్యానము
బాగున్నది" [illegible]న్నట్లు ప్రకాశముగ నని, పురుషవేష
మున నున్న [illegible]ను గని "ఏమయ్యా! రణస్థలిని
దొరికిన [illegible] బాధించి మీ ప్రభువులకు సమ
ర్పించుకొనుట ధర్మముకదా!" యని నవ్వుచు శ్రీనాథుడనెను.

"బాధించుట" యను పదమునకు నొచ్చుకొని "అప
రాధ మపరాధ" మని తన నోటిని మాటి మాటికి మూసి
కొనుచు విజయాంబిక యా మహాకవికి అల్లాడ, వీరభద్రారెడ్డి
అన్నయామాత్యులున్న శిబిరమునకు దారిచూపించెను. విజయాంబిక
వెనుక మహారాజువలె నడచి వచ్చుచున్న యా మహాతేజస్విని
జోడుదివ్విటీల వెలుగులో జూచి యల్లాడాదు లప్రయత్నముగ
తమతమ యాసనములనుండి లేచిరి.

ఆ మహాపురుషుని జూచి విస్మితులై సైనికులు పరుగు
పరుగున శిబిరమునకు జేరుకొనిరి.

శ్రీనాథునిరూపమును జూచి విద్యుద్ఘాతము తగిలినట్లు
వరదారెడ్డి బాచయ్య లప్రతిభులైరి. వేషమునుజూడ భోగ
పరాయణుడుగను ముఖమునందలి తేజస్సునాడ సిద్ధపురుషుని

వలెను దోచెను. వారిరువురికి శ్రీనాథులు సమాధియందున్న మన్మథునివలె గనిపించెను.

ముఖమున బ్రహ్మవర్చస్సు.
మూర్తియందు విజ్ఞానరోచిస్సు.
చెవులకు కుండలములు.
చేతులకు సింహతలాటములు.
కాలికి గండపెండేరము.

ఈ రూపమునుజూచి యన్నయామాత్యులు శ్రీనాథుని గుర్తించి "శృంగారనైషధకర్తలు కవిసార్వభౌములు నైన శ్రీనాథులవారుకదా మీ" రనుచు చేతులుజాపి రెండడుగులు ముందరికి వేసెను.

అదేసమయమున, "బహుభాషార్థ సూక్తినిధులైన యన్నయామాత్యులు కదా మీ?" రనుచు చేతులుజాపి శ్రీనాథుడును ముందరికి వచ్చెను.

రసజ్ఞతయు కవితయువలె వారిరువురు నాలింగన మొనర్చుకొన, నా మధురసన్నివేశమును గాంచి శరీరములు రోమాంచితములుకాగా వీరభద్రారెడ్డివంటి సాహితీసంపన్నుల కన్నులానందాశ్రుపూరితము లైనవి.

అనంతర మల్లాడ, అరియేటిలింగన, నరహరి, వేమా రెడ్డి, వీరభద్రారెడ్డి మొదలగుముఖ్యులను శ్రీనాథులకు అన్న యామాత్యులు పరిచయము చేసెను.

"వీరా శ్రీవీరభద్రారెడ్డి!" యనుచు వీరభద్రారెడ్డిని ప్రత్యేకముగ శ్రీనాథుడు సంభావన జేసెను.

"మా కాటయవేమప్రభుని కోరిక యిట్లు నెరవేరినది. అంతయు దైవేచ్ఛ. మీరు మా యాహ్వానమును మన్నించి రాజమహేంద్రవరమునకు విచ్చేసి మమ్ములను మా ప్రజలను పునీతులను శేయుడని ప్రార్థన" యని యల్లాడ అంజలి దోయి లించెను.

అల్లాడ దోసిలిని తన రెండు చేతులతో పట్టుకొని "అల్లాడ ప్రభూ! దీనికింత ప్రార్థనయేల? అట్లే వచ్చెదను. ఈమారు కొండవీటిని వదలి రాజమహేంద్రవరము వచ్చుట కభ్యంతర మేమున్నది? పెదకోమటివేమప్రభువే నన్ను వదలివేసినారు కదా?" యనెను శ్రీనాథుడు.

ఆమాటలలో నెంతయో వేదన! ఎంతయో వ్యంగ్యము! మరెంతయో యానందము! ఇంకెంతయో నిర్లిప్తత!

ఇన్నిభావముల నొకేమాటలో నెట్లుకూర్చినాడా యీ మహాకవి యని బాచయ్య ఆశ్చర్యము చెందెను. ఈయన రూపమువలెనేమాటకూడ రెండు విభిన్నమార్గములకు కూడలి యనుకొనెను వరదారెడ్డి.

అనంతరము శ్రీనాథులతో నల్లాడాదులు దేశపరిస్థితులు, మానవజీవితముగురించి యిష్టాగోష్ఠి యొనరించిరి. యుద్ధములు సర్వదా పరిహారణీయములనియు సమస్యల సంప్రదింపులమూల మున బరిష్కరించుకొనుట యుక్తమనియు తా నెన్నియో మారులు పెదకోమటివేమకే కాక, "నందికంతకటారి"ని తెచ్చు

టకు వెడలినపుడు దేవరకొండప్రభువునకు, కర్ణాటప్రభువైన రాయలకును హితము చెప్పితిననియు, మందస్మితమొనర్చిన వారే కాని యొక్కరును తన సలహాను పాటింపలేదనియు శ్రీనాథు డుద్వేగముతో ననెను.

"అందును సోదరులనడుమ యుద్ధము మరింత యన ర్థము. కొండవీటి రెడ్డిరాజ్యమేమి? రాజమహేంద్రవర రెడ్డి రాజ్యమేమి? అంతయు నాంధ్రమహాసామ్రాజ్యమేకదా! ప్రభువులు వేరుకావచ్చు. అవనీనాథు లవధు లేర్పరుపవచ్చు. కాని యశేషాంధ్ర మహాజనులును, వారి సాహితీసంస్కృతులును, వారి యాచార వ్యవహారములు నవిభాజ్యములు, అవిచ్ఛిన్న ములు. ఈ సత్యమును ప్రభువులైన మీరు ప్రజల కాచరణ రూపమున దెలియజేయవలసి యున్నది. ఈ యుద్ధప్రమాదము లకు తోడు కొండవీటిరాజ్యమందు శైవవైష్ణవభేదములుకూడ నున్నవి. తిక్కయజ్వ బోధించిన హరిహరాభేదమును,నిత్యము సంధ్యావందనమందు 'శివాయ విష్ణురూపాయ' యని చేయు నీశ్వరధ్యానమును మరచి, ప్రజలు శివవైష్ణవవైషమ్యము లతో నిత్యము తగవులాడుకొందురు. మీరాజ్యమందును విప రీత వైరాగ్యదృష్టియు నపరిమితశృంగారజీవనము నను రెండు విభిన్నజీవితమార్గము లుండెనని వింటిని. నిజమేనా?" యని శ్రీనాథు డల్లాడతో నని యన్నయామాత్యులవైపు తిరిగెను.

అన్నయ సాభిప్రాయముగ వేమారెడ్డిని బాచయ్యను జూచి, పిదప వరదారెడ్డిని తిలకించెను. మువ్వురు నవనత వద నులై యాలోచనా నిమగ్నులైరి.

శ్రీనాథులు తిరిగి తమ గంభీరస్వరమున "ఇవియన్నియు ప్రజల జీవితమందు తల యెత్త కూడని యనర్థములు. వీనిని సమూలముగ తీసివైచి వీని స్థానమున సమన్వయభావమును ప్రతిష్ఠించి ప్రజలకు నిర్దుష్టజీవితవిధానము నందింపవలెను. అందులకు మీవంటి ప్రభువుల శాసనములు, మంత్రాంగవైదుష్యము నెంతయవసరమో మావంటికవుల సందేశమునంతియే యవసరము. పాలకుల ప్రత్యక్షప్రభావము భావుకుల పరోక్ష ప్రభావముతో నైక్యమందినచో నిక నా దేశమునకును, ఆ దేశప్రజల పురోభివృద్ధికిని కావలసిన దేమియుండును?" అని బ్రాహ్మీదత్త వరప్రసాదుడైన యా మహాకవి మేఘము గర్జించినట్లు, సెలయేరు హసించినట్లు, ప్రభంజనము శాసించినట్లు లలితగంభీరవాక్కులతో నుపనిషద్వాణివలె సుదీర్ఘముగ భాషించి, కొంతతడవు దీర్ఘాలోచనాతత్పరుడై కనులు మూసికొనెను.

అప్పట్టున నతడు మూడవకన్ను లేని శివునివలె గన్పించెను. అతనిజూచి "ఈ ఆగమజ్ఞాననిధికి హృదయమందే పరమశివుడు నిత్యప్రత్యక్షముకాబోలని యన్నయామాత్యులనుకొనెను.

"ఈ మహాపురుషుని మాటలలో వింతయైన యాకర్షణయే కాదు. విశిష్టమైన యర్థము నున్నది" యని వేమారెడ్డి, కాచయ్య, వరదారెడ్డివంటి యువకు లనుకొనిరి.

"ఉగ్గుపాలతో నుపనిషత్తులను వల్లెవేసి, దంతము లేర్పడిననాటికే వేదాంతమును వంటబట్టించుకొను నకాలవార్ధకము భోగలాలసశృంగారవిలాసములే జీవితధ్యేయములుగా భావించు బాధ్యతారహిత ప్రవర్తనము– ఈ రెండును పరిహారణీయము

లని శ్రీనాథుల పలుకులేకాదు- వారి రూపముకూడ ఘోషీం చుచున్నది. వీరిశరీరము గండపెండేరము, మహాకూర్పాసము, అవచి తిప్పయ్యశెట్టిగారు సమర్పించిన సుగంధద్రవ్యములతో నలంకృతమై యున్నను హృదయముమాత్రము సదాశివునకు వైరాగ్యచింతనకుమాత్రమే పీఠమైయున్నది. ప్రతివ్యక్తియు నిట్లైహికాముష్మిక భావనల సమన్వయరూపమైనచో నెంత బాగుండు" నని వీరభద్రారెడ్డి తలపోసెను.

రాజమహేంద్రవరమునకు తమతో విచ్చేయవలసినదని ప్రార్థించిన యల్లాడాదులతో "అట్లేవచ్చెదను. కాని ముందుగ వారణాసి వెడలి విశ్వేశ్వరుని సేవించి రావలయునని హృదయ మారాటపడుచున్నది. అందువలన నిచటనుండి కాశీపట్ట ణము వెడలి అచటినుండి తిరిగి వచ్చునపుడు రాజమహేంద్ర వరమునకు తప్పక రాగల"నని శ్రీనాథుడు తెల్పెను.

మరునాడు శ్రీనాథుని సగౌరవముగ వారణాసికి బంపి, తిరిగి సైన్యముతో రాజమహేంద్రవరమున కల్లాడాదులు బయలుదేరుటకు సన్నాహములొనర్చుచుండ, విజయుని రూప ముననున్న విజయాంబికను బంధించి "కుమారగిరిని హత్య చేసినవ్యక్తి దొరికె"నని యరచుచు వరదారెడ్డి అల్లాడనుసమీ పించెను. ఇంతలో "పరోక్షముగ నా హత్యకు దోహదము చేసిన నీవును దొరికినా"వని యొక వృద్ధమూర్తి చటాలున వచ్చి వరదారెడ్డిచేయి పట్టుకొనెను. అల్లాడ తక్క తక్కినవా రందరు నేమియు నర్థముకాక విస్మితులైరి.

కాటయ వేమప్రభుని రాజ్యమంతయు పునఃప్రతిష్ఠితమై రాజమహేంద్రవరపతాకము తిరిగి చిలుకసముద్రమువరకు ఎగయుట వలనను, ఓడిపోయిన వీరార్జున బింగరాజాదులే గాక భయపడి శరణుజొచ్చిన అంపదొరవంటి చిన్నసామంతులుకూడ లొంగి వచ్చుటవలనను, (నత్తా) రామేశ్వర యుద్ధమందు రాజమహేంద్రవరమున కపురూపమైన విజయము లభించుటవలనను, వసంతోత్సవము, లాషంవత్సరము వైభవోపేతముగ జరుగునని పౌరులెల్లరు ఎదురు చూచుచుండిరి.

వసంతోత్సవములకు ముందల్లాడ కొన్ని రాజకీయ కార్యములందు నిమగ్నుడయ్యెను. పెదకోమటివేమపై రామేశ్వరమునందు తాను సాధించిన ఘనవిజయమును జెప్పుచు

"జిత్వానల్ప వికల్పకల్పితబలం తం చాల్పఖానుం రణే
మిత్రే కృత్య సమాగతం గజపతిం కర్ణాట భూపంచకమ్
హత్వా కోమటివేమసైన్యనికరం భూయోపిరామేశ్వరాత్
రాజ్యం రాజమహేంద్రరాజ్యమకరోదల్లాడభూమీశ్వరః"

అని కొరుమిల్లియందొక శాసనము వేయించెను. రాణియైన అనితల్లి పేర కలువచేరులో మరియొక శాసనము వ్రాయించెను. కుమారుడైన కుమారగిరి జన్మదినోత్సవసందర్భమున నేనాటో కాటయవేమప్రభువు తోబుట్టువు చివుకుల మాధవశర్మగారికి

దానముచేయగా నిపుడా తోట్లేడు గ్రామము మాది, మాది యని వారసులు తగవులాడుకొనుచుండ నన్నయామాత్యులను బంపి తగిన వారసుల కాగ్రామము నిప్పించెను.

అట్లే ఏనాడో కాటయ వేమప్రభువు తన బావమరదియు నప్పటి కొండవీటి ప్రభువునైన కుమారగిరి పేర కుమారదేవము, కుమారప్రియము, కుమారరాజుపాలెము, కుమారరాజులంక, కుమారగిరిపట్టణములను కల్పించి వానిని బ్రాహ్మణాగ్రహార ములుగ పరిగణించి దానముజేయ మరల వాని నన్నిటిని రాణి యనితల్లి పేర క్రమీకరించి, ఆ యా దానపట్టముల నా యా బ్రాహ్మణ కుటుంబముల కల్లాడ యిప్పించెను.

ఒకదినమున ననితల్లి సచివసమితి సభ్యులతోడను, రాజోద్యోగులతోడను, పురప్రముఖులతోడను కొలువుతీర్చెను. అనితల్లి ప్రతిసీర వెనుక కూర్చుండెను. ఆమె రాజమహేంద్రవర సామ్రాజ్ఞియైనను సింహాసనముపై గూర్చుండుటకు మొదటి నుండియు నంగీకరించుట లేదు. అందువలన సింహాసనముపై రత్నఖచితకిరీటముమాత్ర ముంచిరి.

ఆనాడు కుమారగిరి హత్యాపరాధము విచారింపవలసి యుండెను. అల్లాడ, వేమారెడ్డిని విచారణాధికారిగ నియమిం చెను. తలారులు వరదారెడ్డిని, పురుషవేషముననున్న విజయాం బికను ప్రవేశపెట్టిరి. మహాతలవరి యతనిచే ప్రమాణము చేయించెను. తదుపరి రాయసకాడైన రాయనిబాచ డభియో గమును జదివెను. ఆ యభియోగమునకు సమాధాన మీయ వలయునని వేమారెడ్డి వరదారెడ్డి నాదేశించెను.

వరదారెడ్డి న్యాయనిర్ణేతయైన వేమారెడ్డికి సభాసదులకు నమస్కరించి, "మొదటినుండియు నేను, మాకుటుంబమును ప్రభుభక్తితో రాజమహేంద్రవర ప్రభువులను కొలుచుచుంటిమి. నేను నాలుగైదు సంవత్సరములుగ ప్రణిధినై సామ్రాజ్యమునకు నాశక్తికొలది సేవచేయుచుంటిని. కాటయవేమ ప్రభువు మరణానంతరము కుమారగిరిప్రభువున కంగరక్షకదళ నియామక సందర్భమున, నపరిచితుడగు నీ విజయుని నియమింపవలదని వాదించితిని. కాని బాచయ్యమాటకు ప్రాధాన్యమిచ్చి అల్లాడ[illegible] వీరభద్రారెడ్డిగారును విజయుని కుమారగిరి [illegible]యంగరక్షకునిగ నియమించిరి. ఇప్పటికిని వి[illegible] ఎవరికిని తెలియదు. బాచయ్యకును తెలియదని నా నమ్మకము. విజయుని బెదురుచూపులు మాటలోని తడబాటును జూచి యితడు కొండవీటి గూఢచారి యని యిప్పటికిని నే ననుకొనుచున్నాను. తన విధిని సక్రమముగ నిర్వర్తింపక విజయుడు తరచు అంతఃపురోద్యోగి ప్రత్యేకానుమతిని సంపాదించి నగరములోనికి బోవుట నేనెన్నియో పర్యాయములు జూచితిని. కుమారగిరి హత్యజరిగిననాడంతఃపురాధికారి యనుమతియైన లేకుండ ద్వారపాలకుల కన్నుగప్పి వెడలిపోయెను. నాటికి తిరిగి రామేశ్వరయుద్ధమునందు నాకు కనిపించెను. యుద్ధసమయమున కనబడితటాలునమాయమయ్యేడివాడు. కాని యనంతరము శ్రీనాథులవారిని జూచుచునందరివలె నితడును సమ్మోహితుడై యుండిపోయెను. అందువలన నా చేతజిక్కెను. ఇతడే కుమారగిరిప్రభువును హత్యగా

వి౦చెనని నా యభిప్రాయము. హత్య జరిగిననాటినుండియు రామేశ్వరయుద్ధము జరుగువరకు నీ విజయుడెచ్చటనుండెనో ఎట్టిజీవితము గడిపెనో తెలిసికొనినచో నీ హత్యారహస్యము బయటపడగలదని తెల్పి యూరకుండెను.

అనంతరము విజయుని నియామకమందు బాచయ్య మాటకు ప్రాముఖ్యమునిచ్చిన సంగతి నిజమే యనియు నేటికిని విజయుని కులగోత్రములు తమకు తెలియవనియు వీరభద్రారెడ్డియు, నన్నయామాత్యులును సాక్ష్యములు చెప్పిరి.

తనకును విజయుడు కొండగుదురువాడని మాత్రము తెలియుననియు, తక్కిన వివరములు తెలియవనియు, అయినను విజయునితో తనకు గాఢపరిచయము గలదనియు నందువలన విజయుడీహత్యచేసినట్లుగాని, అతని కీహత్యతో సంబంధమున్నదనిగాని తాను విశ్వసింపజాలననియు బాచయ్య సాక్ష్యము జెప్పెను.

అనంతరము విచారణాధికారియైన వేమారెడ్డి పురుషవేషముననున్న విజయాంబికను బ్రశ్నించెను. ఆమె యేమియు ప్రత్యుత్తరమీయక తాను అనపరాధిననిమాత్రము జెప్పి యూరకుండెను.

అంతట నొకముసలివి యల్లాడ సభలోనికి రావించెను.

ఆ వృద్ధుడు సభకు నమస్కరించి,అవనతవదనుడు నమామకుడునైన విజయుడు రామేశ్వరయుద్ధమున బాచయ్యను జంపెను. శ్రీనాథులను మనకు సమర్పించెను. కొండవీటి ప్రతిభ్యగ్రేసరుడు, కొండపల్లి ప్రభువునైన మాచారెడ్డిగారి

పాలుడే పెదకోమటివేమ యాదేశానుసారము రాజమహేంద్ర
వరము వచ్చి స్వయముగ నీ హత్య కావించెను. అంతకుముం
దత డల్లాడ ప్రభువునే చంపుటకు ప్రయత్నించి విఫలుడై,
యల్లాడ విసరిన బాకు పిక్కలో గుచ్చుకొనగా గాయముతో
కొన్ని దినములు బాధపడెనని తెల్పెను.

అతని మాటలకు శ్లాఘనతకెక్కిన సభ్యులందరు విస్మి
తులై "యసంఖ్యాకులైన గూఢచారిబృందములచే రక్షితమైన
రాజమహేంద్ర[illegible]నికి తంత్రపాలు డెట్లు రాగలిగెను?
వచ్చినను న[illegible] నెట్లుండగలిగె"నని కొందరు
రాజోద్యో[illegible] తెల్లడించిరి.

[illegible] వృద్ధుడు "తంత్రపాలుని విజయమునకు
మన వరదారెడ్డి కొంతకారణ" మనెను.

సభలో కలకలము బయలుదేరెను. ఈ ఆరోపణ
యన్యాయమనియు, తాను సహింపజాలననియు తాను ప్రభు
భక్తిపరాయణుడననియు వరదారెడ్డి యరచెను.

వృద్ధుడతనిని కొరకొర జూచి "ప్రభుభక్తి యున్నదని
యహంకారమే కాని యందులకు తగిన సూక్ష్మబుద్ధి నీకులేదు.
అదియే యీ యనర్థములకు దారితీసినది. సూక్ష్మబుద్ధియే
యున్నచో శ్రీనాథులకు జాబునందించుటకు కొండవీటికి
వెడలినవాడవు, వారి ప్రణిధుల కెట్లు చిక్కియుందువు? పెద
కోమటివేమ ఆప్యాయముగ పలుకరించి రెండువేలదీనారము
లీయనెందులకు స్వీకరింతువు? తన రాజోద్యోగులకు రాజ
మహేంద్రవరమున బంధువులుండిరని తన ప్రణిధ్యగ్రేసరుడైన

తంత్రపాలుని నతని యనుచరుని బంప, వారిని రాజమహేంద్ర వరము నీతో తీసికొనివచ్చి వారికి కావలసిన సాయములు చేయుచు నేల బాసటగ నిలిచి యుందువు ? నీ మందబుద్ధివల ననే తంత్రపాలు డిచ్చటికివచ్చి, ప్రణిధులకు చిక్కకుండ నీ ఘోరకృత్యమును జేసిపోయె" ననెను.

వృద్ధునిమాటలు వినుచున్న వరదారెడ్డికి కాలిక్రింద భూమికదలినట్లయ్యెను. తానుతప్పిదమొనర్చినట్లు గ్రహించెను. కాని యందులకతని మనస్సంగీకరింపలేదు. ఇంతకు నీ వృద్ధు డెవరు ? ఇతడు చెప్పినట్లు తంత్రపాలుడు నిజముగ వచ్చెనా ? తన సాహాయ్యమును పొందిన కొండవీటిరాజోద్యోగి యతడేనా ?ఏమో విజయునిరక్షించుటకీ వృద్ధుడల్లినకథయేమో!

ఆ సంగతినే వృద్ధుని వరదారెడ్డి పృచ్ఛించెను.

కుమారగిరిని హత్యజేసి మనరాజ్యమునుండి పారిపోవు చున్నతంత్రపాలుని మూడురోజులపిదప సరిహద్దులయొద్ద మన ప్రణిధులు బంధించిరి. అతనిచే నిజము చెప్పించుటకై మేము పెట్టిన హింసలను భరింపలేక రవ్వలయుంగరము నూరి మ్రింగి అతడు చనిపోయెను. మరణమునకు ముందాతడే నాకీ వివరము లన్నియు జెప్పెను. అతడే బ్రతికియున్నచో నిది యంతయు నతనిచేతనే చెప్పించి యుండెడివాడ"నని ముదుసలి యనెను.

"ఇంతకు నీ ముదుసలి యెవరు? ఇతనిమాటలు సత్యము లని యెట్లు స్వీకరించుట ?"

ఈ యనుమానము సభాసదులకే కాదు- న్యాయనిర్ణేత యైన వేమారెడ్డికిని కలిగెను. సభలోకలకలము బయలుదేరెను.

ఈవృద్ధుడెవరో నిర్ణయమైనగాని యితని సాక్ష్యమును ప్రమాణముగ స్వీకరించుటకు వీలులేదని వేమారెడ్డి ప్రకటించెను.

“అవును...ఈ వృద్ధు డెవరు?... ఇతని కీ విషయములన్నియు నెట్లు తెలిసినవి?” అని సభాసదులు ప్రశ్నింపసాగిరి. ఆ వృద్ధమూర్తి యల్లాడముఖము జూచెను.

“ఇతడే కొండవీటి తంత్రపాలుడేమో!” యని సభలోని రాజోద్యోగి యొకడరచెను. సభలో కలకలము బయలుదేరెను. ఇక లాభములేదని యల్లాడ లేచెను. సభయంతయు నిశ్శబ్ద మావహించెను.

“[illegible] యనుమానము? వీరు మనరాజ్యమునకు వెన్నెముక వంటివారు. వీరి సాహాయ్యము లేకపోయినచో రాజమహేంద్రవర పునఃప్రతిష్ఠాపన జరిగియుండెడిది కాదు. వీరి యాలోచన వలననే నరహరి, అన్నయామాత్యులు భీమేశ్వరాలయమున దాగుకొనిన యన్నదేవచోడను బంధింపగలిగిరి. వీరి రాయబారముల ఫలితముగనే మనకు కర్ణాటదేవరాయల తోడను, గజపతుల తోడను విడదీయరాని స్నేహమేర్పడి రాజ్యసుస్థిరత యేర్పడినది. ఈ మహానుభావుని ప్రణిధినైపుణ్యము వలననే రాయలు బాపట్లపై దండెత్తుటయు, మన రాజ్యమునకు మహాప్రమాదము తప్పుటయు, బాపట్ల వెడలివచ్చి డస్సిన పెదకోమటివేమ సైన్యమును జయించి రామేశ్వర యుద్ధముతో రాజమహేంద్రవర సామ్రాజ్యమునకు సంపూర్ణమైన సుస్థిరతకలుగుటయు సంభవించినది. ఈయన పరిశోధన ఫలితముగనే నిగూఢముగ నిలిచిపోయిన కుమారగిరిప్రభుని

హాత్యారహస్యము వెల్లడియై నేరస్థుడు పట్టుబడి మరణించుట జరిగినది. వీరిని మీరు జంగమదేవర వేషమున జూచి యుండ వచ్చును. ముష్టివానిగ, విప్రవినోదిగ, విదూషకునిగ, విచిత్ర వేషధారిగ నెన్నియో రూపములను మీకు ప్రత్యక్షమగుచు, మీ నడుమ శత్రువులనడుమ గూడ సమానముగ సంచరింప గల ప్రజ్ఞాధురంధరులు వీరు. వీ రెవరో కాదు. మన ప్రణిధి నాయకులగు సూరన్నరెడ్డిగారు. దురదృష్టవశమున నొకరాత్రి వీరి గృహము దగ్ధమై ఆమంటలలో వీరి సతీమణి మరణింప దేశహితమునుకోరి శత్రువులయౌద్ధత్యమును గమనించి, నా కోరికను మన్నించి తాను నా మంటల కాహుతియైనట్లు లోక మును నమ్మించి నేటివరకు నజ్ఞాతముననుండి రాజమహేంద్ర వరసామ్రాజ్య సుస్థిరత్వమునకు, పునఃప్రతిష్ఠాపనకు నెనలేని దోహదమొనర్చి"రని తెల్పి యల్లాడ కూరుచుండెను.

సభలోనివారెవ్వరికిని నోటమాట లేదు. అందరి కనుల లోను ఆశ్చర్యమే! అందరి ముఖములలోను ఆనందమే!

అల్లాడ మాటలువిని సంతోష సంభ్రమాశ్చర్యము లతో "పెదనాన్నగారూ!" అని సభాస్థలియంతయు మారు మ్రోగునట్లరచినది విజయాంబిక.

సూరన్నరెడ్డితోపాటు సభ్యులందరును పురుషవేషమున నున్న విజయాంబికవైపు విస్మయముతో జూచిరి. తనచుట్టును గల వ్యక్తులనుగాని, వారి మనోభావములనుగాని, సభామర్యా దలను గాని సరకుగొనక హర్షపులకితస్వాంతయై కనులు రెండును చెరువులు కాగా చేతులుజాపి సూరన్నరెడ్డి దగ్గరకు పరుగిడుచు "నేను! పెదనాన్నగారూ!... నేను విజయాంబి

కను. నన్ను గుర్తుపట్టలేదా?" యని విజయాంబిక యతని సమీపించెను.

సూరన్నరెడ్డి ప్రమాన్పడి, తిరిగి విఘటిక కాలములో తేరుకొని "నీవాతల్లీ? ఈ పురుషవేష మేమి? కొండవీటినుండి ఎపుడువచ్చితివి? మీ నాన్నను అమ్మను నిర్బంధించినపుడు నిన్నుకూడ పెదకోమటివేమ గృహనిర్బంధమున నుంచ లేదా?" యనుచు నాలింగన మొనర్చుకొని వాత్సల్యయముగ తల నిమురుచు కనుల నీరుపెట్టుకొనెను.

తాను గృహనిర్బంధమునుండి తప్పించుకొని పురుష వేషమున [illegible] ద్రవరము వచ్చినది మొదలు నాటివరకును [illegible] న్నిటిని సంగ్రహముగ జెప్పి, పెదతండ్రి [illegible] తలవాల్చి వెక్కి వెక్కి యేడ్చినది విజయాంబిక.

"విజయుడును విజయాంబికయు నొక్కరేనా!" యని యాశ్చర్యపడినది ఒక్కబాచయ్యయే కాదు— అల్లాడ, వరదారెడ్డి, అన్నయామాత్యాది సభాసదులందరు నచ్చెరువు నందిరి.

తెలియక చేసినను వరదారెడ్డి రాజద్రోహమునేమము చేసినట్లేయని వేమారెడ్డి నిర్ణయించెను. కాని యతనికిక్షమాభిక్షను దయచేయవలసినదిగ బాచయ్య ప్రభుత్వమును వేడుకొనెను. రామేశ్వర యుద్ధముతో బాటు పలుయుద్ధములందు వీరోచితముగ బోరి దేశమునకు సేవజేయుటవలన నతని యభ్యర్థనను మన్నించి వరదారెడ్డిని క్షమించుటయేగాక వీరుడైన బాచయ్యను చమూపతిగ నియమించి గౌరవింపదలచితినని సామ్రాజ్ఞియైన యనితల్లి ప్రకటించెను.

ఆ ప్రకటన వినిన బాచయ్యకు తండ్రి జ్ఞప్తికివచ్చెను. గంగారెడ్డి ఆహవమల్ల యను బిరుదును పొందెను; పొందెనే గాని చమూపతి కాజాలకపోయెను. ఆ గౌరవము తనకుమారుడైన బాచయ్యకు లభించినచో జూచి యానందింపవలెనని పాప మా పితృహృదయ మువ్విళ్ళూరినది.

నేడు బాచయ్య చమూపతి యైనాడు.

కాని అది చూచి యానందించుటకు గంగారెడ్డి లేడు. బాచయ్య కను లశ్రుపూరితము లయ్యెను. అది చూచి విజయాంబిక కళవళపడి యతనిని సమీపించెను. ఆమెను జూచి బాచయ్య కనులు తుడుచుకొని గాంభీర్యము వహించెను.

సభాస్థలినిపీడి వెలుపలకు వచ్చిన పిదప పశ్చాత్తాపముతో వరదారెడ్డి "విజయాంబికా!... నీ యుత్తమ ప్రవర్తనను గ్రహింపజాలక దుర్భావములతో పాప మొనర్చితిని. అందులకు ఫలితముగ శ్యామలాంబను పోగొట్టుకొంటిని. నాకు భయపడి యామె చంపుడుగుడిలో ప్రాణములు పోగొట్టుకొనినది. రక్తసిక్తమైన యామె లీలాంశుకమునుజ్ఞాపకచిహ్నముగ దాచుకొన్నాను" అనెను.

"కాదు. ఆమె చనిపోలేదు. చంపుడిగుడిలో నామె బాకుతో పొడుచుకొనుచుండ, నే నామెను రక్షించితిని. రక్తసిక్తమైన లీలాంశుక మచట పడిపోయినది కాబోలు. ఆమె మాతృమూర్తి హరిహరాంబ యంతఃపురమున నాతో సురక్షితముగ నున్నది" యని విజయాంబిక తెల్పెను.

ఆమె మాటలు వరదారెడ్డి చెవుల కమృతసేచనము లయ్యెను. శ్యామలాంబనుచూడవలెనని యత డారాటపడెను.

విజయాంబిక బాచయ్యవైపు తిరిగి యించుక మందహాసముతో "మారువేషముతో మోసగించితినని కోపమా?" యనెను. అందులకు బాచయ్య నవ్వుచు "కొండవీటి దానవు. కొండగుదురువాడనని కొండంత యసత్యమాడితివి. నీకు తగిన దండన విధింపవలె"ననెను. అతని మాటలు వినిన విజయాంబిక హృదయమున వేయి వీణెలు మ్రోగినవి. కనులలో కోటి మల్లెలు విరిసినవి.



౧౬

విజయపరంపరల యనంతర మేతెంచిన వసంతఋతువున, రాజమహేంద్రవరప్రజలు చైత్రశుద్ధ త్రయోదశినుండి మహోత్సాహముతో వసంతోత్సవములు జరుపుకొనసాగిరి.

గృహస్థుల యిండ్లయందలి, విలాసోద్యాన వనముల లోని సురపొన్నలు, సంపెగలు పూచి పథికులకు తమసువాసనలుపాయనముగ సమర్పించుచుండెను. గాలి యందు కుసుమవిసరము దట్టముగ వ్యాపించెను. ఉద్యానవనము లన్నియు తుమ్మెదల ఝుంకారములతో శుకశారికల సల్లాపములతో పుంస్కోకిలల కోమల కంఠధ్వనులతో ప్రతిధ్వనించుచు వసంతుని యాగమనము నెలుగెత్తి చాటుచుండెను.

ఇంతవరకును వేదాంతధోరణి యలవరచుకొనిన వేమా రెడ్డి బాచయ్యాది యువకులకు, పూర్వమువలెగాక యీవసంతమున కిసలయములు, నవకుసుమములు, పూదేనియలు నూత్నానందమును కల్గించి మధురభావనలు రేపుచుండెను. చిత్రమేమన వరదారెడ్డికీ వసంతము గంభీరముగ కానిపింపదొడగెను. తమలో వచ్చిన యీ మార్పులను గురించి ముచ్చటించుకొని, పిదప నవ్వుకొని వేమారెడ్డి వరదారెడ్డి బాచయ్యలు తమలో నైహికదృష్టి గలవారికి కొంచె మాముష్మికచింతనయు, వైరాగ్యభావములు గలవారికి అనురాగదృష్టియు నేర్పడుటకు నైహికాముష్మిక జీవనములను తనలో సమన్వయము చేసికొనిన శ్రీనాథుల దర్శనప్రభావము కొంతవరకు కారణమైయుండునని తలపోసిరి. తదనుగుణముగా వేమారెడ్డికి కనులుమూసినను తెరచినను హారిహారాంబ రూపమే గోచరించుచుండెను. అట్లే బాచయ్య యూహాలన్నియు విజయాంబికవైపే.

వసంతోత్సవములు ప్రారంభమైన వాసరమున నంతఃపుర స్త్రీలును రాజబంధువులును గోదావరికి దాసదాసీజనముతో స్నానార్థమేగి యూరేగింపుతో దిరిగివచ్చిరి. తదుపరి యశోకవృక్ష ప్రతిష్ఠాపన జరిగెను. ఆయశోకమునువీరభద్రారెడ్డియు ననితల్లియు బూజించిరి.

పిదప కామదేవ, విఘ్నేశ్వర, శివ, వసంతాప్సరోగణ ప్రతిష్ఠాపనజరిగెను. కర్పూరాగురు కుంకుమలతో నా దేవతల

నల్లాడ యరియేటిలింగనాది ప్రముఖులును సేవించి పూజించిరి. నగరునందలి పుణ్యాస్త్రీలు తమతమ భర్తలకు గాజ్మీరాంగ రాగములను ముత్యములను భూషణములను బహుమతులుగ నొసంగిరి. అవివాహితలైన యువతులు చిత్రవర్ణసౌగంధికజలమును (వావి) వరుసయైన పురుషులపై జిలుకరించిరి. హారిహారాంబ చల్లిన వసంతము వేమారెడ్డిమీదను, విజయాంబిక చిలుకరించిన పన్నీరు బాచయ్యమీదను పడిన సంగతి అనితల్లి వీరభద్రారెడ్డివంటి వయస్సులకేకాక అల్లాడ, దొడ్డాంబిక వంటి వృద్ధులకును దెలిసినది. తన ప్రథమపుత్రిక యల్లాడ రెండవ కుమారుని వివాహమాడెను. కనుక తన రెండవకొమార్తె ఆయన పెద్దకుమారుని వివాహమాడినచో నసంగతముగ నుండునని దొడ్డాంబిక మొదట సందేహించినను పిదప వారిరువురికి నిష్టమైనచో తా నభ్యంతరము దెలుపుట యేమి సమంజసమని యూరకుండెను.

సాయంకాల మేర్పాటైన సభయందు వివిధసంగ్రామములలో శౌర్యధైర్యములను బ్రదర్శించిన వీరవరులకు గౌరవ ప్రదానములు జరిగెను. కొందరకు బిరుదుపెక్కెములు, కొందరకు బిరుదుగొడుగులు లభించెను. అత్యున్నతగౌరవము లభించినది బాచయ్యకే! తాను మున్ను ప్రకటించిన విధమున సామ్రాజ్ఞియైన యనితల్లి యతనికి "చమూపతి" పదవినిచ్చెను. ఆమె యభీష్టము ననుసరించి యల్లాడ వేమునల్లెగ్రామమునతనికి దానవిక్రయాది స్వత్వములతో శాసనము వ్రాయించి యిచ్చెను. నూరన్నరెడ్డికి సచివసమితిలో సభ్యత్వమునిచ్చి గౌరవించెను. పండితులకు కర్పూరతాంబూలములు,భూరిదక్షి,

ణాలు లభించెను. పరిచారకులకు సురయు, మృష్టాన్నభోజన మును లభించెను.

సాయంసమయమందు నగరున నెచట జూచినను క్రీడా వినోదములే ! పులిజూదము, కుండెన గోరంటలు, దాగుడు మూతలు, ఓమనగుంటలు నెవరి యభిరుచికి తగినట్లు వారాడు కొనుచు నానందించుచుండిరి.

ఒకచో స్త్రీపురుషులు మహానందముతో వసంతము నొండొరులపై జల్లుకొనుచుండిరి. సమీపమున విజయాంబిక చోద్యముజూచుచు నిలిచియుండ, బాచయ్య యామెను సమీ పించి "వసంతము జల్లుదునా ?" యని రహస్యముగ నామె చెవిలో ననెను. విజయాంబిక ఆ మాటలకు పులకించి వెంటనే కోపము నటించుచు "ననుజ్ఞ తీసికొనియా జల్లుట !" యని ముదలకించెను. ఆమె భావమును గ్రహించి పన్నీటిలో గంధ సార సంకుమదములు పునుగు, కర్పూరములు గలిపిన వసం తము నామెపై జల్లెను. విజయాంబిక నవ్వెను. బాచయ్యయు నవ్వెను.

ఆమె సూరన్నరెడ్డిగారింటికి వెడలిపోయెను. బాచయ్య విజయాంబికను గురించియే యాలోచించెను. "ఈమె యవ గుంఠనము తాల్పదు. గృహముపిడి యిటునటు నడయాడు టకు జంకదు. సంప్రదాయపరులైన కొందరు ఛాందసులకిది విపరీతముగ గనిపించును. కాని యీమె కిదియే యందము. పెరటిలోని పారిజాతములు కొందరు స్త్రీలైనచో కొందరడవి యందలి కొండమల్లెలు".

ఇట్లు తలపోసి బాచయ్య చీకటిపడుచున్నదని గృహో న్ముఖుడై మరలెను.

మార్గమధ్యమున నొకచో మార్గ నాట్యప్రదర్శనము జరుగుచుండెను. అచట శివుని తాండవము పార్వతి లాస్యము నతిలోకమనోహరముగ బ్రదర్శించుచుండిరి.

మరియొకచో దేశినాట్యము ప్రదర్శిత మగుచుండెను. గొండ్లిచిందు, పేరణి, కోలాటములను కొందరు యువతులు కాంచీనూపుర కంకణధ్వనులు తాళమువేయ నందముగ నాడిరి. వీనిని జూచి హాల్లీసకము, పారశీకనర్తన, కావడిచిందులు,పుష్పగంధికా నృత్యములును వీక్షించి గృహోన్ముఖుడు కానున్న బాచయ్యకు అన్నయామాత్యులెదురై రాచనగరు లోనికి రమ్మని తనతో తీసికొనిపోయెను.

అచటను నృత్యములు జరుగుచుండెను. కాని ఆ నృత్యములు శాస్త్రీయముగ బ్రదర్శితములగుచుండెను. మతంగుని శాస్త్రమును, భరతశాస్త్రమును, నందికేశ్వరమతమును బాటించి యచటి నటులు నృత్య మొనర్చుచుండిరి.

నృత్య ప్రదర్శనానంతరము రాచనగరులోని సభాప్రాంగణమున శ్రీవల్లభ, సరస్వతిభట్టు, నరసింహాభట్టు, వైకుంఠ భట్టు, కందాయభట్టువంటి పండితప్రకాండులకును, శివలెంక కొమ్మన త్రిపురాంతకాదికవిశిఖామణులకును,శివదేశిక,గౌతమ జోషి, సోమనాథభట్టాది సంగీతవిద్వాంసులకును సన్మానములు జరిగెను. పౌరాణిక జ్యోతిషిక చిత్రకారులకును, వేత్రహస్త, దౌవారిక, ద్వారపాలక, సూత, మాగధ, స్తుతిపాఠక, వైతాళిక, అంగరక్షకాది పరివారమునకును, దేవతార్చక, మాలాకారక, పరిమళకారకాది పరిజనమునకును సముచితరీతిని బహుమతులు లభించెను.

అంత నాటి వసంతోత్సవములు ముగిసినవనియు నిక్లే యింక నెనిమిదిదినములు జరుగుననియు రాజప్రకటన వెలువడెను.

రాజమహేంద్రవర రసజ్ఞులు నాటి వసంతవైభవమును హృదయములందు నింపుకొనుచు నిండ్లకేగిరి.

౧౬

వసంత పంచమి !

రేపటితో వసంత నవరాత్రులు పూర్తియగును.

నేడే శ్రీనాథకవిసార్వభౌములు తన వారణాసియాత్రను పూర్తిజేసికొని రాజమహేంద్రవరము విచ్చేయురోజు !

వేకువనే పన్నీటి కలియంపి జల్లి, వీధులందు ముత్యాల ముగ్గులు పచరించి, మార్గమధ్యమున నెడనెడ మామిడితోరణములను ముత్యాలపేరులను కట్టి మార్గములందు సేసలుచల్లి రాజమహేంద్రవరమును దేవేంద్రనగరివలె నలంకరించుటతో సౌందర్యమంతయు నొకచో జేర్చినట్లును శ్రీలన్నియు రూపు దాల్చినట్లు నా మహాపట్టణము శోభిల్లుచుండెను.

పుష్పములు, సేసలు, హారములు చేతబట్టుకొని కవీంద్రులకు స్వాగతము నిచ్చుటకై పౌరులెల్లరు రాజమార్గమున కిరువైపుల బారులుతీర్చి నిలుచుండిరి. ప్రముఖులైన యల్లాడ, అరియేటి లింగన, వీరభద్రారెడ్డి, వేమారెడ్డి, అన్నయామాత్యులు భద్రగజములపైనను, దొడ్డారెడ్డి వేమారెడ్డి బాచ

యాద్యాది ముఖ్యు లుత్తమాశ్వములపైనను, శివలెంక కొమ్మనాదికవులు పల్లకీలలోను, నగరుదాటి పొలిమేరల చెంతకు ఎదురువెళ్ళి శ్రీనాథునికి స్వాగతము చెప్పుటకై వేచియుండిరి. వారికంటె రెండుయోజనములదూరము ముందుగ నెదురేగి కవీంద్రులను సగౌరవముగ తీసికొనివచ్చుటకై యల్లాడ ఏబదిమంది శ్వేతాశ్వారూఢులను, పదిమంది వందిమాగధులను, పదునైదుగురు సేవకులను, వెండిపల్లకితో నిరువదిమంది బోయీలను, జోడుదివిటీలను గతరాత్రియే పంపెను.

ఇట్లు ప్రభువు మొదలు సామాన్యునివరకు రాజమహేంద్రవర పౌరజనమంతయు వేయికన్నులతో శ్రీనాథునిరాకకై యెదురుచూచుచుండ ఛాందసులైన యే పదునైదుగురు పండితులో ప్రజల సంతోషమున బాలుపంచుకొనలేక విముఖులై యుండిరి.

ఇంతలో సుదూరమున పల్లకిబోయీల కంఠస్వనములు వినవచ్చెను. ఊరిబయట వేచియున్న యల్లాడాది ప్రముఖులందరు గౌరవసూచకముగ తమతమ వాహనములనుండి దిగుచుండ, కాశీయందు తన్నాశ్రయించిన పదిమంది నూతనశిష్యులును, అల్లాడపంపిన పరివారజనమును, తనను కొలిచివచ్చుచుండ జోడుదివిటీల వెలుగులో వైభవముగ శ్రీనాథమహాకవి వెండిపల్లకిలో వేంచేసెను.

అందుండి దంతపు పావలు, గంధపుపెండెరము, పట్టుపీతాంబరము, బంగారు కాశ్మీరపువలిపము, సింహతలాటములు, బంగరుతీగతో నల్లిన రుద్రాక్షలు, ధవళరోచిస్సులు వెలయించు భస్మత్రిపుండ్రములతో జ్యోతిర్మయమైన సాహితీమూర్తి యవరోహించెను.

అభివాద మొనర్చిన యల్లాడ యరియేటిలింగనలకు ప్రత్యభివాద మొనర్చి, అంజలి ఘటించిన వీరభద్రా రెడ్డిని సంభావించి, నమస్కరించిన శివలెంకకొమ్మనను కుశలమడిగి, శ్రీనాథుడు, బెండపూడి అన్నయామాత్యుల నాదరపూర్వకముగ నాలింగన మొనర్చెను.

అర్ఘ్యపాద్యములిచ్చి, పట్టువస్త్రము సమర్పించి మహాకవిని తెల్లయేనుగుపై నెక్కించి పురమంతయు నూరేగించిరి. అట్లూరేగుచుండ రాజమార్గమున కిటునటునున్న సౌధోపరి భాగములనుండి పుష్పవర్షము సేసలజల్లు శ్రీనాథునిపై గురిసెను. మార్గమున బరచిన పట్టువస్త్రములపై శ్రీనాథుడధిరోహించిన భద్రగజము ముందునడువ, వెనుక ప్రముఖులందరు తమ వాహనముల నధిరోహించి యూరేగింపు వెంట బాల్గొనిరి. శ్రీనాథులపై జల్లిన పుష్పముల పుప్పొడి యాకాశము వరకు వ్యాపించి గాలి సుగంధముతో నిండిపోయెను.

ఆ యూరేగింపు మహావైభవమును గాంచి యల్లాడ ప్రభువు హర్షపులకితస్వాంతుడై, గతించిన కాటయవేమప్రభువును తలచుకొని యశ్రుపూరితనయనుడై "కాటయవేమ ప్రభూ! నీకోరిక యిట్లు తీరినదయ్యా మరి!" యని గద్గదస్వరమున స్వగతముగా ననుకొనవలసిన మాటలను ప్రకాశముగా ననెను.

శ్రీనాథులును "వీరికి నాయందెంత ప్రత్యయమున్నది! నేటికిగాని వీరి యాతిథ్యమును స్వీకరించు నవకాశము భీమేశ్వరుడు నాకు కలిగించలేదు. కొండవీటిలో నేకాదు-రాజమహేం

ప్రవరమునను కవుల కింతటి మర్యాద కలదన్నమాట! వీరిదొక విధమగు మర్యాద. ఇదియు నానందహేతువుగనే యున్న"దని సంతృప్తి చెందెను.

శ్రీనాథులకు విడిది యన్నయామాత్యులయింట నేర్పాటయ్యెను. భోజనానంతరము తనయింట జరుగు సాహిత్య సభకు విచ్చేయవలసినదిగ నెల్లరను బెండపూడి అన్నయ యాహ్వానించెను.

మణిస్థగితకుడ్యములుగల విశాలమైనస్థలమున సాహిత్య సభ యేర్పాటయ్యెను. సభాస్థలియంతయు నెఱ్ఱని మామిడి చిగురులతోడను, తెల్లని ముత్యాలపేరులతోడను, పచ్చని యరటిస్తంభములతోడను నయనపర్వముగ నలంకృతమయ్యెను. సభ నుద్దేశించియున్న రెండు సింహాసనములలో నొకదానిపై బెండపూడి అన్నయామాత్యులును, రెండవదానిపై భువి కవతరించిన దేవేంద్రునివలె శ్రీనాథకవిసార్వభౌములు నాసీనులై యుండిరి. పలనాటివీరులపౌరుష మాయన కనులలో ప్రతిఫలించుచుండెను. నిషధేశుని ప్రజ్ఞావైభవము సువిశాలమైన ఫాలమున వెలుగొందుచుండెను.

అన్నయ శ్రీనాథులకు దక్షిణపార్శ్వమున భాట్టప్రభాకర ప్రస్థానసంవేద్యులైన యుద్దండపండితులు కూరుచుండిరి. ఫణిభాషిత భాష్యఫక్కికా భావజ్ఞులగు నుత్తమప్రగల్భులు వామపార్శ్వమున నుపవిష్టులైరి. కణభుజ్మతగ్రంథగూఢార్థవిదులైన బహుశ్రుతిసంపన్ను లొకవంకను, వేదాంతవాసనావిశ్రాంత హృదయజ్ఞులైన యుపనిషత్తత్త్వజ్ఞు లింకొకవంక నాసీనులై

యుండిరి. ఉభయభాషాకవీశ్వరులు వారిచెంత కూర్చుండిరి. సమీపమున వేశ్యలును వీరభటులును సేవించుచు నిలువబడిరి.

సుదూరముగ కూరుచుండి రెప్పవాల్చకుండ శ్రీనాథుని జూచుచున్న బాచయ్య, ఈయన బాహ్యవేషమునకు నాంతర రూపమునకు సమన్వయమెట్లు సాధ్యమా యని యోచించు చుండెను. అనితల్లి యొద్దనుండి శ్రీనాథులకు సాధికారికమైన యాహ్వానమును దీసికొనివచ్చిన దొడ్డారెడ్డి శ్రీనాథునికిసమీప మునన్న యాసనముపై కూర్చుండెను.

గడియన్నర కాలము శ్రీనాథులు కవిత్వమును గురిం చియు, రసమునుగూర్చియు, కవిత్రయమువారి మహోదాత్త కవితాప్రౌఢిమను గురించియు కవి వివిధాస్థానముల కేగి జయ ధాటి మొనర్పవలసిన యవసరము గురించియు ననర్గళముగ నుపన్యసించెను. తేనెలు ప్రవహించినట్లు, అమృతము వర్షించి నట్లు సాగిన యా గంభీర వాగ్వైభవమునం దోలలాడిన సభ్యులు రసానందైకలోలురై మహానందము నొందిరి.

పిమ్మట అన్నయామాత్యులు లేచి శ్రీనాథులకు నమస్క రించి కర్పూర తాంబూల జాంబూనదాంబరాభరణములొసగి ధీరవాక్కులతో "శ్రీనాథసుకవీ! మీరలు హర్షనైషధాది కావ్యములు రచించినారలు. అఖిలపురాణ విద్యాగమములు పెదకోమటివేమకు వినిపించినారలు. దిశాంగణములందు మీ కీర్తి కర్పూరమువలె వ్యాపించినది. పాకనాటింటివారగుటచే నాకు మీరు బంధువులు కూడను. నాకు కృతిపొందుట తక్క తక్కిన సప్తసంతానములును లభించినవి. స్కాందపురాణ

మందలి భీమేశ్వర మాహాత్మ్యమును ప్రబంధముగ విరచించి నాకు కృతి యీయ వేఁడెద" నని అంజలి ఘటించి ప్రార్థించెను.

సభయందు నిశ్శబ్ద మావరించెను. రెండు క్షణములు శ్రీనాథులు కనులు మూసికొని, హృదయస్థుఁడైన భీమేశ్వరుని ధ్యానించి, దక్షారామమువెడలి భీమేశ్వరుని సేవించి వచ్చిన పిదప గ్రంథరచన ప్రారంభింపవచ్చునని నిశ్చయించి శిరఃకంప మొనర్చి కనులు దెరచి చిరునవ్వు నవ్వి తన యంగీకారమును దెల్పెను.

వెంటనే దిక్కులు మార్మ్రోగునట్లు "రాయవేశ్యా భుజంగ బెండపూడి యన్నయామాత్యులకు జై! కవిసార్వభౌమ శ్రీనాథమహాకవికి జై" యనుచు సదస్యులు జయజయ ధ్వానము లొనర్చిరి.

తిరిగి సభయంతయు నిశ్శబ్ద మయ్యెను.

శ్రీనాథులు లేచి తన మనోహర దివ్యగంభీరస్వరమున

"శ్రీస్తనగంధసార పరిషేక సమంచిత సాయకప్రయో
గస్త్రిమహాపురత్రయుఁ డహార్యధనుర్ధరుఁ డర్కకోటిదీ
ప్తిప్రస్తవనీయవిగ్రహుఁడు భీమయదేవుడు దక్షవాటికా
వాస్తుఁడు ప్రోచుఁగావుతధ్రువంబుగ దేవయయన్నధీమణిన్"

అనుచు నాశీర్వాద పద్యమును జదివి, పుష్పాక్షతల నన్నయ శిరస్సున జల్లి తనయాసనముపై గూర్చుండెను.

అనంతర మనితల్లి పంపిన రాజమహేంద్రవర ప్రభుత్వాహ్వానమును దొడ్డారెడ్డి శ్రీనాథులకు సమర్పించెను. ఆయాహ్వానమునకు శ్రీనాథులు తన యంగీకారమును సగౌరవముగ దెలియ బరచెను.

ఆ సాయంత్రము దొడ్డారెడ్డి శ్వేతాశ్వమును నడిపించుకొనుచు ముందునడువ నిరువది మంది యాశ్వికులు తమ యశ్వములను నడిపించుకొనుచు నిరుకెలంకుల పరివేష్టించి నడచుచుండ, వందమంది భటులు కొలిచి తన ననుసరింప, కొమ్మనాదికవులతోడను అన్నయాది ముఖ్యులతోడను కలిసి, వెల్లగొడుగు నీడను, సమస్త రాజమర్యాదలతోడను శ్రీనాథ మహాకవి రాజమహేంద్రవర సభాభవనమును ప్రవేశించెను. కవిసార్వభౌముడు సభలో నడుగిడుచుండ గిరివర్గంబెల్ల నూటాడునట్లు సభాసదులెల్లరు జయజయధ్వానము లొనరించిరి.

అర్ఘ్యపాద్యాది సమస్తోపచారములను, సమస్త సత్కారములను సామ్రాజ్ఞియైన యనితల్లి పేర వీరభద్రారెడ్డిచేతనల్లాడ చేయించెను. ప్రతిసీర వెనుకనుండి యవగుంఠనము సరిచేసి కొనుచు, సభక్తికముగ నమస్కరించిన రాణి యనితల్లిని శ్రీనాథులు "దీర్ఘసుమంగళీభవ" యని తన పవిత్ర దివ్య వాక్కుతో నాశీర్వదించెను.

అంత సామ్రాజ్ఞి యాజ్ఞానుసారము; ప్రధానియైన యరియేటిలింగనామాత్యులు శ్రీనాథకవీంద్రులను రాజమహేంద్ర వరాస్థానకవులుగ నియమించిన ట్లాధికారికమైన ప్రకటన యొనరించి యందులకు తగిన వైదిక లౌకిక విధులను నిర్వర్తించెను.

పిదప శ్రీనాథులు వీరభద్రారెడ్డి ప్రభృతులతో నిష్టాగోష్ఠియొనర్చుచు "నన్నుగురించి మీకర్పించిన యాయువకు డేడి ?" యని నవ్వుచు ప్రశ్నించెను.

"ఇపుడావ్యక్తి యువకుడుకాడు, యువతి. రాణి హరిహరాంబవారి కొలువునం దున్నది. అదిగో వచ్చుచున్నది. ఆమెకు త్వరలో వివాహమగున ట్లాశీర్వదింపు" డని సూరన్నరెడ్డి ప్రతిసీర వెలువడి వచ్చుచున్న విజయాంబికను జూపించెను.

"మా చెల్లెలు హరిహరాంబనుకూడ నట్లే దీవింపు" డని యనితల్లి ప్రతిసీర వెనుకనుండి పలికెను. హరిహరాంబ కుహనాకోపముతో ననితల్లి వంక జూచెను.

ప్రతిసీర వెనుకనుండి నమస్కరించిన హరిహరాంబను తనను సమీపించి పాదాభివందన మాచరించిన విజయాంబికను "శీఘ్రమేవ కల్యాణ ప్రాప్తిరస్తు" అనుచు శ్రీనాథు లాశీర్వదించిరి. ఆ యాశీర్వాదమును విన్న వేమారెడ్డికి బాచయ్యకు నొడలు పులకరించెను.

అనంతరము శ్రీనాథులు విజయాంబికను జూచి "సరస్సునందు సంధ్యావందన మొనర్చుచున్న నన్ను గమనించి రాజమహేంద్రప్రభువుల కడకు నీవు తీసికొని వెడలనిచో నా యంతటనేనై వారియొద్ద కేతెంచెడి యవకాశము లభించెడిది కాదు. వారును నే నచట నుండుటను గమనింపక యుందురు. నీవలన రాజమహేంద్రవర రసజ్ఞులకును నాకునుసంధానమైనది. నాకీ విధముగ గౌతమీస్నానమును భీమేశ్వరధ్యానమును లభింపజేసిన నీకేదేని బహుమతి నీయదలచితిని. కోరుకొను" మనెను.

విజయాంబిక దోయిలించి "కవిసార్వభౌమా! నాకు వేఱు కోరిక యేమియు లేదు. కొండవీటిలో పెదకోమటి వేమ ప్రభువుచే బంధితులైన నా తల్లిదండ్రులను విడిపించుకొనవలె ననిమాత్ర మున్నది" యనెను.

"అట్లే కానిమ్ము. ఇంకను పెదకోమటి వేమ నా మాటను సమాదరించునను నమ్మకము కలదు. ఒకటి రెండు రోజులలో కొండవీటికి కబురుచేసి నీ తల్లిదండ్రులను విడిపింతు" నని శ్రీనాథు లభయమిచ్చెను. విజయాంబిక 'మహాప్రసాద' మని నమస్కరించెను.

అంత నల్లాడ లేచి "కవిసార్వభౌమా! మాకాటయ వేమప్రభుని సంకల్పబలమువలనను, రాజమహేంద్రవర ప్రజల యదృష్టాధిక్యమువలనను తాము మా యాస్థానమునకు విచ్చేసితిరి. నా కెంతయు నానందముగ నున్నది. మీరాకతో కాటయ వేమప్రభువునకు నేనిచ్చిన వాగ్దానములన్నియు సఫలమైనట్లే! కుమారగిరి ప్రాణములను మాత్రము కాపాడజాలక పోయితిని. అది యొకటియే నా హృదయమునకు తీరని వ్యథయై బాధించు చున్నది. ఈ బాధ్యతల నన్నిటిని నే నిక వహింపజాలను. ఏ అన్నయామాత్యులకో నా బాధ్యతలప్పగించి, కాశీ వెడలవలె నని యభిలషించుచున్నాను. దానికి ముందుగ నొక్క మనవి. రాజమహేంద్రవర సామ్రాజ్ఞియైన మా యనితల్లి కంకితముగ నొక ప్రబంధమును తాము విరచింపవేడెదను. అందును కాశీ

వృత్తాంతమైనచో నాబోంట్లకు కూడ తరణోపాయము గు" నని విన్నవించెను.

శ్రీనాథులు సమాధానమీయక మిన్నకుండిరి.

ఇంతలో ప్రతిసీర వెనుకనుండి యనితల్లి "ఏతద్గ్రంథమును మత్ప్రాణవిభున కంకితముగ నీయ ప్రార్థన" యనెను.

శ్రీనాథు లప్పటికిని సమాధాన మీయలేదు.

ఇప్పటికే భీమఖండమును రచించు బాధ్యతను స్వీకరించితినిగదా, మరల నీ బాధ్యతను స్వీకరించినచో రెండు కార్యభారముల నొకే కాలమున నిర్వహించుట యెట్లాయని శ్రీనాథులు సంశయించుచున్నట్లు పరేంగితావగాహియైన యన్నయామాత్యులు గ్రహించెను. ప్రభువుకంటె ముందమాత్యున కంకితముగ గ్రంథము విరచించుట సమంజసముగ నుండదనితలచెను. అతని తలపులు కనులలో కన్పింప, కాశీఖండ రచనానంతరమే భీమఖండరచన ప్రారంభింప వచ్చునని నిశ్చయించుకొని అన్నయామాత్యులవైపు సాభిప్రాయముగ నొకమారుచూచి తుదకు కాశీఖండ రచనకు తన యంగీకారమును సగౌరవముగ శ్రీనాథుడు తెల్పెను.

అంత, వీరభద్రారెడ్డి కర్పూరతాంబూలమును రత్నములను పట్టువస్త్రములను బంగరుపళ్ళెరమున నుంచి శ్రీనాథులకు సమర్పించెను.

శ్రీనాథులును లేచి, కానుకల నందుకొని, మనస్సులో విశ్వేశ్వరునిధ్యానించి, వీరభద్రారెడ్డిపై నక్షతలు పుష్పములు జల్లి యాశీర్వదించి తన శ్రావ్యగంభీరకంఠముతో నిట్లుపలికెను.

"శ్రీకాశీనగరాధి రాజ్యపదవీ సింహాసనాధ్యాసి లో
కైకగ్రామణి విశ్వనాథుడు విశాలాక్షీమనోభర్త సు
శ్లోకున్ దొడ్డయ యల్లభూవరతనూజున్ వీరభద్రేశ్వర
త్ప్రాకాంతుంజగనొబ్బగండని మహైశ్వర్యాన్వితుం జేయుతన్"

ఆ దివ్యవాణి శంఖారావమువలె సమస్త రాజమహేంద్ర వర సామ్రాజ్యమునందును మార్మ్రోగెను. ఆస్వరము విజయాంబికా బాచయ్యల మనస్సులలోను, వేమారెడ్డి హరిహరాంబల హృదయములలోను, వరదారెడ్డి శ్యామలాంబల తలపులలోను, కల్యాణగీతికవలె మంగళప్రదముగ వినిపించెను.

శ్రీనాథకవీంద్రుల గంభీరవాక్కును, దివ్యోజ్జ్వల రూపమును హృదయమున ప్రవేశించుటతో, వేమారెడ్డి బాచయ్యల వంటి విరాగుల కనురాగోదయమును, వరదారెడ్డివంటి విలాసమూర్తులకు జ్ఞానోదయమును కలిగినట్లయి, అశేష రాజమహేంద్రవర ప్రజాజీవితమునకే మహోదయమైనట్లు తోచినది.

ఇతి శివమ్

